మన సమగ్ర
# ప్రజావాణి
తెలుగు డైలీ
RNI NO:TGTEL/25/A5443
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

రాజన్న సిరిసిల్ల | శనివారం | 31.10.2026 | సంపుటి : 01 | సంచిక : 301 | పేజీలు : 12 | వెల : 2/-
RAJANNA SIRICILLA | SATURDAY | 31.10.2026 | Volume : 01 | Issue : 301 | Pages : 12 | Cost : 2/-

## మియాపూర్ భూములను విక్రయిస్తాం!

- రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానివే.. సుప్రీంకోర్టు తీర్పుపై సీఎం హర్షం
- భూముల విక్రయం ద్వారా వచ్చే నిధులు నీటిపారుదల, విద్యా, వైద్య రంగాలకు
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు.. మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం
- ఢిల్లీలో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్ 30 :** మియాపూర్‌లో సుమారు రూ.50 వేల కోట్ల విలువైన భూములు ప్రభుత్వానికి చెందుతాయని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన సర్వోన్నత న్యాయ స్థానానికి ధన్యవాదాలు తెలిపారు. మియాపూర్ భూములను విక్రయించి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తామని ప్రకటించారు. ముఖ్యంగా నీటిపారుదల, విద్యా, వైద్య తదితర కీలక రంగాలకు ఈ నిధులను కేటాయిస్తామని వెల్లడించారు. శు క్రవారం ఢిల్లీలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం ఈ వివరాలు వెల్లడించారు. మియాపూర్ భూముల విక్రయంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రేవంత్‌రెడ్డి మిగతా2లో...

## ప్రజల జీవితాల్లో మార్పే వాస్తవ అభివృద్ధి

- 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఉపాధి, విద్య, వైద్యం, జీవన భద్రతకు ప్రాధాన్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్,అక్టోబర్ 30 :** ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన అభివృద్ధి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఆర్థిక వృద్ధి కేవలం గణాంకాలకే పరిమితం కాకు ండా ప్రతి కుటుంబానికి మిగతా2లో...

## జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన!

ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ

ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాలకు తాత్కాలిక మినహాయింపు

**న్యూఢిల్లీ,అక్టోబర్ 30 :** దేశవ్యాప్తంగా 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అక్టోబర్ 30న అధికారిక ప్రకటన జారీ చేసింది. ఎన్నికలు జరగనున్న మిగతా2లో...

## పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం!

- ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలి
- ఫిర్యాదులపై తక్షణ స్పందన..
- నిష్పక్షపాత విచారణకు ఆదేశాలు

**అమరావతి,అక్టోబర్ 30 :** తీర ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేతా అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల పరిశీలకులు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి శుక్రవారం సీడీఎంఏ సంపత్‌కుమార్, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, డీఐజీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మిగతా2లో...

## మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్సే

- సుప్రీంకోర్టులో ఎనిమిదేళ్ల పాటు న్యాయపోరాటం చేశాం
- భూములను విక్రయించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకించిన హరీశ్‌రావు

**హైదరాబాద్,అక్టోబర్ 30 :** మియా పూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే సుప్రీంకోర్టులో మిగతా2లో...

## హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి!

- తెలంగాణకు ప్రకటించిన మూడు కారిడార్లకు త్వరగా అనుమతులు ఇవ్వాలి
- కొత్త రైల్వే మార్గాల మంజూరుకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- అనంతారంలో మెగా ఫ్రైట్ నిర్వహణ డిపో ఏర్పాటు చేయండి

2లో

## రైతాంగ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- రూ.2 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

2లో

## సింగరేణి కార్మికులకు దీపావళి కానుక!

- ఒక్కో కార్మికుడికి గరిష్టంగా
- రూ.1,10,250 బోనస్
- నవంబర్ 5న బ్యాంకు
- ఖాతాల్లో జమ.. భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్ 30 :** సింగరేణి కార్మికు లకు రాష్ట్ర ప్రభుత్వం దీపావళి కానుక ప్రకటించింది. నవం బర్ 5న కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. ఒక్కో అర్హత కలిగిన కార్మికుడికి గరిష్టంగా రూ. 1,10,250 చొప్పున మొత్తం 38 వేల మందికి రూ.419 కోట్లు చెల్లించనున్నారు. ఇప్పటికే దసరా లాభాల వాటా కింద రూ.600 కోట్లు చెల్లించగా, మిగతా2లో...

## ప్రజల కోసమే కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం

- రైతులు, యువత, ఆదివాసీల సంక్షేమమే లక్ష్యం
- పంటలు వేయొద్దన్న సీఎం అధికారంలో ఉండొద్దు
- ఇంద్రవెల్లి పాంచజన్య సంకల్ప సభలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ఇంద్రవెల్లి,అక్టోబర్ 30 :** ప్రజలకు మేలు చేసేందుకే కొత్త రాజకీయ శక్తిగా ముందుకు వచ్చామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలో ఆమె మాట్లాడారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఆదివాసీల అభివృద్ధి, విద్య, వైద్యం, సాగునీటి సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జిల్లాలోని 750 గ్రామాలకు కనీసం పాఠశాలలు కూడా మిగతా2లో...

# హైస్పీడ్ రైలు మార్గాల పనులు వేగవంతం చేయండి!

**న్యూఢిల్లీ,అక్టోబర్ 30 :** తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైలు మార్గాల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. హైదరా బాద్ పుణె, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్లకు సంబంధించి కేంద్రం పంపిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి, కొన్ని మార్పులను సూచిస్తూ తిరిగి పంపినట్లు తెలిపారు. కేంద్రం త్వరగా మార్గాల అమరికను ఖరారు చేస్తే భూసేకరణ ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.శుక్రవారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో కేంద్ర మంత్రితో సీఎం సమావేశమై తెలంగాణకు అవసరమైన కీలక రైల్వే ప్రాజెక్టులపై చర్చించారు. వికారాబాద్‌కృష్ణా మధ్య 130 కిలోమీటర్ల కొత్త రైల్వే మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు ఉన్నందున ఆ ప్రాంతాన్ని సిమెంట్, వస్త్ర పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్ చుట్టూ నిర్మిస్తున్న సుమారు 360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్డు పక్కనే ప్రాంతీయ రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేలా మార్గాన్ని ఖరారు చేయాలని సీఎం కోరారు. ఈ రైలు మార్గం అందుబాటులోకి వస్తే పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు.డోర్నకల్‌గద్వాల, కల్వకుర్తి మాచర్ల, కాచిగూడజగ్గయ్యపేట (250 కి.మీ.), పటాన్‌చెరుఆదిలాబాద్ (320 కి.మీ.), బోధన్‌లాతూర్ (175 కి.మీ.), అక్కన్నపేట బైపాస్ (8 కి.మీ.) రైల్వే మార్గాలకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.మహబూబాబాద్ సమీపంలోని అనంతారం గ్రామంలో దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించిన మెగా కోచింగ్, సరుకు రవాణా నిర్వహణ డిపోను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిపో కోసం అవసరమైన 409 ఎకరాల ఒక గుంట భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని తెలిపారు. ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్ భూములను విక్రయిస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ఈ భూముల విక్రయం, వాటి ద్వారా వచ్చే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను పరిరక్షించినట్లు వివరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంతో పాటు వాటిని ప్రజా ప్రయోజనాలకు వినియోగించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు.మియాపూర్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విలువైన భూములను ఆక్రమించేందుకు గత బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని సీఎం ఆరోపించారు. మియాపూర్ భూముల వ్యవహారంలో కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్ పేర్లను ప్రస్తావిస్తూ విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే భూ ఆక్రమణలపై పోరాటం చేశానని తెలిపారు.

కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ, మంచిరేవుల ప్రాంతాల్లోని భూముల పరిరక్షణకు న్యాయపోరాటం చేసినట్లు వివరించారు. గుర్రంగూడలోని భూములు అటవీ భూములేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. మంచిరేవులలో 143 ఎకరాల భూమిని కూడా పరిరక్షించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోనూ ప్రభుత్వ, అటవీ భూముల పరిరక్షణ కోసం న్యాయపోరాటం చేసినట్లు సీఎం పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ భూముల వ్యవహారాలపై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఈ అంశాలపై శాసనసభలో చర్చించేందుకు బీఆర్ఎస్ నాయకులు ముందుకు రావాలని సవాల్ విసిరారు. మియాపూర్ భూముల విషయంలో ఇకనైనా వివాదాలు సృష్టించకుండా, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు సహకరించాలని కేటీఆర్, హరీశ్‌రావులకు సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

# ప్రజల కోసమే కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

లేవని, ఆదిలాబాద్ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేపీ రావు, జగన్నాథ ప్రాజెక్టులు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసి ఉంటే రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు. రైతులకు నీరు, విద్యుత్, యూరియా అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పంటలు వేయొద్దని సూచిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలో ఎందుకు కొనసాగాలని ప్రశ్నించారు.తమ పార్టీ పాంచజన్య పేరుతో ఐదు ప్రధాన అంశాలను లక్ష్యంగా పెట్టుకుందని కవిత తెలిపారు. ప్రైవేటు రంగంలోనూ మెరుగైన ఉచిత విద్య, వైద్యం అందించేందుకు కృషి చేస్తామని, యువతకు రుణాలు కల్పించి ఆర్థికంగా ఎదిగేలా తోడ్పడతామని హామీ ఇచ్చారు. రైతులకు సాగునీరు, విద్యుత్, ఎరువులు అందించి వారి గౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమన్నారు. ఆదిలాబాద్‌లో రైతు గర్జన సభ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ముందుగా గతంలో తాము చేసిన పనులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సభకు ముందు ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద కుమురం భీం, కుమురం సూరు, రాంజీ గోండు, వన్నెల ఎల్లన్న, వెడ్మ రాములకు నివాళు లర్పించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ బాపూరావు, మాజీ మంత్రి బోడ జనార్ధన్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతాంగ సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు లేకుండా సబ్‌స్టేషన్ల ఏర్పాటు**

**రూ.2 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం**

**రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్,అక్టోబర్ 30 :** వ్యవసాయ రంగానికి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పలు ప్రతిపాదనలు చేశారని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ పెరగడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఇతర ప్రాంతాల నుంచి విద్యుత్ తీసుకొస్తున్నామని వివరించారు.ప్రజలకు తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటలు సాగు చేయాలని, రబీ పంటల సాగుపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సర్పంచ్ బండి భగవాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటర్ల నమోదు పారదర్శకంగా జరగాలి

**తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే చట్టపరమైన చర్యలు**

**అధికారులకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు**

**హైదరాబాద్,అక్టోబర్ 30 :** పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు ఎలా జరుగుతోందో, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎదుర్కొంటున్న సమస్యలేమిటో అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని, అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖా స్తుదారులు సమర్పించిన ఫారం-18, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటరుగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, అల్వాల్ తహశీల్దార్ రాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జనవరి 25 నుంచి దేశవ్యాప్తంగా జనగణన!

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తరప్రదేశ్, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ప్రస్తుతం జనగణన నుంచి మినహాయింపు ఇచ్చింది. లడఖ్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోని మంచు ప్రభావిత ప్రాంతాల్లోనూ ఈ షెడ్యూల్ వర్తించదు.జనగణనలో భాగంగా 2027 జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) చేసుకునే అవకాశం కల్పించనున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలను సేకరిస్తారు. మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. 2027 మార్చి 1 అర్ధరాత్రి 12 గంటలను జనగణన ప్రామాణిక తేదీగా నిర్ణయించారు. మినహాయింపు పొందిన రాష్ట్రాలు, ప్రాంతాలకు సంబంధించిన తేదీలను తరువాత ప్రకటించనున్నారు.

# పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల నిర్వహణ, శాంతిభద్రతలు, రాజకీయ పార్టీల ఫిర్యాదులు, పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం, పక్షపాతం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణం కల్పించాలని పునేఠా స్పష్టం చేశారు.ఎన్నికల ప్రారంభ దశలో ఏడు జిల్లాల నుంచి అందిన ఫిర్యాదులను డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లకు పంపించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓటర్ల సంఖ్య, భద్రతా ఏర్పాట్లు, కేంద్రం వివరాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మల్లికార్జున సూచించారు.ఒక్క బ్యాలెట్ పేపర్ కూడా గల్లంతు కాకుండా పటిష్ఠ భద్రత కల్పించాలని, స్ట్రాంగ్‌రూమ్‌లకు సుమారు 100 మీటర్ల దూరంలో ప్రత్యేక నియంత్రణ గది ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా ఎవరూ పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. ఓటింగ్ గోప్యతకు భంగం కలగకుండా మీడియా ప్రతినిధులు వ్యవహరించాలని సూచించారు.సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి కదలికను రికార్డు చేయాలని ఐజీ బి.రాజకుమారి ఆదేశించారు. పోలీసు సిబ్బంది సైతం ప్రిసైడింగ్ అధికారి అనుమతితోనే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని, కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో గుంపులు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

# సింగరేణి కార్మికులకు దీపావళి కానుక!

(మొదటి పేజీ తరువాయి)

తాజా బోనస్‌తో కలిపి ఒకే నెలలో కార్మికులకు అందుతున్న మొత్తం రూ.1,020 కోట్లకు చేరనుంది. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి నవంబర్ 5న కార్మికుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ బోనస్ జాతీయ వేతన ఒప్పందం (ఎన్‌సీడబ్ల్యూఏ) పరిధిలోని కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 30 రోజులు పనిచేసిన వారు అర్హులు. నిర్ణీత పనిదినాలు పూర్తి చేసిన వారికి పూర్తి బోనస్, అంతకంటే తక్కువ రోజులు పనిచేసిన వారికి పని చేసిన కాలానికి అనుగుణంగా బోనస్ చెల్లించనున్నారు.

# ప్రజల జీవితాల్లో మార్పే వాస్తవ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన ఉపాధి, విద్య, వైద్యం, జీవన భద్రత కల్పించాలని స్పష్టం చేశారు.డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ సంస్థ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలను సమర్థంగా అమలు చేయడంలో అధికారులకు శిక్షణనిచ్చే సంస్థల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఉద్యోగుల నైపుణ్యాలు, పనితీరు మెరుగుపడినప్పుడే ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని అన్నారు. హైదరాబాద్‌లో సాంకేతిక పరిజ్ఞానం, జీవశాస్త్ర పరిశోధనలు, ఆధునిక సేవారంగాలు సాధించిన ప్రగతి రాష్ట్రానికి గొప్ప అవకాశమని భట్టి తెలిపారు. ఈ అభివృద్ధి నగరానికే పరిమితం కాకుండా తయారీ, వ్యవసాయ, గ్రామీణ ఆర్థిక రంగాలకు విస్తరించాలని ఆకాంక్షించారు. యువత ఉపాధి కోసం హైదరాబాద్‌కు మాత్రమే వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత జిల్లాల్లోనే మెరుగైన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

# మియాపూర్ భూమిని కాపాడింది బీఆర్ఎస్సే

(మొదటి పేజీ తరువాయి)

న్యాయపోరాటం చేసిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. 2015లో సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్‌ను నియమించి ప్రభుత్వానికి అనుకూలంగా వాదనలు వినిపించేలా చేశామని పేర్కొన్నారు.2015 నుంచి 2023 వరకు దాదాపు ఎనిమిదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కేసును నిరంతరం కొనసాగించిందని హరీశ్‌రావు వివరించారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లు, అఫిడవిట్లు, ఆధారాల సమర్పణలో తమ ప్రభుత్వ పాత్ర కీలకమని చెప్పారు. 2023 జూన్ 15న ట్రినిటీ ఇన్‌ఫ్రావెంచర్స్ కేసులో వచ్చిన తీర్పు కూడా మియాపూర్ భూముల కేసుకు బలమైన న్యాయపునాది వేసిందన్నారు.సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని హరీశ్‌రావు విమర్శించారు. గత ప్రభుత్వ కృషికి ప్రస్తుత ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని ఆరోపించారు. సుమారు రూ.60 వేల కోట్ల విలువైన 550 ఎకరాల భూములను విక్రయించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచనను ఆయన వ్యతిరేకించారు. ప్రజా ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

# గ్రామ పంచాయతీలకు ఐదేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక

**● గ్రామాల వారీగా వివరాల సేకరణకు ప్రభుత్వం ఆదేశాలు**

**హైదరాబాద్,అక్టోబర్ 30 :** రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ఐదేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రస్తుత ఏడాదికి ప్రత్యేక కార్యాచరణతో పాటు రానున్న మూడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు.గ్రామాల వారీగా జనాభా, పశువులు, పంటలు, నిరుద్యోగులు, పేద కుటుంబాల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. అందుబాటులో ఉన్న నిధులను సమీకరించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తప్పుడు సమాచారం ఇచ్చినా, వివరాల నమోదు నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రం పరిశీలన

- సిట్‌యామ్స్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన పెనుమూరు అధికారులు

**పెనుమూరు ప్రజావాణి ప్రతినిధి అక్టోబర్ 30** చిత్తూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా శుక్రవారం పెనుమూరు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), ఎంపీడీఓ కలిసి చిత్తూరులోని సిట్‌యామ్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల అనంతరం భద్రపరిచే బ్యాలెట్ పెట్టెల భద్రత, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు కేంద్రంలో అవసరమైన సదుపాయాలు, భద్రతా చర్యలను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులు దృష్టి సారించారు.

# ఉద్దాన గ్రామాల్లో నిలిచి పోయిన ఎయిర్ టెల్ సేవలు

- ఐదు రోజుల గా ఇబ్బంది పడుతున్న ఎయిర్టెల్ వినియోగదారులు
- పట్టించుకోని ఎయిర్ టెల్ సంస్థ

**పలాస ప్రజావాణి ప్రతినిధి** ఉద్దానం గ్రామాల్లో ఐదు రోజులు గా ఎయిర్టెల్ నిలిచాయి.. ఇబ్బంది పడుతున్న ఎయిర్టెల్ వినియోగదారులు ..పట్టించుకోని ఎయిరెల్ట్ సంస్థలు.సాంకేతిక పరిజ్ఞానం తో ఏర్పాటు చేసిన నెట్ వర్క్ సమాచారము కోసము రంగము లోకి దిగిన ఎయిర్టెల్ లాంటి పెద్ద సంస్థ అంతరాయాలను పట్టించుకోవడం లేదని ఇక్కడ ఉద్దాన వినియోగదారులు ఆగ్రహము వ్యక్తము చేస్తున్నారు.విద్యుత్ సరఫరా విషయంలో ఆశాఖ అన్నిరకాల చర్యలు తీసుకొని విద్యుత్ సరఫరా చేశారు.చివరకు ప్రజలకు టివి చానెల్ కూడా ఇక్కడ పునరుద్ధరణ చేశారు.ఎంతో పెద్ద సంస్థ అయిన ఎయిరేటెలే సంస్థ నిర్లక్ష్యం చేస్తున్నారు. అప్పటి కైన ఎయిర్టెల్ సంస్థ అంతరాయాలను పట్టించుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటి కైన ఎయిర్టెల్ సంస్థ అంతరాయాలను సరిచేయాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు

# ఆదిత్యనగర్ లో నివాస ప్రాంతాల్లో ఎస్టీపీల నిర్మాణంను నిలిపివేయాలి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్

**శేరిలింగంపల్లి: (ప్రజావాణి)** శేరిలింగంపల్లి పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీలో నివాస సముదాయాల మధ్య మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ - STP) నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనను కలిసి వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీతారామరాజు ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వివరించారు.ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ, కాలనీలో ప్రజలు నివసించే గృహాల మధ్యలో ఎస్టీపీల నిర్మాణం చేపట్టడం వల్ల దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు, కీటకాలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలు, వృద్ధుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రత్యామ్నాయ స్థలాల్లో ఈ ఎస్టీపీలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణమే ఈ నిర్మాణ పనులను నిలిపివేసి, శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.ఈ వినతిపై కమిషనర్ సృజన సానుకూలంగా స్పందిస్తూ, సమస్యను పరిశీలించి కాలనీవాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదిత్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు వెంకటరెడ్డి, భరత్, సీతారామరాజు, మహేష్ యాదవ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఢిల్లీ ప్రజాస్వామ్య పరిరక్షణ మహా ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణుల తరలింపు

- కూకట్‌పల్లి నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభించిన బండి రమేష్
- ఓటు హక్కుల పరిరక్షణే లక్ష్యం.. రాజ్యాంగాన్ని కాపాడటమే మా సంకల్పం: బండి రమేష్

**కూకట్‌పల్లి అక్టోబర్ 30 (ప్రజావాణి)** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటానికి మద్దతుగా ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న మహా నిరసన ర్యాలీకి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మహా ర్యాలీలో పాల్గొనేందుకు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, తెలంగాణ ప్రభుత్వ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ జెండా ఊపి ఘనంగా వీడ్కోలు పలికారు.ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని ప్రజల ఓటు హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలకు బీజేపీ ప్రభుత్వం పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో అగ్రనేత రాహుల్ గాంధీ చేపడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి సంఘీభావంగా ఢిల్లీలో ఈ భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని, ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.కూకట్‌పల్లి నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు ఢిల్లీ ర్యాలీకి తరలివెళ్లడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.జై కాంగ్రెస్.. జై హింద్!

# పోరుమామిళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు 'మహారాజ్ రెస్టారెంట్'లో విస్తృత తనిఖీలు.. చికెన్ లాలిపాప్ శాంపిల్స్ ల్యాబ్‌కు గుర్తింపు!

**పోరుమామిళ్ల (కడప జిల్లా ప్రజావాణి అక్టోబర్ 30):** ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడిచే హోటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తమ నిఘాను తీవ్రం చేశారు. కడప జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (ఖీూా) హరిత ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం పోరుమామిళ్ల మండల కేంద్రంలోని స్థానిక ప్రముఖ 'మహారాజ్ ఫ్యామిలీ రెస్టారెంట్'లో ఒక్కసారిగా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇటీవల ఈ రెస్టారెంట్‌లో ఆహార నాణ్యత సరిగా లేదని, వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు, నమ్మకమైన సమాచారం మేరకు అధికారులు రంగంలోకి దిగి ఈ సోదాలు నిర్వహించారు.

**కిచెన్ లో అపరిశుభ్రత.. చికెన్ లాలిపాప్ నమూనాలు సేకరణ:**
తనిఖీల్లో భాగంగా రెస్టారెంట్‌కు సంబంధించిన వంటగది (కిచెన్), స్టోర్ రూమ్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. హోటల్‌లో వంటకు ఉపయోగిస్తున్న నూనెలు, మసాలా దినుసులు మరియు చికెన్, మటన్ నిల్వలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో మెనూలో ప్రత్యేకంగా ఉండే 'చికెన్ లాలిపాప్' తయారీలో వాడుతున్న కొన్ని పదార్థాలు, రంగులు మరియు నాణ్యతపై అధికారులకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. తక్షణమే స్పందించిన ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హరిత గారు చికెన్ లాలిపాప్‌కు సంబంధించిన కొన్ని ఆహార నమూనాలను (శాంపిల్స్) ప్రత్యేక కిట్‌లలో సేకరించారు. వీటిని కల్తీ నిర్ధారణ మరియు పూర్తిస్థాయి రసాయన పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ఫుడ్ సేఫ్టీ లాబొరేటరీకి ల్యాబ్ నివేదిక నిమిత్తం పంపించినట్లు అధికారులు వెల్లడించారు.

**నివేదిక ఆధారంగా కఠిన చర్యలు -- ఎఫ్ఎస్ఓ హరిత హెచ్చరిక:**
ఈ సందర్భంగా కడప జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి హరిత మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహారాజ్ రెస్టారెంట్‌లో సేకరించిన చికెన్ లాలిపాప్ నమూనాల ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తర్వాత, అందులో ఏదైనా కల్తీ లేదా హానికరమైన రంగులు, రసాయనాలు ఉన్నట్లు తేలితే సదరు హోటల్ యాజమాన్యంపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ (ఖీూాా×) ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే హోటల్ లైసెన్స్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

**యాజమాన్యానికి తగు సూచనలు, నోటీసులు:**
తనిఖీల సందర్భంగా హోటల్ కిచెన్ పరిసరాలు మరింత పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ ఉంచిన మాంసాన్ని వినియోగించకూడదని హోటల్ యజమానికి అధికారులు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. వంట చేసే మాస్టర్లు తప్పనిసరిగా హెయిర్ క్యాప్స్, గ్లౌజెస్ ధరించాలని, అలాగే వినియోగదారులకు నాణ్యమైన, తాజా ఆహారాన్ని మాత్రమే వడ్డించాలని యజమానికి పలు తగు సూచనలు జారీ చేశారు. హోటల్‌లో గుర్తించిన కొన్ని లోపాలపై తక్షణమే వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ నోటీసులు కూడా జారీ చేసినట్లు సమాచారం.

**వినియోగదారుల హర్షం:** పోరుమామిళ్ల వంటి మండల కేంద్రాల్లో సైతం హోటళ్లలో ఆహార నాణ్యత లోపిస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్న తరుణంలో, ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి మహారాజ్ రెస్టారెంట్‌లో తనిఖీలు చేపట్టడంపై స్థానిక ప్రజలు, వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగించాలని వారు కోరుతున్నారు.

# పుట్టపర్తి అభివృద్ధి, ప్రజల భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి:

- ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**అనంత పురం బ్యూరో అక్టోబర్ 30 ప్రజా వాణి** పుట్టపర్తి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా, ఆర్థికంగా రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి పట్టణ సమగ్రాభివృద్ధికి ప్రజలు సహకరించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు.పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన ముగింపు ర్యాలీకి ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తల నుంచి అపూర్వ స్పందన లభించిందని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో పుట్టపర్తి అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.గత ఐదేళ్లలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందిలి : 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రం అనేక రంగాల్లో వెనుకబడిందని, అవినీతి, అక్రమాలు, ఆర్థిక విధ్వంసంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. లిక్కర్ స్కామ్, రుషికొండ ప్యాలెస్ వంటి అంశాలను ప్రస్తావిస్తూ రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ప్రజలు గుర్తించాలని అన్నారు. రాష్ట్రంలో మార్పు కోరుకున్న ప్రజలు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంపై నమ్మకంతో కూటమికి అఖండ విజయాన్ని అందించారని తెలిపారు.

సంక్షేమానికి చిరునామా కూటమి ప్రభుత్వంలి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.4,000, రూ.6,000, రూ.15,000 వరకు పింఛన్లు అందించడం, తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.20,000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాలు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని వివరించారు.

చంద్రబాబు నాయకత్వంలో ఏపీకి పెట్టుబడుల వెల్లువలి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, దేశవ్యాప్తంగా వస్తున్న అభివృద్ధి పెట్టుబడుల్లో 28 శాతం రాష్ట్రానికి రావడం ఆయన నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.పుట్టపర్తి నియోజకవర్గం రూపురేఖలు మార్చనున్న భారీ ప్రాజెక్టులులి: పుట్టపర్తి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు పలు కీలక ప్రాజెక్టులను తీసుకువస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు.1. డిఫెన్స్, స్పేస్ హబ్‌లి : దేశ రక్షణ రంగానికి అవసరమైన యుద్ధ విమానాల తయారీ కేంద్రం, డి ఆర్ డి ఓ, ఏ ఎం సీ ఏ ప్రాజెక్టు పుట్టపర్తి ప్రాంతానికి రావడం గర్వకారణమని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పుట్టపర్తి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు2. మహిళలకు ఉపాధి -- మహాజన్ ఇండస్ట్రీస్: పుట్టపర్తి మండలంలోని పెడబల్లి సమీపంలో 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న మహాజన్ ఇండస్ట్రీస్ జీన్స్ తయారీ యూనిట్ ద్వారా స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.3. రిలయన్స్ సోలార్ ప్రాజెక్టు:లి సుమారు రూ.51,300 కోట్ల పెట్టుబడితో, 31,750 ఎకరాల విస్తీర్ణంలో 6,600 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు కానున్న రిలయన్స్ సోలార్ ప్రాజెక్టు పుట్టపర్తి అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 4,500 మందికి ప్రత్యక్షంగా, మరో 2,000 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.ఈ ప్రాజెక్టులన్నీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే స్థానిక యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఉపాధి, వ్యాపారులకు అవకాశాలు పెరిగి పుట్టపర్తి ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

ప్రజల ఓటే పుట్టపర్తి భవిష్యత్తుకు పునాది మన పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా, మన పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలన్నా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మహాభారతంలో అర్జునుడికి పక్షి కన్ను మాత్రమే కనిపించినట్లుగా, పోలింగ్ బూత్‌లో ఓటు వేసే సమయంలో ప్రజల దృష్టి కూటమి అభ్యర్థుల గుర్తులపైనే ఉండాలని పిలుపునిచ్చారు.

28 వార్డుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించండిలి: నవంబర్ 1వ తేదీన జరగనున్న పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 28 వార్డుల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి అభ్యర్థులకు కేటాయించిన సైకిల్, గ్లాస్, కమలం గుర్తులపై ఓటు వేసి విజయాన్ని అందించాలని కోరారు. జనసేన పార్టీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయ మేకల ఈశ్వర్ ని భారీ మెజారిటీతో గెలిపించి పుట్టపర్తి పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రజలను అభ్యర్థించారు.చివరిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు, తన కుటుంబానికి పుట్టపర్తి ప్రజలు అందించిన ఆదరణ, అభిమానాన్ని ఎన్నటికీ మరువలేనని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీస్సులతో పుట్టపర్తిని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలపడమే తన లక్ష్యమని భారీ బహిరంగ సభలో స్పష్టం చేశారు.

# అధికారిక అనుమతులు లేవు.. కూపన్లు అంతకంటే లేవా..?

- చిన్న మండవలో తుఫాను తర్వాత మళ్లీ మొదలైన ఇసుక రవాణా...!
- కూపన్లు లేకపోవడంతో నిలిచిపోయిన ఇసుక ట్రాక్టర్లు..?
- నిన్న మొన్నటిదాకా ఒక దందా.. నేడు ఆ దందా ఆగనంటోందా..?
- మన ప్రజావాణి ప్రత్యేక కథనం..



చిన్న మండవ వ్యవహారంలో అధికారుల ఉదాసీనత...?

- ఉలుకు పలుకులేని అధికార యంత్రాంగం..?
- ఆగ మేఘాల మీద రెవెన్యూ సమావేశం...?
ఇంతకీ...!
- మ్యానువల్ బిల్లులు అక్రమ వసూళ్లపై విచారణ చేస్తారా... లేక సద్దుబాటు చేస్తారా...?
ఆగ మాగం అగమ్య గోచారం..

ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి
ఖమ్మం జిల్లా చింతకాని మండలం చిన్న మండవ ప్రభుత్వ ఇసుక క్వారీ వద్ద రెవెన్యూ ఉద్యోగుల అక్రమ బినామీ ఫోన్ పేలు మ్యానువల్ బిల్లులపై సంబంధిత శాఖ అధికారులు ఆరా తీసి సర్దుబాటు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తోంది. ప్రధా నంగా ప్రభుత్వ ఆదాయానికి అనుమతులు అనే సాకుతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగ్గొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న సంబంధిత రెవెన్యూ మైనింగ్ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించడం సంచలనం కలిగిస్తోందని సమాచారం. మన ప్రజావాణి వరుస కథనాలకు జిల్లా స్థాయి అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. కానీ యధావిధిగా సర్దుబాటు చేసుకున్నట్లు పలువురు మండల ప్రజలు స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. మన ప్రజావాణి కథనంలో పేర్కొన్న అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినప్పటికీ కొందరు ప్రశ్నించే గొంతుకలు సైతం నైతిక మద్దతు ప్రకటించడం విశేషం. ఇప్పటికైనా సంబంధిత జిల్లా కలెక్టర్ రెవిన్యూ డివిజనల్ అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న మ్యానువల్ బిల్లులపై అక్రమ వసూళ్లపై సమగ్రంగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి**
ఖమ్మం జిల్లా చింతకాని మండలం చిన్న మండవలో ఇసుక అక్రమ దందా యదేచ్ఛగా కొనసాగుతున్న సంబంధిత రెవెన్యూ మైనింగ్ విజిలెన్స్ రోడ్డు రవాణా శాఖ అధికారులు చలనం లేకపోవడం గత కొంతకాలంగా బహిరంగంగా జరుగుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా అర్ణబ్ తుఫానుకు ముందు మ్యానువల్ బిల్లులతో బహిరంగ కొనసాగిన ఇసుక దందా ఇప్పుడు ఎటువంటి ఆమోదముద్రలు అనుమతులు కూపన్లు లేకుండా తెల్లవారేసరికి ట్రాక్టర్లలో ఇసుకను నింపుకొని వెళ్ళిపోగా సంబంధిత రెవెన్యూ సిబ్బంది విధులకు హాజరయ్యే సమయానికి సుమారు 30 ట్రాక్టర్లు ఇసుకను నింపుకొని ఎటువంటి అనుమతులు కూపన్లు లేకపోవడంతో ప్రస్తుతం అక్కడ నిలిచి ఉన్నట్లు సమాచారం అందింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిన కొందరు రెవెన్యూ అధికారులు సిబ్బంది చేతివాటం మూలంగా ఇసుక అక్రమ రవాణా అనేక మలుపులు తిరుగుతూ ఆగనంటోంది అనే విధంగా కొనసాగడం పట్ల మధిర నియోజకవర్గ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా ట్రాక్టర్లకు అనుమతి పత్రాలతో పాటు మైనర్లు డ్రైవర్లుగా అవతారమెత్తి మితిమీరిన వేగంతో రోడ్లను ధ్వంసం చేస్తూ అక్రమ వ్యాపారం జోరుగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక పలు ఆరోపణలు విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. మ్యానువల్ బిల్లులు తో ఇటీవల దాకా అక్రమ రవాణా జరిగిన వ్యవహారంపై మన ప్రజావాణి ప్రత్యేక వరుస కథనాలు అందించిన సంగతి తెలిసిందే. కాగా శుక్రవారం తెల్లవారుజామున ఇసుక రీచ్ కు వెళ్లిన ట్రాక్టర్లు కొన్ని అక్రమ పద్ధతుల్లో వెళ్లిపోయినట్లు కొన్ని ప్రస్తుతం నిలిచిపోయినట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు నియోజకవర్గ ప్రజలు ప్రజాసంఘాల నేతలు కోరుతున్నారు.

# అనంతపురం ప్రశాంతంగా ఉండాలంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించండి

- రోడ్ షోలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు అనంత, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, సీపీఐ నేత జగదీష్, మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్

**అనంతపురం బ్యూరో అక్టోబర్ 30 ప్రజా వాణి** అనంతపురం నగరం ప్రశాంతంగా ఉండాలంటే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కోరారు. మేయర్, కార్పొరేటర్ ఎన్నికల్లో వైసీపీ, సీపీఐ అభ్యర్థులకు ప్రజలు పట్టం కట్టాలని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు శుక్రవారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల హాస్టల్ వద్ద నుంచి సప్తగిరి సర్కిల్ వరకు వైఎస్ఆర్‌సీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనంతపురంలో పరిస్థితి ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలని కోరారు. మరోసారి పొరపాటు చేస్తే అనంతపురం కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిపోతుందని అన్నారు. గత ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాలను కూడా నిలిపివేశారన్నారు. రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా మార్చేశారని విమర్శించారు. జిల్లా కేంద్రమైన అనంతపురంలో దోపిడీపాలన సాగుతోందన్నారు. కూటమి నాయకులకు డబ్బులు ఇస్తేనే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరుగుతున్నాయని అన్నారు. అనంతపురం మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌తో పాటు 60 డివిజన్లలో వైసీపీ అభ్యర్థులను, 2 డివిజన్లలో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ నిరంకుశంగా జరుగుతోందని మండిపడ్డారు. పోరాటాల అనంతపురంలో అరాచకాలు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆయన అనుచరులు సాగించిన అరాచకాలను ప్రజలు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. నగరంలో సామాన్యుల నుంచి వ్యాపారుల వరకు ఎవరూ కూడా మనశ్శాంతిగా బతికే పరిస్థితి లేదన్నారు. ఇల్లు కట్టుకోవాలన్నా డబ్బులు ఇచ్చుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని తెలిపారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండాపోతుందని అన్నారు. వైఎస్ఆర్‌సీపీని గెలిపిస్తే జిప్రశాంత అనంతపురంతో పాటు అవినీతిపరులు, దౌర్జన్యకారుల నుంచి రక్షణ కల్పిస్తామని తెలిపారు. ప్రజలను కాపాడుకుంటాం.. కాపలాదారులుగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. మేయర్ ఎన్నికల్లో గెలవడానికి ఢిల్లీ నుంచి డబ్బు మూటలతో వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్నదమ్ముల్లా ఉన్న మన మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అవినీతికి లైసెన్స్ ఇచ్చినట్టేనని అన్నారు. పోలింగ్ సమయంలో కూటమి నేతల దౌర్జన్యాలకు ఎవరూ భయపడొద్దని, కార్యకర్తలను తాకాలంటే ముందుగా తనను దాటాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజలు ధైర్యంగా వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. వైసీపీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేసిన జగన్‌కు.. అపద్ధపు హామీలు, అరాచక పాలన సాగిస్తున్న చంద్రబాబుకు మధ్య ఈ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు జోక్యంతో 19 చోట్ల మళ్లీ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందంటే కూటమి నాయకులు ఎలాంటి కుట్రలు, అరాచకాలు చేశారో ప్రజలు గమనించాలన్నారు. అనంతపురం మేయర్‌గా రమేష్‌తో పాటు 62 డివిజన్లలో వైసీపీ, సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర నేత జగదీష్ మాట్లాడుతూ వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌కు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. రమేష్ గౌడ్ గెలుస్తాడనే ఢిల్లీలో వణుకు మొదలైందని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని దొడ్డిదారిలో ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందరూ కలిసికట్టుగా ఎదుర్కొని రమేష్‌గౌడ్‌ను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఏ ఇంటికి వెళ్లినా తాము గత ఎన్నికల్లో కూటమికి ఓటు వేసి తప్పుచేశామని చెబుతున్నారని తెలిపారు. సుదీర్ఘమైన రాజకీయ అనుభవం ఉన్న అనంత వెంకటరామిరెడ్డి వంటి లీడర్‌ను పోగొట్టుకున్నామని బాధపడుతున్నారన్నారు. భూగర్భ విద్యుత్ కేబుల్, విమానాశ్రయం అంటూ కూటమి నేతలు అరచేతిలో వైకుంఠం చూపుతున్నారని.. అనంతపురం ప్రజలకు మొదటగా ప్రశాంతత కావాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ గల్లీ నుంచి ఢిల్లీ వరకు లీడర్లను పిలిపించి షో చేస్తున్నారని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఉండి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ పనులు ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. అనంతపురంను అవినీతికి కేరాఫ్‌గా మార్చడానికే ట్రిబుల్ ఇంజన్ సర్కార్ కావాలని కూటమి నేతలు కోరుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టడానికి వందలాది మందిని అనంతపురం తీసుకొచ్చారని తెలిపారు. ఢిల్లీ అహంకారానికి, అనంతపురం ఆత్మగౌరవానికి జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. వైసీపీ హయాంలో అనంతపురంలో రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తే.. కూటమి వచ్చాక విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని, తనను ఆశీర్వదించాలని కోరారు. అన్ని డివిజన్లలో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

# చేర్యాల వెంకటసాయి ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స!

- 3.75 కిలోల భారీ గర్భాశయ ఫైబ్రాయిడ్ తొలగింపు.. రోగి ఆరోగ్యం నిలకడగా..
- డాక్టర్ కృష్ణ శ్రావ్య కు అభినందనలు వెల్లువ



**చేర్యాల అక్టోబర్ 30 ప్రజావాణి** చేర్యాల వైద్య రంగంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటూ చేర్యాల పట్టణంలోని వెంకటసాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రికి చెందిన డాక్టర్ కృష్ణ శ్రావ్య 3.75 కిలోల భారీ గర్భాశయ ఫైబ్రాయిడ్‌ను శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్ గోపాల్ రెడ్డి తెలిపారు. భారీ ఫైబ్రాయిడ్‌తో బాధపడుతున్న చేర్యాల మండలానికి చెందిన ఓ మహిళ ఆసుపత్రిలో చేరగా, వైద్య పరీక్షల అనంతరం గురువారం శస్త్రచికిత్స నిర్వహించి ఫైబ్రాయిడ్‌ను తొలగించినట్లు వెల్లడించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులకు, ఆసుపత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలు తెలిపారు. మహిళల ఆరోగ్య సమస్యలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వెంకటసాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పనిచేస్తోందని డాక్టర్ గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, ఆధునిక వైద్య విధానాలతో చేర్యాల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. భారీ గర్భాశయ ఫైబ్రాయిడ్‌ను విజయవంతంగా తొలగించడం ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్

**నారాయణఖేడ్ నియోజకవర్గం:- (ప్రజావాణి) ఇంచార్జ్ మదుసుదన్ నారాయణఖేడ్ :-** మండల పరిధిలోని బాంద్రన్‌పల్లి గౌరారం తండాకు చెందిన రాజు నాయక్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఇంటికి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించి, రాజు నాయక్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగేష్ శెట్కార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహాలు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నెహ్రూ నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మణ్, పండరి నాయక్, మాణిక్యం రాజు నాయక్, కొండల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులను అరికట్టేందుకు పౌరహక్కుల దినోత్సవం జరపండి

**నర్సాపూర్.అక్టోబర్ 30 మనప్రజావాణి నియోజకవర్గ ప్రతినిధి.**

నర్సాపూర్ ఆర్డీవోకు ప్రజాసంఘాల వినతి.

దళితుల పై జరుగుతున్న దాడులను అరికట్టడానికి పౌర హక్కుల దినోత్సవం జరపాలని నరసాపూర్ ఆర్టీవో కు ప్రజాసంఘాల నాయకులు విన్నవించారు. శుక్రవారం నాడు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్, మాల కోఆర్డినేషన్ ఫోరం మెదక్ జిల్లా ఇంచార్జ్ కల్లూరి సంజీవ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, ఎం సి ఎఫ్ జిల్లా నాయకులు శివ, నరేందర్ లు నర్సాపూర్ ఆర్డిఓ రామకృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్సాపూర్ డివిజన్ శివంపేట మండలం నవాబుపేట గ్రామంలో బతుకమ్మ పండుగ నాడు దళితులపై దాడులు చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు. జిల్లాలో వరుసగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు జస్టిస్ పున్నయ్య సిఫారసు ప్రకారం ప్రతినెల చివరన ఒక గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం జరిపి చట్టాలు కుల వివక్ష తదితర అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. కులమత్తు భేదాలు పాటించకుండా ప్రజలందరూ సోదరుభావంతో కలిసిమెలిసి జీవించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ పౌర హక్కుల దినోత్సవం నామమాత్రంగా జరపకుండా ప్రణాళిక బద్ధంగా ప్రజలందరూ పాల్గొనే విధంగా జరపాలని విధిగా మండల తాహ సిల్దార్, ఎస్సైలు విధిగా పాల్గొనే విధంగా ఆదేశాలను జారీ చేయాలని కోరారు. ఇందుకు ఆర్డిఓ సానుకూలంగా స్పందించారు.

ట్రిబుల్ ఆర్ రోడ్ గిరిజన భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి.

ట్రిబుల్ ఆర్ రోడ్ నిర్మాణం, కాళేశ్వరం ప్రాజెక్టు లో రెండుసార్లు భూములు కోల్పోతున్న గిరిజన భూ నిర్వాసితులకు భూసేకర చట్టం 2013 ప్రకారం పునరావసం కింద ఉద్యోగాలు కల్పించాలని, భూమికి భూమి ఇవ్వాలని మార్కెట్ ధర కు మూడింతల నష్టపరిహారం అందజేసి పునరావసం కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించి చర్చించారు.

మాలల రోస్టర్ పాయింట్ ను సవరించాలి. ఎం సి ఎఫ్

విద్యా ఉద్యోగాలలో అన్యాయం చేస్తున్న మాలల రోస్టర్ పాయింట్ ను సవరించాలని మాల కోఆర్డినేషన్ ఫోరం ఆధ్వర్యంలో నర్సాపూర్ ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాల కోఆర్డినేషన్ ఫోరం రాష్ట్ర నాయకులు పీ.శంకర్, ఎం సి ఎఫ్ మెదక్ జిల్లా ఇంచార్జ్ కల్లూరి సంజీవలు మాట్లాడుతూ మాల రోస్టర్ పాయింట్ 22 వల్ల మాల విద్యార్థి నిరుద్యోగులకు విద్యా ఉద్యోగాలలో తీవ్ర అన్యాయం, జరుగుతుందన్నారు. మాల రోస్టర్ పాయింట్లు 22 నుండి పది లోపు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఉద్యమాన్ని ఉధృతం ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసీ ఎఫ్ జిల్లా నాయకులు యు. శివ తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్ పథకంతో పశుగ్రాసం సాగుకు ప్రోత్సాహం

- ఎల్‌నినో ప్రభావంతో పశుగ్రాసం కొరత నివారణకు చర్యలు..
- రైతులకు ఉచిత విత్తనాలతో పాటు రూ.14 వేల ఆర్థిక సాయం

**బెజ్జంకి, అక్టోబర్ 30 (ప్రజావాణి)** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో వీబీజీ రామ్ పథకం ద్వారా పశుగ్రాసం సాగునుప్రోత్సహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో కరువు పరిస్థితులు ఏర్పడి పశుగ్రాసం కొరత వచ్చే అవకాశం ఉన్నందున పశువులు కలిగిన ప్రతి రైతు పశుగ్రాసం సాగు చేపట్టాలని సూచించారు. ఈ పథకం కింద పశుగ్రాసం సాగు చేసే రైతులకు ఉచితంగా విత్తనాలతో పాటు రూ.14 వేల వరకు ఆర్థిక సాయం అందించనున్నట్లు గుగ్గిళ్ల గ్రామ సర్పంచ్ మల్లయ్య తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు, జాబ్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ ప్రతులను గ్రామపంచాయతీలో అందజేయాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని పశువులున్న రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వంశి, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు,గ్రామస్తులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

- ఉద్యోగుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు
- సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, అక్టోబర్ 30** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గత 18 రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా శిబిరాన్ని శుక్రవారం ఆమె సందర్శించి,వారి ఆందోళనకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైద్య సిబ్బంది పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇతర రాష్ట్రాల్లో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు కల్పిస్తుండగా, తెలంగాణలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చట్టబద్ధంగా రావాల్సిన 180 రోజుల ప్రసూతి సెలవులను సైతం నిరాకరించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ప్రచారాలు, సమ్మిట్ల పేరుతో పత్రికా ప్రకటనల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేందుకు మాత్రం వెనుకడుగు వేస్తోందని విమర్శించారు. హర్యానా, రాజస్థాన్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తుంటే, తెలంగాణలో మాత్రం కాంట్రాక్ట్ ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ విధానంలోకి నెట్టి వారి హక్కులను కాలరాయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలందించిన వైద్య సిబ్బందికి రాజ్యాంగబద్ధంగా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులు వెంటనే స్పందించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఉద్యోగులు ఎవరి బెదిరింపులకూ భయపడాల్సిన అవసరం లేదని, వారి న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలపై గళమెత్తుతామని దాసరి ఉష స్పష్టం చేశారు.

# నవంబర్ 2లోగా తాత్కాలిక మట్టి రోడ్డు పనులు పూర్తి చేయాలి

- డిగ్రీ విద్యార్థుల పరీక్షల నేపథ్యంలో బీజేపీ వినతి
- బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి అయ్యే వరకు రాకపోకలకు ఇ బ్బందులు లేకుండా చూడాలి
- ఆలస్యం చేస్తే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం
- బీజేపీ మండల అధ్యక్షులు కోడె రమేశ్

**ప్రజావాణి , గంభీరావుపేట** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని గంభీరావుపేట-- లింగన్నపేట మధ్య తాత్కాలిక మట్టి రోడ్డు పనులను నవంబర్ 2వ తేదీలోగా పూర్తి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోడె రమేశ్ మాట్లాడుతూ.. హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులు, రైతులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా నవంబర్ 3వ తేదీ నుంచి డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా తాత్కాలిక మట్టి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ రహదారిని పటిష్టంగా ఏర్పాటు చేయడంతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. నవంబర్ 2లోగా రోడ్డు పనులు పూర్తి చేయకపోయినా, నవంబర్ 3వ తేదీ నుంచి బస్సు సౌకర్యం కల్పించకపోయినా బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు నర్సింలు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు సర్వోత్తమ్, ధార్మిక సెల్ మండల కన్వీనర్ శ్రీనివాస్ చారి, సోషల్ మీడియా కన్వీనర్ దేవేందర్ యాదవ్, శ్రీనివాస్, నర్సింలు, పుల్య నాయక్, శ్రీనివాస్ గౌడ్, దేవేందర్ నాయక్, నవీన్, తిరుపతి, దేవరాజు నాయక్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ స్కూల్లో సభావేదిక వాటర్ ప్లాంట్ ప్రారంభం

- మున్సిపాలిటీ పరిధిలోనూ తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తాం.

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అక్టోబర్ 30 (ప్రజావాణి న్యూస్): గత పదేళ్లలో నియోజకవర్గానికి పట్టిన దరిద్రాన్ని వదిలించేలా దృష్టి సారించామని ఇందులో భాగంగా కనకవర్షాన్ని తలపించేలా అభివృద్ధికి నిధులు తెస్తున్నట్లు ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారు తెలిపారు. శుక్రవారం తొర్రూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. తన సోదరి 'వంగేటి భూదేవమ్మ జ్ఞాపకార్థం' ఆమె కుటుంబసభ్యులు పాఠశాలలో నిర్మించిన సభా వేదికను రాష్ట్ర రోడ్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి గారితో కలిసి ఆయన ప్రారంభించారు. అలాగే, 'మిట్ట ఫ్యామిలీ ఫౌండేషన్' సౌజన్యంతో 'కమ్యూనిటీ ప్యూర్ వాటర్' సంస్థ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. అన్ని వర్గాలకు విద్యావెలుగులు చేరినప్పుడే సమాజ మార్పు సాధ్యమని అందుకే తొలివిడతలో ఆరుట్లలో రెండో విడతలో మంచాలలో టీపీఎస్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన చదువులను పిల్లలకు అందిస్తున్నట్లు చెప్పారు. ఆ తరహా విద్యాకేంద్రాలను మున్సిపాలిటీల్లోనూ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తొర్రూర్ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములైన మిట్ట ఫ్యామిలీ ఫౌండేషన్ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు వేగవంతం చేయాలి

- కూకట్‌పల్లి బూత్ అధ్యక్షులకు దిశానిర్దేశం చేసిన బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పి. దుర్గాప్రసాదరావు

**కూకట్‌పల్లి (ప్రజావాణి) అక్టోబర్ 30:** హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు కూకట్‌పల్లి డివిజన్‌లో బీజేపీ నాయకత్వం కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించి, ఓటరు నమోదు కార్యక్రమంపై సమగ్ర దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి. దుర్గాప్రసాదరావు బూత్ అధ్యక్షులకు కీలక సూచనలు చేశారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారందరికీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ, నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో బూత్ అధ్యక్షుల పాత్ర కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి డివిజన్‌లోని ప్రతి బూత్‌లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు

# రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు!

- నిధులు మంజూరైనా పనుల్లో జాప్యమెందుకు? అధికారులపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం
- అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలి.. ప్రజాధనంతో జరిగే పనుల్లో అక్రమాలకు తావుండకూడదు

**కూకట్‌పల్లి, అక్టోబర్ 30 (ప్రజావాణి)** ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను హెచ్చరించారు. నిధులు మంజూరై ఉన్నప్పటికీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యానికి కారణాలు ఏమిటని అధికారులను ప్రశ్నిస్తూ, వెంటనే పనులు వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. శుక్రవారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని వసుంధర ఆసుపత్రి వెనుక ప్రాంతంలో కూకట్‌పల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ మొలుగు ఆనంద్‌రావు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా అక్కడి నుంచి హబీబ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ఆశించిన వేగంతో జరగకపోవడంపై అధికారుల తీరును ప్రశ్నించారు. ప్రజలు ప్రతిరోజూ రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇకపై ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

రోడ్డు పనుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదు! మంజూరైన రోడ్ల పనుల పేరుతో కొందరు మట్టి పోసి నాయకుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా అభివృద్ధి పనులను అడ్డుపెట్టుకుని అక్రమ వసూళ్లకు పాల్పడే చర్యలను తీవ్రంగా పరిగణించాలని, అలాంటి వారికి అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో పారదర్శకత, నాణ్యత తప్పనిసరిగా ఉండాలని తేల్చిచెప్పారు.

ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా అభివృద్ధి పనులు సాగాలని, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి రాకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్ చౌదరి, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, మొలుగు ఆనంద్‌రావు, సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సోమక్కపేట్ గ్రామంలోని గంగిరెద్దుల గూడెంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోయడం

**చిలిపిచెడ్. అక్టోబర్ 30 మన ప్రజావాణి నియోజకవర్గం ప్రతినిధి** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా చిలిపిచెడ్ మండలం సోమక్కపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని గంగిరెద్దుల గూడెంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు నేడు ముగ్గు పోయడం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో ప్రవీణ్ , సర్పంచ్ బెస్త దుర్గాచలం , మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర స్వామి , ఉప సర్పంచ్ నరేష్ , కరణం శ్రీనివాస్ , కిరణ్ గౌడ్ హాజరయ్యారు. వారితో పాటు వార్డు సభ్యులు శ్రీనివాస్, యాదగిరి, సెక్రటరీ మోహన్, మల్లేశం, శ్రీశైలం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ మాట్లాడుతూ, నిరుపేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సర్పంచ్ దుర్గాచలం మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం లబ్ధిదారులకుశుభాకాంక్షలు తెలిపారు.

# తాగునీటిని వృథా చేయొద్దు: కలెక్టర్ ప్రతిమా సింగ్

తాగునీటిని వృథా చేయొద్దు: కలెక్టర్ ప్రతిమా :ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీటి కార్యాచరణ సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. తాగునీటిని వృథా చేయొద్దు: కలెక్టర్ ప్రతిమా సింగ్ నర్సాపూర్: రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు ప్రణాళికతో అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగిస్తూ, నీటి వనరులను సంరక్షించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని, బీవీజీ రామ్ జీ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కౌడిపల్లి మండలం ధర్మసాగర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో అందుబాటులో ఉన్న తాగునీటి వనరులు, నీటి లభ్యత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, బీవీజీ రామ్ జీ ఉపాధి హామీ పనుల అమలుపై ఎంపీడీవోతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం కారణంగా భవిష్యత్తులో తాగునీటి సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని, అందువల్ల ఇప్పటి నుంచే నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి వినియోగంపై అవగాహన కల్పించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గ్రామంలో మొదటి, రెండో విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాల గ్రౌండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులను అధికారులు వ్యక్తిగతంగా కలిసి ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో నాణ్యమైన నిర్మాణాలు చేపట్టి, ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవసరమైన సూచనలు, సహకారం అందించాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి బీవీజీ రామ్ జీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అనేక రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు మరింత ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పనులపై ప్రజలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా చూడాలని కలెక్టర్ అధి కారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, స్థానిక సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రీ సర్వే లో సరిహద్దులను పక్కాగా నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- రుద్రవరం లో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియ పరిశీలన

**వేములవాడ రూరల్, ప్రజావాణి** భూముల రీ సర్వే లో భాగంగా ప్రభుత్వ భూములు, పట్టా భూములకు సంబంధించిన అన్ని సరిహద్దులు, వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. వేములవాడ రూరల్ మండలం రుద్రవరం గ్రామంలో చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ మధ్యమానేరు జలాశయానికి సంబంధించిన సరిహద్దులు, గ్రామంలోని పట్టా భూములు, ఇతర ప్రభుత్వ భూముల హద్దులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నంబర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేయాలని, రైతులకు రీ సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించాలని సూచించారు. భూముల రీ సర్వే విషయంలో రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు. పరిశీలనలో డీఐ రాజేంద్ర ప్రసాద్, నాయబ్ తహసీల్దార్ లీలారాణి, నీటి పారుదల శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

# రూ.4.63 కోట్లతో శేరిలింగంపల్లి డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

- తొమ్మిది కాలనీల్లో సీసీ రోడ్లు, పార్కులు, స్మశాన వాటికల అభివృద్ధికి శంకుస్థాపన
- పనుల్లో జాప్యం చేయొద్దు.. నాణ్యతలో రాజీ పడొద్దు: పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 30 (ప్రజావాణి)** శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రూ.4 కోట్ల 63 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి దూబే కాలనీ, డొయన్స్ కాలనీ, అలింద్ ఎంప్లాయిస్ కాలనీ, మసీదుబండ, ప్రభుపాద లేఅవుట్, సెంట్రల్ పార్క్ ఫేజ్-1, శిల్పా వ్యాలీ, స్ప్రింగ్ వ్యాలీ, టీజీహెచ్‌బీ హౌసింగ్ బోర్డు కాలనీల్లో చేపట్టనున్న పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రహదారులు, పార్కులు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులను నిర్దేశిత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులకు స్పష్టం చేశారు. పనుల్లో అనవసర జాప్యాన్ని సహించబోమని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. రహదారుల నిర్మాణంతో కాలనీల్లో రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు.

స్మశాన వాటికల్లో ప్రహరీ గోడలు, స్నానపు గదులు, విశ్రాంతి గదులు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. పార్కులను పచ్చదనంతో సుందరంగా తీర్చిదిద్ది, వృద్ధులు విశ్రాంతి తీసుకునేందుకు, చిన్నారులు ఆడుకునేందుకు, వాకింగ్ చేసేవారికి అనువుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని గాంధీ పునరుద్ఘాటించారు.

మంజూరైన అభివృద్ధి పనుల వివరాలు:

దూబే కాలనీలో రూ.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం.
డొయన్స్ కాలనీలో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం.
అలింద్ ఎంప్లాయిస్ హౌసింగ్ కాలనీలో రూ.72 లక్షలతో సీనియర్ సిటిజన్ల డే కేర్ సెంటర్ నిర్మాణం.
అలింద్ కాలనీలో రూ.50 లక్షలతో పార్కులో వాటర్ సంప్, మల్టీపర్పస్ కోర్టు నిర్మాణం.
మసీదుబండలో రూ.50 లక్షలతో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి.
ప్రభుపాద లేఅవుట్‌లో రూ.50 లక్షలతో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి.
శిల్పా వ్యాలీలో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం.
సెంట్రల్ పార్క్ ఫేజ్-1లో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం.
స్ప్రింగ్ వ్యాలీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం.
టీజీహెచ్‌బీ హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.46 లక్షలతో పార్కు ప్రహరీ గోడ నిర్మాణం.

ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మారబోయిన రాజు యాదవ్, గౌరవ అధ్యక్షుడు వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి చింతకింది రవీందర్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ఇతర నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

- సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం అక్టోబర్ 30** మిర్యాలగూడ అర్బన్, మేజర్ న్యూస్: ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ మార్పులు, వాటి ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు నివారణ చర్యలపై మిర్యాలగూడలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయం, తాగునీటి సరఫరా, సాగునీటి రంగాలపై పడే ప్రభావాలను సమావేశంలో చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ సూచించారు. అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపొందించి, నివారణ చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి చిలుకూరి సుధా బాలు, వైస్ చైర్‌పర్సన్ శ్రీమతి గుడిపాటి శిరీష నవీన్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అదనపు కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు

**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** నాగార్జున ప్రభుత్వ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఆరు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో టీజీ సీపీగెట్-2026 కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు 06.11.2026 (శుక్రవారం) నాడు కళాశాల ప్రాంగణంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న పీజీ కోర్సులు: ఎం.ఏ. తెలుగు, ఎం.ఏ. ఎకనామిక్స్, ఎం.కామ్, ఎం.ఎస్సీ. ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎం. ఎస్సీ. కంప్యూటర్ సైన్స్, ఎం. ఎస్సీ. జువాలజీ టీజీ సీపీగెట్-2026లో అర్హత సాధించిన అభ్యర్థులతో పాటు అర్హత సాధించని వారు. పరీక్ష రాయని వారు కూడా ఈ స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అయితే సంబంధిత కోర్సుకు సీపీగెట్ - 2026 నోటిఫికేషన్లో సూచించిన అర్హత నిబంధనలను తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఫీజు రీయింబర్స్మెంట్, ఉపకార వేతనాలు కన్వీనర్ కోటాలో ప్రవేశం పొందిన సీపీగెట్ - 2026 అర్హులైన విద్యార్థులకు మాత్రమే వర్తిస్తాయని ఆయన స్పష్టం చేశారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరే విద్యార్థులు కోర్సు ఫీజును

స్వయంగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రవేశం పొందే సమయంలో రూ.2,100/- ప్రాసెసింగ్ ఫీజును కళాశాలలో చెల్లించాలి. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో స్వయంగా హాజరు కావాలి. ఒరిజినల్ సర్టిఫికెట్లు లేని వారిని అనుమతించరు. సీపీగెట్ - 2026 ర్యాంక్ కార్డు (అర్హత సాధించిన వారు), ఎస్ఎస్ఎసీ, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ ఒ సీఎంఎం, స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, అవసరమైన వారు కుల, నివాస, ఈక్వివలెన్స్ సర్టిఫికెట్లు తీసుకురావాలి. ప్రవేశం ఆమోదం పొందిన తర్వాత టీసీ మినహా మిగతా ఒరిజినల్ సర్టిఫికెట్లను తిరిగి ఇస్తారు. మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం, సీట్ల లభ్యతను బట్టి అదే రోజు ప్రవేశాలు కల్పిస్తారు. కళాశాలల వారీ ఖాళీల వివరాలు https://cpgetadmissions.com వెబ్సైట్లో, కళాశాల నోటీసు బోర్డుపై అందుబాటులో ఉన్నాయి. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ప్రయోగశాల, గ్రంథాలయ సౌకర్యాలు, తక్కువ ఫీజులతో ప్రభుత్వ కళాశాలలో పీజీ విద్యను అభ్యసించేందుకు నల్లగొండ, పరిసర జిల్లాల డిగ్రీ ఉత్తీర్ణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయం లేదా పీజీ కోఆర్డినేటర్ ను, లేదా ప్రిన్సిపాలు 98486 96776 నంబరులో సంప్రదించవచ్చు.

# నల్లగొండలో పార్టీలకతీతంగా అభివృద్ధి

- స్మార్ట్ సిటీలో భాగంగా ఆరులైన్ల రోడ్డు విస్తరణ
- మంత్రి కోమటిరెడ్డి సహకారంతో నల్లగొండలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి
- నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి
- సాగర్ రోడ్డులో వైయస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు ఆరు లైన్ల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన
- సంవత్సరంలో నల్లగొండ రూపురేఖలు మారుస్తాం
- ప్రతిపక్షాలు సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని అన త్య ప్రచారాలు
- మాజీ జెడ్పీటిసి గుమ్ముల మోహన్ రెడ్డి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో అన్ని డివిజన్లో పార్టీల కతీతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి ఆదేశాల మేరకు శుక్రవారం నల్లగొండ పట్టణం సాగర్ రోడ్డు వైయస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు స్థానిక కార్పొరేటర్, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియడంతో ఇటీవల ఈ రోడ్డు ను పరిశీలించడం జరిగిందని అన్నారు. డివైడర్, సెంట్రల్ లైటింగ్ లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఆరు లైన్ల రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే నల్గొండ పట్టణంలో కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేశారని అన్నారు. పానగల్ నుంచి డీఈఓ ఆఫీస్ వరకు కూడా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. అదేవిధంగా నల్లగొండలో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చేసేందుకు బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాబ్ గుట్టలకు ఘాట్ రోడ్డు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని పేర్కొన్నారు.

కార్పొరేషన్ లోని అన్ని డివిజన్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఛాయా సోమేశ్వరాలయం అభివృద్ధికి, సాగర్ రోడ్డు ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసిన సందర్భంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, పట్టణ ప్రజల తరపున మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఈ సందర్భంగా మేయర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ మాజీ జెడ్పీటిసి గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో మంత్రి కోమటిరెడ్డి సహకారంతో రూ.2,000 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. సాగర్ రోడ్లో వైయస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు మూడున్నర కిలోమీటర్ల ఆరు లైన్ల రోడ్డు విష్కరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన ఆర్ అండ్ బి శాఖ నుంచి రూ.20 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నల్లగొండ లో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తూ ముందుకు పోతున్నట్లు తెలిపారు. సంవత్సరంలో అభివృద్ధికి సంబంధించి నల్లగొండ రూపురేఖలు మారుతాయని స్పష్టం చేశారు. కోట్లాది రూపాయలతో ఇక్కడ అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రతిపక్షాలు కళ్ళులేని కబోధీలుగా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజావిశ్వాసం కోల్పోయిన ప్రతిపక్ష పార్టీల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు గుండబోయిన వెంకన్న యాదవ్, మామిడి కార్తీక్, రేగట్ట లింగస్వామి గౌడ్, ఇటికాల శ్రీనివాస్, ఏదుళ్ళ శ్రీధర్ రెడ్డి, వజ్జ రమేష్ యాదవ్, ప్రదీప్ నాయక్, చిన్నాల జానయ్య, దీప్లా నాయక్, పిల్లి కృష్ణంరాజు, సట్టు శంకర్, జూలకంటి శ్రీనివాస్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

- రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల సరుకులను సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలి -- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

**నల్లగొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని, రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఐద్వా నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం తుమ్మల పద్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లు లక్ష్మి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటం తో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. ఒకవైపు కనీస వేతనాలు పెరగకపోవడం, మరోవైపు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన ఆదాయంలో అధిక భాగం ఆహార అవసరాలకే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బియ్యం, పప్పులు, వంటనూనె, ఉల్లిగడ్డలు తదితర నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో పేద కుటుంబాలు పోషకాహారానికి దూరమవుతున్నాయని పేర్కొన్నారు. ధరల పెరుగుదల ప్రభావం మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై తీవ్రంగా పడుతోందన్నారు. మహిళల్లో రక్తహీనత ఆందోళనకరం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 (NFHS-5, 2019--21) గణాంకాల ప్రకారం, దేశంలో 15--49 సంవత్సరాల వయస్సున్న మహిళల్లో 57 శాతం మంది, తెలంగాణలో 57.6 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. మహిళలకు పౌష్టికాహారం అందకపోవడం, పేదరికం, ఆహార పదార్థాల ధరలు పెరగడం వంటి అంశాలు ఈ పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయని అన్నారు.2025 గ్లోబల్ హంగర్ ఇండెక్స్ లో 123 దేశాల్లో భారతదేశం 102వ స్థానంలో ఉండటం దేశంలో ఆహార భద్రత, పోషకాహార పరిస్థితులపై ఆందోళన కలిగిస్తోందన్నారు.మహిళలు, పిల్లలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు. ఐద్వ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ రేషన్ షాపుల ద్వారా 14 రకాల సరుకులు అందించాలనీ, ప్రభుత్వాలు వెంటనే స్పందించి నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, పెసరపప్పు, వంటనూనె, చక్కెర, గోధుమలు, గోధుమపిండి, ఉల్లిగడ్డలు, చింతపండు తదితర 14 రకాల నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, కనీస వేతనాలను పెంచాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మహిళలు, బాలికలకు సమతుల్యమైన పౌష్టికాహారం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. పేద ప్రజల ఆహార భద్రతను కాపాడటం ప్రభుత్వాల బాధ్యత అని, ధరల భారాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, ఆఫీస్ బేరర్స్ కారంపూడి ధనలక్ష్మి, పాతూరి గోవర్ధన, సుల్తానా, కనుకుంట్ల ఉమారాణి, కౌసల్య, బొల్లెపల్లి మంజుల తదితరులు పాల్గొన్నారు.

# రోజువారీ లక్ష్యాలతో భూముల రీ సర్వే పూర్తి చేయాలి

- రైతుల సమక్షంలోనే భూముల హద్దుల గుర్తింపు.. ఎండల నుంచి సిబ్బంది రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, అక్టోబర్ 30:-** భూముల రీ సర్వే ప్రక్రియను రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా భూముల హద్దులను పక్కాగా గుర్తించాలని, రైతులకు పూర్తి పారదర్శకతతో కూడిన సేవలు అందించాలని సూచించారు. శుక్రవారం నర్సాపూర్ (జి) మండలం చాక్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం సర్వే చేయాల్సిన భూముల విస్తీర్ణం, పట్టా భూములు, ఎస్ఆర్ఎస్పీ భూములు తదితర వివరాలను పరిశీలించారు. సర్వే బృందంలోని సభ్యులందరి పర్యవేక్షణలో, సంబంధిత రైతుల సమక్షంలోనే భూముల కొలతలు చేపట్టాలని స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, నిర్ణీత సమయంలో పనులు ముగించాలని ఆదేశించారు. రీ సర్వే విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు తప్పనిసరిగా టోపీలు ధరించాలని, తగినంత తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అవసరమైన ఓఆర్ఎస్ ద్రావణాన్ని కూడా వెంట ఉంచుకోవాలని తెలిపారు. సిబ్బంది ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యమిస్తూనే సర్వే పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అధికారులు, రైతుల మధ్య సమన్వయం పెంపొందించి రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం స్థానిక రైతుతో మాట్లాడిన కలెక్టర్ ఆయన సాగు చేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ భూముల్లో పంట కుంటలు (ఫామ్ పాండ్స్) నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని భవిష్యత్తులో సాగునీటి ఇబ్బందులను అధిగమించవచ్చని తెలిపారు. రైతులు పంట కుంటలు నిర్మించుకునేలా వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ఆదేశించారు.

ఈ తనిఖీలో తహసీల్దార్ శ్రీకాంత్, సర్వేయర్ విలాస్, గ్రామ సర్పంచ్ సుధాకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మద్దూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ మండల సమావేశం బహిష్కరణ

- ప్రత్యేక అధికారికి మెమొరాండం అందించిన సర్పంచులు

**మద్దూరు అక్టోబర్30, ప్రజా వాణి,** మద్దూరు మండల స్థాయి సమావేశం ఉదయం 11:30 గంటలకు ప్రత్యేక అధికారి ప్రకాష్ అధ్యక్షతన జరిగింది. మొదటిగా వ్యవసాయ శాఖ అధికారి బూరెల రామకృష్ణ తమ ప్రగతి నివేదిక చదివి వినిపిస్తుండగా ఒక్కసారిగా సమావేశంలో పాల్గొన్న సర్పంచులు కరువు మండలం జాబితాలో మద్దూరు ఎందుకు లేదని ఏ ఓ రామకృష్ణను నిలదీశారు.అనంతరం మద్దూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే వరకు మండల సమావేశాలను బహిష్కరిస్తామని చెప్పి బయటి వెళ్లి కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. స్థానిక ఎస్సై విషయం తెలుసుకొని నిరసన చేస్తున్నా సర్పంచులను నచ్చజెప్పి నిరసన బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు సర్పంచ్ శనిగరం సత్యనారాయణ, దామెర మల్లేశం, యిట్టబోయిన కనకచంద్రం, కర్నె సునీత మనోహర్, రేణుక కనకరాజు, గడిపే మౌనిక అనిల్, నిరాటి శ్రీనివాస్, జక్కుల కనకమ్మ లింగయ్య లు పాల్గొన్నారు.

# ప్రశస్త్ లో ప్రతి విద్యార్థిని స్క్రీనింగ్ చెయ్యాలి

- ఆర్మూర్ మోడల్ స్కూల్ లో దివ్యాంగ విద్యార్థుల యాప్ నమోదుపై అవగాహన
- ఆర్మూర్ మండల విద్యాధికారి రవీందర్

**ఆర్మూర్ టౌన్ అక్టోబర్ 30(మన సమగ్ర ప్రజావాణి):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి వివరాలను సమగ్ర శిక్షా ప్రశస్త్ యాప్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆర్మూర్ మండల విద్యాధికారి రవీందర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మోడల్ స్కూల్ లో శుక్రవారం నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులలో దివ్యాంగులను గుర్తించడానికి ఈ స్క్రీనింగ్ ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. దివ్యాంగ విద్యార్థులకు సాధారణ విద్యార్థులతో సమానంగా అన్ని సౌకర్యాలు అందించడానికే ప్రభుత్వం ప్రశస్త్ యాప్ ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ప్రతి ఉపాధ్యాయుడు అన్ని తరగతుల్లో దివ్యాంగ విద్యార్థులను గుర్తించి, వారి వివరాలను యాప్ లో పక్కాగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మార్పీ సురేందర్ ఐఈఆర్పీలు కిషన్, సురేష్ ప్రశస్త్ యాప్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్ రఘు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులు -- వారి సేవలను అభినందించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్..

**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** శుక్రవారం నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన చింతల రమేష్ (ఎస్ఐ, మిర్యాలగూడ ×× టౌన్ పోలీస్ స్టేషన్), శంకర్ రాజు (ఏఎస్ఐ, నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్), వై. రామలింగయ్య (హెడ్ కానిస్టేబుల్, కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్)లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేయడం అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేయాల్సిన బాధ్యత అని అన్నారు. సుదీర్ఘకాలం పాటు వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు పోలీస్ సేవలు అందించిన వారి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ క్రమశిక్షణ, అంకితభావం, బాధ్యతాయుతమైన సేవలతో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో మరో కొత్త అధ్యాయానికి ప్రారంభమని ఎస్పీ అన్నారు. ఇకపై కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ అనంతరం కూడా పోలీస్ శాఖతో ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తూ, తమ అనుభవాలను అవసరమైన సందర్భాల్లో ఇతరులకు పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ శివ ప్రసాద్, ఆర్. ఐ సంతోష్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు సైదులు, ఉపాధ్యక్షులు సీఐ కరుణాకర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# అనుమతి లేకుండా బోర్లు వేస్తే క్రిమినల్ కేసులు: తహసీల్దార్ చంద్రశేఖర్ హెచ్చరిక

**ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ మండల పరిధిలో ప్రభుత్వ అనుమతి లేకుండా బోర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చంద్రశేఖర్ హెచ్చరించారు. అనుమతులు లేకుండా బోర్లు వేస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు బోరు వాహనాల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.బోర్లు వేయాలనుకునే వారు ముందుగా మీ సేవ కేంద్రాల ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి బోర్లు వేస్తే ఇంటి యజమానులతో పాటు బోరు వాహనాల యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# హెచ్‌సీఏ వన్డే లీగ్‌లో మంథని యువ క్రికెటర్ బౌలింగ్ ధమాకా

- 10 ఓవర్లలో 48 పరుగులిచ్చి ఐదు వికెట్లు కైవసం..
- మంథనికి మంచి పేరు తీసుకురావడమే లక్ష్యం: ఖాజా మజహరుద్దీన్

**మంథని నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 30, ప్రజావాణి:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్డే లీగ్‌లో మంథనికి చెందిన యువ క్రికెటర్ ఖాజా మజహరుద్దీన్ అద్భుత బౌలింగ్‌తో సత్తా చాటాడు. ఎలిగెంట్ జట్టు తరఫున మారేడ్‌పల్లి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 10 ఓవర్లు బౌలింగ్ చేసి, ఒక మెయిడిన్ ఓవర్‌తో పాటు 48 పరుగులు ఇచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. తన ప్రతిభతో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేసి క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించాడు.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ జమీల్ అహ్మద్ తనయుడైన ఖాజా మజహరుద్దీన్ హైదరాబాద్‌లో ఉంటూ క్రికెట్‌లో రాణించేందుకు కృషి చేస్తున్నాడు. భారత క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ తిలక్ వర్మకు చిన్నప్పటి నుంచి శిక్షణ ఇచ్చిన కోచ్ సలాం బయాష్ వద్ద క్రికెట్‌లో మెళకువలు నేర్చుకుంటున్నాడు. అనుభవజ్ఞుడైన కోచ్ మార్గదర్శకత్వంలో తన ఆటను మరింత మెరుగుపరుచుకునేందుకు శ్రమిస్తున్నాడు.ఈ సందర్భంగా ఖాజా మజహరుద్దీన్ మాట్లాడుతూ.. మంథనికి మంచి పేరు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపాడు. తన కలలను సాకారం చేసుకునేందుకు హైదరాబాద్‌లో ఉంటూ కష్టపడుతున్నానని, క్రికెట్‌లో ఉన్నత స్థాయికి చేరుకుని సొంతూరికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నాడు.యువ క్రికెటర్ సాధించిన ఐదు వికెట్ల ఘనతపై మంథని ప్రాంత ప్రజలు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నారు.

# తుంగపాడు ఎస్సీ కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా కట్టుబడి ఉంటాం సర్పంచ్ బెడుదూరి వెంకటరెడ్డి

**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం అక్టోబర్ 30**మిర్యాలగూడ నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం (30-10-2026) పౌర హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, ఎస్సీ కాలనీ సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానికులతో అధికారుల సమక్షంలో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుంగపాడు గ్రామ సర్పంచ్ బెడుదూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ... ఎస్సీ కాలనీలో ఎలాంటి మౌలిక వసతుల లోటు లేకుండా చూస్తానని, కాలనీ అభివృద్ధికి తాను ఎల్లవేళలా ముందుంటానని హామీ ఇచ్చారు. కాలనీ వాసుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. ?ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (వీ=×) రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి లింగయ్య, గ్రామ పాలనాధికారి (GPO) విజయ్ రాంబాబులతో పాటు తుంగపాడు గ్రామ ఎస్సీ కాలనీ పెద్దలు, మహిళలు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గూడూరు మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మండల మల్లేష్ కురుమ

- గూడూరు మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్ ల ఆధ్వర్యంలో ఘన సన్మానం

**గూడూరు మండల ప్రతినిధి:- అక్టోబర్ 30. (మన సమగ్ర ప్రజావాణి): -** మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలం కురుమ సంఘం మండల అధ్యక్షుడి గా మండల మల్లేష్ కురుమ ఎన్నికైన శుభ సందర్భంగా, గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, గూడూరు మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్ నాయక్ లు శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్స్ పంపిణీ చేశారు. వారితో పాటు సర్పంచులు, ఉప సర్పంచ్ లు, సొసైటీ డైరెక్టర్ లు, వార్డు సభ్యులు, మండల నాయకులు కన్నబోయిన వెంకన్న, గుగులోతు బాలు నాయక్, బానోతు ఈర్య, కురుమ సంఘం గ్రామ అధ్యక్షుడు కోరె కుమార స్వామి, కత్తి కృష్ణ, హెచ్ శివ, గోపగాని యాదగిరి గౌడ్, దోమ ఉపేందర్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, ఎండి. రహీం, గోలి గోపాల్, నూనావత్ శ్రీకాంత్, దోమ సతీష్, బందెల అనిల్, రమేష్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# దోస్పల్లి గ్రామంలో గల పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ మారుతి

**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 30**విద్యార్థుల సంక్షేమం మరియు విద్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ఉచిత పాఠశాల దుస్తులను (యూనిఫారాలను) అందిస్తుందని, వీటికి ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని దోస్పల్లి గ్రామ సర్పంచ్ మారుతి పిలుపునిచ్చారు.. దోస్పల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రోజున ఉచిత పాఠశాల దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా సర్పంచ్ మారుతి విద్యార్థులకు ఉచిత దుస్తులను పంపిణీ చేసి మాట్లాడారు.. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, శ్రద్ధగా చదువుకొని ఉన్నంత శిఖరాలను అధీ రోహించాలని, ఆకాంక్షించారు.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు ఉచిత భోజన పాఠ్యపుస్తకాలు, దుస్తులు వంటి అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారుతి తో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రమేష్ దేశాయ్, సర్పంచ్ కపిల్, సర్పంచ్ కృష్ణ, మద్నూర్ ఏఎంసి చైర్మన్ భర్త రమేష్, ప్రధానోపాధ్యాయులు శంకర్, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు..

# ప్రజాస్వామ్య పరిరక్షణకు రామ్ లీలా మార్చ్ లో పాల్గొనాలి..

- కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు రామ్ గోండ...

**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 30**ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓట్ల చోరిని అడ్డుకోవడం రాజ్యాంగ విలువలను కాపాడటమే లక్ష్యంగా ఢిల్లీలో నిర్వహించనున్న రామ్ లీలా మార్చ్ లో పార్టీలకు అతీతంగా ప్రతినిధిని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు రామ్ గొండా పిలుపునిచ్చారు.. ఈ మార్చ్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితమైన కార్యక్రమం కాదని, భారతదేశ ప్రజాస్వామ్య విలువలను పరి రక్షించేం దుకు చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని పేర్కొన్నారు.. రాజ్యాంగంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరు ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు రామ్ గొండ విజ్ఞప్తి చేశారు.. ప్రజాస్వామ్య పరిరక్షణ రాజ్యాంగ విలువల కాపాడటమే మార్చ్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు..

# విబిజి రామ్ జీ పనులు సమర్థవంతంగా చేపట్టాలి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో అక్టోబర్ 30:--**విబిజి రామ్ జీ పనులు సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ లోకేశ్వరం మండలం అర్లి - గొడిసెర గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విబిజి రామ్ జీ కింద గ్రామంలో ప్రతి ఒక్కరు ఉపాధి పొందాలని పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు జాబ్ కార్డులు కలిగి ఉన్న వారిని కూలి పనులకు వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. విబిజి రామ్ జీ కార్యక్రమం కింద విస్తృతంగా నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలని చెప్పారు. నీటి సంరక్షణ చర్యల వల్ల భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని పేర్కొన్నారు. గ్రామంలో స్వాధ్యాయి వృక్ష మందిరానికి స్థలం కేటాయింపు అంశంపై స్థానికులతో మాట్లాడారు. వృక్ష మందిరం కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సంబంధిత వ్యక్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, లీజు, ఇతర మార్గాల ద్వారా వృక్షాలు నాటేందుకు స్థలాన్ని కేటాయించే అంశంపై అధికారులకు సూచనలు చేశారు. సంబంధిత స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. సదరు ప్రాంతంలో గ్రావెల్, స్టోన్ మెటీరియల్ ఉన్నదేమో తెలుసుకునేందుకు మైనింగ్ అధికారుల ద్వారా వివరాలు సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ సూర్యారావు, సర్పంచ్ జంగం ప్రసన్న, గ్రామస్తులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చండూరు పట్టణంలోని చికెన్ షాపులు, సూపర్ మార్కెట్లు, రెస్టారెంట్లలో మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు -- రూ.10,000 జరిమానా విధింపు

**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి**చండూరు పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన ఉ నాణ్యమైన ఆహార పదార్థాలు అందించడంతో పాటు పట్టణంలో పారిశుద్ధ్య ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలనే ఉద్దేశంతో మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ చికెన్ షాపులు, సూపర్ మార్కెట్లు మరియు రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా చికెన్ షాపుల్లో మాంసం నిల్వ చేసే విధానం, దుకాణాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, సూపర్ మార్కెట్లలో ఆహార పదార్థాల నిల్వ, గడువు తేదీలు, ప్యాకింగ్ విధానం, రెస్టారెంట్లలో వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, తాగునీటి సౌకర్యం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో చికెన్ షాపులు, సూపర్ మార్కెట్లు ఉ రెస్టారెంట్ల లో పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు సక్రమంగా పాటించడం లేదని గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన సంబంధిత యాజమాన్యాలపై మొత్తం రూ. 10,000/- జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, చికెన్ షాపులు, సూపర్ మార్కెట్లు ఉ రెస్టారెంట్ల యాజమాన్యాలు తప్పనిసరిగా పరిశుభ్రతా ప్రమాణాలను పాటించాలని సూచించారు.

నాణ్యమైన, తాజా ఆహార పదార్థాలను మాత్రమే విక్రయించాలని, గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించరాదని, దుకాణాల పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిషేధించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా వాటికి బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. నిబంధనలు పాటించని వ్యాపార సంస్థలపై భవిష్యత్తులో కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం

కిరణా మర్చంట్ అసోసియేషన్ వారితో సింగల్ యూస్ ప్లాస్టిక్ పై అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరుగుతుంది. ప్రజలు కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చే దుకాణాలు, రెస్టారెంట్లనే ప్రోత్సహించాలని చండూరు పట్టణాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ఉ ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలలో మున్సిపల్ మేనేజర్ జి. రాములు, వార్డు ఆఫీసర్ జి. శ్రీరాములు, పర్యావరణ ఇంజనీర్ యం. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు జి. మహేష్, జి. రమేష్ పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం.. ఆరుతడి పంటలే మేలు!

- మరికాల, లక్ష్మీపురం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి నవీన్ క్షేత్రస్థాయి పర్యటన
- వరి, మొక్కజొన్న సాగు చేస్తే తీవ్ర నష్టాలు తప్పవని రైతులకు హెచ్చరిక
- తక్కువ నీటితో పండే పెసలు , మినుములు, వేరుశెనగ సాగు చేయాలని సూచన

**వెంకటాపురం (నూగురు) అక్టోబర్ 30 (ప్రజావాణి) :** ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతంలో ఎల్‌నినో ప్రభావం మరియు వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా యాసంగిలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, నీటి వసతి తక్కువగా ఉన్నందున ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి నవీన్ సూచించారు. ఈ మేరకు వెంకటాపురం మండలంలోని మరికాల, లక్ష్మీపురం మరియు

బస్తగూడెం గ్రామాలలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ నవీన్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ తరఫున వరుస సమావేశాలు, పత్రికా ప్రకటనల ద్వారా ఎల్‌నినో ముప్పుపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ, కొంతమంది రైతులు ఇంకా నీటి అవసరం ఎక్కువగా ఉండే వరి మరియు మొక్కజొన్న పంటల సాగుకు సన్నద్ధమవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒకవేళ రైతులు ఈ యాసంగిలో వరి, మొక్కజొన్న సాగు చేస్తే.. పంట చేతికొచ్చే చివరి దశ వరకు సాగునీరు అందక ఎండిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దిగుబడి రాక, కొనుగోళ్ల సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అందువల్ల రైతన్నలు ఈ విషయాన్ని గమనించి, తక్కువ నీటితో, స్వల్పకాలంలో అధిక దిగుబడినిచ్చే పెసలు, మినుములు, వేరుశెనగ వంటి ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేసుకుని ఆర్థిక నష్టాల నుండి బయటపడాలని విజ్ఞప్తి చేశారు.

ఈ క్షేత్రస్థాయి పర్యటనలో లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ కుర్సం కన్నయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.1.20 కోట్లతో గచ్చిబౌలి డివిజన్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం

- గుల్మోహార్ పార్క్, నేతాజీ నగర్, డాక్టర్స్ కాలనీల్లో పలు పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**కూకట్‌పల్లి అక్టోబర్ 30 (ప్రజావాణి)**గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్మోహార్ పార్క్, నేతాజీ నగర్, డాక్టర్స్ కాలనీల రూపురేఖలు మార్చే దిశగా రూ.1 కోటి 20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. తాజా మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

పార్కులను ఆహ్లాదకరమైన పచ్చని వనాలుగా తీర్చిదిద్దుతామని, వాకింగ్ చేసేవారికి, వృద్ధులకు విశ్రాంతి తీసుకునేందుకు, చిన్నారులకు ఆటవిడుపుగా ఉండేలా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని గాంధీ పునరుద్ఘాటించారు.

మంజూరైన అభివృద్ధి పనుల వివరాలు:

గుల్మోహార్ పార్క్ కాలనీ: రూ.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం.

నేతాజీ నగర్: రూ.25 లక్షలతో నాలాపై స్టీల్ బ్రిడ్జి నిర్మాణం.

డాక్టర్స్ కాలనీ: రూ.50 లక్షలతో పార్కు ప్రహరీ గోడ, వాకింగ్ ట్రాక్, ఇంకుడు గుంత నిర్మాణం.

మొత్తం రూ.1.20 కోట్లతో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే ఆయా కాలనీల ప్రజలకు రవాణా, పార్కుల సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి.

ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మారబోయిన రాజు యాదవ్, గౌరవ అధ్యక్షుడు వీరేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి చింతకింది రవీందర్ గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, స్థానిక కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కార్మికుల సొంతింటి కల నెరవేరే వరకు పోరాటం

- కార్మికుల పోరాట ఫలితంగానే ప్రభుత్వ ప్రకటన.
- సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్‌కుమార్.

**గోదావరిఖని,మన సమగ్ర ప్రజావాణి అక్టోబరు 30**సింగరేణి కార్మికుల దశాబ్దాల సొంతింటి కల నెరవేరే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ రామగుండం అర్జీ టూ బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం రామగుండం అర్జీ టు ఏరియాలోని వకీల్‌పల్లి గని వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు కల్పించాలనే డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో గత ఆరేళ్లుగా వివిధ రూపాల్లో ఉద్యమాలు చేపట్టినట్లు తెలిపారు. పోరుజాతాలు, బస్సు జాతాలు,ఆమరణ నిరాహార దీక్షలు,జీఎం కార్యాలయాల ముట్టడి, ధర్నాలు నిర్వహించామన్నారు. కార్మికుల నుంచి భారీగా సంతకాలు సేకరించి స్థానిక ఎమ్మెల్యేలకు,

సింగరేణి ఏరియా జీఎంలకు,సంస్థ సీఎండీతో పాటు డైరెక్టర్లకు వినతిపత్రాలు అందజేసినట్లు వివరించారు. కార్మికుల్లో చైతన్యం కల్పించేందుకు బ్యాలెట్ ఓటింగ్ కూడా నిర్వహించామని పేర్కొన్నారు. సీఐటీయూ సుదీర్ఘ పోరాటాల నేపథ్యంలోనే సింగరేణి కార్మికులకు సొంతింటి స్థలాలు,ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడం హర్షణీయమని ప్రవీణ్‌కుమార్ అన్నారు. దీపావళిలోపు ఆర్జీ వన్ ఏరియాలో శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ త్వరగా కార్యరూపం దాల్చి కార్మికులకు సొంత ఇళ్లు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ సమయానికి సొంత ఇల్లు ఉంటే కార్మికులకు ఆర్థిక భరోసా లభించడంతో పాటు కుటుంబాలకు భద్రత ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి కార్మికుల సొంతింటి కలను సాకారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వకీల్‌పల్లి గని పిట్ కార్యదర్శి తిరుపతి,అసిస్టెంట్ పిట్ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు సుధాకర్, రమేష్,సాయి, వెంకటస్వామి,విజయ్‌తో పాటు పలువురు సీఐటీయూ నాయకులు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

# పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా 1600 మీటర్ల రన్

- ప్రారంభించిన కొత్తగూడ సబ్ ఇన్స్పెక్టర్ ఇమ్మడి రాజ్ కుమార్

**కొత్తగూడ మండల ప్రతినిధి:- అక్టోబర్ 30. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ కేంద్రంలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా, 1600 మీటర్ల రన్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడ అంబేద్కర్ సెంటర్ నుంచి బైపాస్ రోడ్డు వరకు నిర్వహించిన ఈ రన్నింగ్ కార్యక్రమాన్ని కొత్తగూడ సబ్ - ఇన్ స్పెక్టర్ రాజ్ కుమార్ ప్రారంభించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ... యువతలో క్రీడా స్ఫూర్తిని, ఆరోగ్యం పై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగారం ఎస్ఐ కోటేశ్వరరావు, ఎంఈఓ. గుమ్మడి లక్ష్మీనారాయణ, వనప్రేమి - జనప్రేమి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పులుసం సాంబయ్య, ఉపాధ్యాయులు జోగా సంపత్, సిద్ధబోయిన సాంబయ్య, బంగారి సాంబయ్య, అలాగే స్పోర్ట్స్ పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ లో చేరికలు

- సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న ఆధ్వర్యంలో

**గూడూరు మండల ప్రతినిధి:- అక్టోబర్ 30. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, గూడూరు స్థానిక సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి గజ్జి లింగన్న అధ్యక్షతన జరిగిన చేరికల కార్యక్రమం లో లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎలా ఉపేందర్, గోవిందపురం గ్రామానికి చెందిన వేముల ఏకాంతం శుక్రవారం రోజున సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న ఆధ్వర్యంలో చేరారు. వీరిరువురికి పార్టీ కండువాను కప్పి, పార్టీలోనికి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మండల వెంకన్న మాట్లాడుతూ.. ఎల ఉపేందర్, యాకాంతం లు గతంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసినటువంటి కామ్రేడ్స్ లు, వీరు కొంతకాలం సొంత పనులు

చేసుకుంటూ స్తబ్దతగా ఉన్నారు. ప్రస్తుతం దేశంలో రాష్ట్రంలో పాలకవర్గ పార్టీలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న జంజీ ఉద్యమాలను చూసి తిరిగి విప్లవోద్యమం లో పనిచేయడానికి పూనుకున్నారు. వీరిని మరోసారి సిపిఐ (ఎంఎల్ ) సాదారనంగా ఆహ్వానిస్తూ.. స్వాగతం పలుకుతుందని వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా నవంబర్ ఒకటి నుండి తొమ్మిది వరకు జరుగు అమరవీరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలని ఆ క్రమంలోనే నవంబర్ 9న మచ్చర్ల లో నిర్వహించ తలపెట్టిన రాచూరి యాకన్న, కామ్రేడ్ పెనక విక్రం వెంకన్న, చిన్నం కోటిల సంస్మరణ సభను ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ సూర్యం, జిల్లా నాయకులు పుల్లన్న, శ్రీశైలం, కొట్టెం అచ్చన్న, కాడబోయిన నరసయ్య, కొట్టెం వజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..

- సర్పంచ్ ఖానాపూరే శ్రీనివాస్..

**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 30**గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని డోన్ గావ్ సర్పంచ్ ఖానాపూరే శ్రీనివాస్ సూచించారు.. శుక్రవారం రోజున గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పశు వైద్యశాల అధికారి పండరి నాథ్ ఆధ్వర్యంలో 24 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 12 పశువులకు సాధారణ వైద్యం, 25 దూడలకు నత్తల నివారణ మాత్రాలు అందించారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఖానాపూరే శ్రీనివాస్ తో పాటు, ఉప సర్పంచ్ హన్మ గొండ, తదితరులు గ్రామస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు..

# నవంబర్ 1 తేదీన లింగంపల్లి గ్రామానికి బసవలింగ అవధూత మహారాజ్ రాక..

**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 30**కామారెడ్డి జిల్లా పెద్ద కోడప్ గాల్ మండలంలోని లింగంపల్లి గ్రామానికి ఆధ్యాత్మిక వేత్త ఝర సంఘం(మల్లన్న గుట్ట) శ్రీ మల్లయ్యగిరి ఆశ్రమ పిఠాధిపతి బసవలింగ అవధూత మహారాజ్ నవంబర్ 1 తేదీన విచ్చేయనున్నారు. గ్రామంలోని హనుమాన్ మందిర్ వద్ద ఆదివారం సాయంత్రం 6:35 గంటలకు ప్రారంభమయ్యే ఈ ప్రత్యేక ప్రవచన కార్యక్రమంలో స్వామీజీ భక్తులకు ఆధ్యాత్మిక ఉపదేశాలు, ధార్మిక సందేశం, అందించనున్నారు.. ఈ సందర్భంగా లింగంపల్లి గ్రామంతో పాటు పరిసర మండలాల భక్తులు, శిష్యులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై, స్వామీజీ దివ్య మంగళ ఆశీస్సులు పొంది కార్యక్రమం జయప్రదం చేయాలని లింగంపల్లి నిర్వాహకులు,గ్రామస్తులు, గ్రామ పెద్దలు కోరారు..

# దళిత, గిరిజన జర్నలిస్టులకు అన్యాయం జరిగితే ఊరుకోం

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న

**బీర్కూర్ /బాన్సువాడ అక్టోబర్ 30 :**తెలంగాణ రాష్ట్రంలో దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు, అన్యాయాలు జరుగుతున్నాయని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నానని, తమ దళిత, గిరిజన జర్నలిస్టులపై అన్యాయం జరిగితే ఊరుకోబోమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న హెచ్చరించారు. హైదరాబాద్ లోని పద్మిని హోటల్ లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తమ దళిత, గిరిజన జర్నలిస్టులపై జరుగున్న దాడులు, అన్యాయాన్ని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు ముఖ్యంగా పోలీసులు వెంటనే నిలిపివేయాలని అయన డిమాండ్ చేశారు. ఇటీవల సిరిసిల్లాకు చెందిన ఇద్దరు జర్నలిస్టులపై కరీంనగర్ పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించడం దారుణమని ఈ విషయం లో బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

వారిపై చర్యలు తీసుకునే వరకు ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా దళిత, గిరిజన జర్నలిస్టులను ఐకమత్యం చేస్తూ, జిల్లా కమిటీలు లేని అన్ని జిల్లాలలో జిల్లా కమిటీలను పూర్తి చేస్తామన్నారు. అలాగే జిల్లా కమిటీల నిర్మాణం పూర్తయిన తరువాత త్వరలోనే రాష్ట్ర ద్వితీయ మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులకు అందించే అక్రిడిటేషన్ల జారీ విషయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో దళిత, గిరిజన జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇంకా జరుగుతూనే ఉందని, దీనికి ప్రధాన కారణం దళిత,గిరిజన జర్నలిస్టులు అక్రిడిటేషన్ కమిటీలలో లేకపోవడమేనని అన్నారు.

అర్హులైన దళిత, గిరిజన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు, ఇండ్ల స్థలాలు అందించే వరకు తమ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పోరాటం ఆగదని అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడి చేసినప్పటికి ప్రభుత్వం విధానంలో మార్పు లేదని విమర్శించారు. ప్రభుత్వ విధానం, రాష్ట్ర ముఖ్యమంత్రి పద్ధతి మార్చుకోకపోతే తమ తఢాఖా ఏందో చూపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవస్థాపక నాయకులు అరెల్లి మల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, తెడ్డు సాయిలు, చుంచు బాబు, సంయుక్త కార్యదర్శి ఈరోల్ల పురుషోత్తం, ఆర్గనైజింగ్ కార్యదర్శి అరుణ్, ఉత్సవ కమిటీ రాష్ట్ర చైర్మన్ సంతోష్, కో కన్వీనర్ సురేష్, నాయకులు వెంకన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విలేఖర్లకు ప్రగతి నివేదికలు ఇచ్చే నిబంధనలు లేవు.

- విలేకరులను అవమానపరిచిన సూపర్ డెంట్ వేణుగోపాల్

**మద్దూరు అక్టోబర్30, ప్రజా వాణి,**మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించే మండల స్థాయి సమావేశానికి సంబంధించిన ప్రగతి నివేదిక ప్రతులను ఇవ్వాలని విలేకరులు కోరగా మండల పరిషత్ సూపర్ డెంట్ వేణుగోపాల్ విలేకరులకు నివేదిక ప్రతులను ఇచ్చేది లేదని అవమాన పరిచారు.గత 20 సంవత్సరాలుగా ఎందరో అధికారులు ఇక్కడ విధులు నిర్వహించిన సమయంలో ముందుగా ప్రగతి నివేదికలు విలేకరులకు అందజేజేసిది దాని ఆధారంగా వార్తలు రాసేది ప్రస్తుతం సూపర్ డెంట్ ప్రగతి నివేదికలు అందజేయడంలో గుట్టుగా వ్యవహరిస్తున్నారంటే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సర్పంచులు కరువు మండలం ప్రకటించాలని నిరసన వ్యక్తం చేశారు.కనీసం ఆ విషయం నివేదికలో పొందుపర్చకపోవడం విడ్డూరంగా ఉంది. మండల పరిషత్ కార్యాలయంలో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా సూపర్ డెంట్ మండల స్థాయి సమాచారం కోసం కాగితాలు అందించకపోవడం పట్ల సూపర్ డెంట్ పని తీరుపై విలేకర్లు ఆగ్రహం చేయగా మండల ప్రజా ప్రతినిధులు నవ్వుకుంటున్నారు. ఈ విషయంలో ఎంపిడిఓ శ్రీనివాస్ కల్పించుకొని మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటానని చెప్పారు.

# శవ,చిల్లర రాజకీయాలు భట్టి విక్రమార్క నైజాం కాదు

- తెల్దరుపల్లి రౌడీలు, గుండాలే రామారావు ని హత్య చేశారు
- మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** శవ రాజకీయాలు, చిల్లర రాజకీయాలు చేయడం మా నాయకుడు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నైజాం కాదని, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. శుక్రవారం ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలో పాతర్లపాడు గ్రామంలో మాజీ ఎంపిటీసీ బొర్ర ప్రసాదరావు అద్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది పాతర్లపాడు గ్రామంలో సిపిఎం రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సామినేని రామారావుని హత్య చేసిన విషయం అందరికి తెలిసిందే ఆయనను హత్య చేసిన నిందితులను పట్టుకునేందుకు ఒకపక్క సిపిఎం రాష్ట్ర నాయకులు మరోపక్క కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అందరూ కలిసి పోలీస్ శాఖ వారికి ఫిర్యాదు చేయడం జరిగింది . సిపిఎం నాయకులు అనేక కార్యాలయాల ముందు ధర్నాలు రాస్తారోకోలు కూడా చేసిన పరిస్థితులు మనందరికీ తెలుసన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీస్ డిపార్ట్మెంట్ డిజిపి హోదాలో కేసును దర్యాప్తు చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిన విషయం తెలిసిందే అన్నారు. అప్పటినుండి పోలీసు వారు అనేక కోణాలలో దర్యాప్తు మొదలుపెట్టారు. పోలీస్

యంత్రాంగం తో పాటు బెంగళూరు ఫారెన్సిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ సాంకేతిక లాబరేటరీ వారికి సహకారంతో అనేక కోణాలతో విచారణ జరిపించి నిందితులను ఛేదించి పట్టుకొని అరెస్టు చేస్తే..

నిందితులు సిపిఎం పార్టీ కేంద్ర నాయకుడు అనుచరులేనని విచారణలో తెలగానే దానిని కప్పిపుచ్చుకునేందుకు పాతర్లపాడు గ్రామం వచ్చి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకుడు భట్టి విక్రమార్కే ఈ హత్య చేయించాడని. అమాయకులైన తెల్దరుపల్లి వారిని ఖమ్మం పోలీస్ కమిషనర్ అరెస్టు చేశారని. కేసును తప్పు దోవ పట్టిస్తున్నారని మాట్లాడుతుంటే వినటానికి విడ్డూరంగా ఉందన్నారు.

దోషులు ఎవరు అనేది పోలీసులు అహర్నిశలు కష్టపడి హంతకలును పట్టుకుని రిమాండ్ చేస్తే వారు తెల్దరుపల్లి కి చెందిన తమ్మినేని వీరభద్రం అనుచరులనీ వారికి అనేక కేసుల్లో నేరచరిత్ర కలిగి ఉన్న రౌడీలు, గుండాలని వారితోనే సొంత పార్టీ నాయకుడైన రామారావుని హత్య చేయించడం జరిగిందని, దీనిని ఈ మండల, జిల్లా, రాష్ట్ర ప్రజలందరూ నమ్ముతున్నారని అనేది తేటతెల్లంగా కనిపిస్తుంది అన్నారు. హత్య రాజకీయాలు మానుకోవాలని పల్లెలన్నీ పచ్చని పంటలతో కళకళలాడాలని ఎలాంటి కక్షలకు కార్పణ్యాలకు తావునివ్వకూడదని దృఢ సంకల్పంతో అభివృద్ధి లో ముందుకు సాగుతున్న భ ట్టి విక్రమార్క పై ఇలాంటి నిందలు వేయడం మానుకోవాలన్నారు.

సొంత తమ్ముడిని హతమార్చిన నేరచరిత్ర కలిగిన సిపిఎం నాయకుడికి రామారావు లాంటి నాయకుడిని హతమార్చడం పెద్ద లెక్క కాదన్నారు. కచ్చితంగా రామరావు లాంటి నిజాయితీ, నిస్వార్థ నాయకున్ని చంపడం ఆ నిందను గ్రామంలోని అమాయకులపై వేయడం ఆయన ఆత్మ క్షోభిస్తుందని తెలిపారు.

ఇప్పటికైనా ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. చట్టం ఎవరిని వదిలిపెట్టదని దోషులెంతటి వారినైనా కచ్చితంగా శిక్షిస్తుందని తెలిపారు

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మడిపల్లి భాస్కర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొప్పుల గోవిందరావు జిల్లా నాయకులు కూరపాటి కిషోర్, మర్కెట్ కమిటి డైరెక్టర్ బందెల నాగర్జున,పెంట్యాల అప్పారావు చింతకాని వందనం సర్పంచులు కిలారి మనోహర్,ఆవుల నాగేశ్వరరావు, గ్రామ శాఖ అద్యక్షులు బొర్ర శేషగిరి రావు, మండల నాయకులు కాంౡ పిచ్చయ్య యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంచుమర్తి రామకృష్ణ, తాళ్లూరి బాలాజీ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, గ్రామ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చలో ఢిల్లీ ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమానికి ఢిల్లీ బయలుదేరిన ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, కాంగ్రెస్ నాయకులు.

**ఏటూరునాగారం అక్టోబరు 30 ప్రజావాణి:** రాహుల్ గాంధీ పిలుపుమేరకు ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమానికి మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మరియు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న సూచనల మేరకు, ఓటు మన హక్కు ప్రజాస్వామ్యం మన బలం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఓటు హక్కును కాపాడుకుందాం దేశాన్ని రక్షించుకుందాం దేశం కోసం అందరం ఒకటవుదాం.

ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం మనమంతా ఐక్యంగా ముందుకు సాగుదాం,

రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ఢిల్లీలో ఒకటో తారీఖున రామ్ లీలా మైదానంలో మహా ర్యాలీ ఓటు బచావో దేశ్ బచావో కార్యక్రమానికి మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు జిల్లా నుండి అధిక సంఖ్య లో ట్రైన్లో ఢిల్లీకి బయలుదేరినారు.

రాహుల్ గాంధీ ని దేశ ప్రధానిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగినారు.

ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు గద్దల నవీన్, కన్నాయిగూడెం మాజీ వైస్ ఎంపీపీ బోల్లె భాస్కర్, ఏటూర్నాగారం టౌన్ యూత్ అధ్యక్షుడు బండారి లక్కీ, ఆత్మ కమిటీ డైరెక్టర్ పెద్ది రాజబాబు, కొండాయి సర్పంచ్ ఆలం నాగార్జున్, తుపాకులగూడెం ఉపసర్పంచ్ ఆలం నాగార్జున్, కర్ల తరుణ్ కుమ్మరి కుమార్, జాడి నరేష్.

# సంగెం మండలంలో పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

**అక్టోబర్ 30 ప్రజావాణి న్యూస్/సంగెం** పంటల్లో తెగుళ్లు, పురుగుల ఉధృతిని గుర్తించి రైతులకు సూచనలు.సంగెం మండలంలోని తీగరాజుపల్లి క్లస్టర్ పరిధిలో 30.10.2026న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్ మరియు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్ శాస్త్రవేత్తల బృందం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పత్తి, వరి, పసుపు, కూరగాయ పంటలను సందర్శించి పంటలలో తెగుళ్లు, పురుగుల ఉధృతిని పరిశీలించింది.ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త డా. ఆర్. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, పత్తి పంటను యాసంగి సీజన్ వరకు పొడిగించకుండా సకాలంలో తొలగించాలని రైతులకు సూచించారు. దీనివల్ల గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించవచ్చని తెలిపారు.వరి పంటలో పొట్ట దశ, గింజ నిండే దశలో ఉన్న పంటలను పరిశీలించగా, గింజ మచ్చ తెగులు, కంకి నల్లి ఉధృతి గమనించినట్లు తెలిపారు. గింజ మచ్చ తెగులు

నివారణకు టెబ్యుకోనజోల్ ం ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ కలిగిన మందును ఎకరానికి 80 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు.పసుపు పంటలో దుంప కుళ్లు, దుంప పుచ్చు సమస్యలను గుర్తించారు. దుంప కుళ్లు నివారణకు మొక్కల మొదళ్ల వద్ద వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మెటలాక్సిల్ ం మాంకోజెబ్ కలిగిన శిలీంద్రనాశక మందును లేబుల్ సూచనల ప్రకారం ఉపయోగించాలని తెలిపారు. దుంప ఈగ నివారణకు, దుంప పుచ్చు సమస్యను తగ్గించేందుకు సిఫారసు చేసిన సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. పొటాషియం లోప నివారణకు 13-0-45 నీటిలో కరిగే ఎరువును లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి ఆకులపై పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు ఈ సూచనలను పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే అవకాశం కలుగుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. రాజ్ కుమార్, శ్రీమతి సౌందర్య, శ్రీమతి మానస, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి విజయ నిర్మల, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీ జి. నర్సింగం, మండల వ్యవసాయ అధికారి శ్రీ జగదీష్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీమతి సరిత, సర్పంచ్ శ్రీ కె. గోపాల్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలకు సెల్యూట్.. బయ్యారంలో పోలీసుల సైకిల్ ర్యాలీ

**బయ్యారం:.ప్రజావాణి 30 ఫిబ్రవరి** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో ఈరోజు జ× రవీందర్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిఐ రవీందర్ మాట్లాడుతూ... 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో దేశ సరిహద్దుల వద్ద విధులు నిర్వహిస్తున్న భారత పోలీసు బృందంపై చైనా సైనికులు జరిపిన దాడిలో 10 మంది పోలీసు సిబ్బంది వీరమరణం పొందారు. విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన ఆ అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. అమర పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ,వారికి ఘన నివాళులు అర్పించడంతో పాటు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర, ప్రజల ప్రాణాలు ,ఆస్తుల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న నిరంతర కృషిపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ సైకిల్ ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత , శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం. వారి సేవలు, స్ఫూర్తి భావితరాలకు ఎల్లప్పుడూ ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో బయ్యారం యస్. ఐ. ప్రశాంత్ బాబు, గార్ల యస్. ఐ. సాయి కుమార్,పోలీస్ సిబ్బంది ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి రూ.5 లక్షల సీఎం సహాయ నిధి అందజేత

- కేశవ నగర్ వాసి కిష్టప్పకు వైద్య చికిత్స కోసం ఆర్థిక భరోసా.. మంజూరు పత్రం అందించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**కూకట్‌పల్లి: అక్టోబర్ 30(ప్రజావాణి)**గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని కేశవ నగర్ కాలనీకి చెందిన కిష్టప్పకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్--ఎల్ఓసీ పత్రాన్ని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపద సమయంలో అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు సీఎం సహాయ నిధి ద్వారా భరోసా కల్పిస్తున్నారని తెలిపారు.అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో తోడ్పాటునందిస్తోందని, అర్హులైన వారికి ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు.తమ కుటుంబానికి వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు కావడానికి సహకరించిన ఆరెకపూడి గాంధీకి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net

మన సమస్య ప్రజావాణి తెలుగు దినపత్రిక
శనివారం, అక్టోబర్ 31, 2026



# రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ముండ్రాయి విద్యార్థులు

**అక్టోబర్ 30 .ప్రజావాణి న్యూస్/సంగెం** దివి03/09/2026 రోజున వరంగల్ ఇండోర్ స్టేడియం గ్రౌండ్ నందు జూనియర్స్ సాఫ్ట్ బాల్ వరంగల్ జిల్లా స్థాయి ఎంపికలో జెడ్పీహెచ్ఎస్ ముండ్రాయి విద్యార్థులు గూడ చిన్ను 10వ తరగతి,బైరి లక్ష్మీప్రసన్న10 వ తరగతి,గుగులోతు ఉమేశ్వరి 7వ తరగతి ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ జిల్లా జట్టు తరపున దివి 31/10/2026 నుండి 2/11/2026 వరకు నిర్మల్ జిల్లాలో జరుగు రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలికల సాఫ్ట్బాల్ పోటీలలో పాల్గొంటున్నారని హెచ్ ఎం కె.విజయ,పిడి బి.ముఖర్జీ సంయుక్తంగా తెలియజేసినారు.గూడ చిన్ను,బైరి లక్ష్మీప్రసన్న,గుగులోతు ఉమేష్వరి లను స్థానిక ముండ్రాయి గ్రామ సర్పంచ్ గూడ స్వరూప అభినందిస్తూ వీరు రాష్ట్ర స్థాయిలో వరంగల్ జిల్లా జట్టు గోల్డ్ మెడ సాధించాలని శు భాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్పర్సన్ అనుముల శ్రీలత, ఉపసర్పంచ్ గూడ విజయకుమార్,హెచ్ ఎం కె.విజయ,ఉపాధ్యాయులు ప్రకాష్,మనోహర్,స్వామి,వీర కుమార్, రఘుపతి రెడ్డి,సుమతి, అరుణాదేవి,హనుమంతరావు, వసంత,రాధిక,ఉమేష్,శంకర్రావు లు అభినందించినారని పిడి భీమగాని ముఖర్జీ తెలియజేసినారు.

# పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

- **అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సామాజిక సేవలో పోలీసులు -- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**

**రామాయంపేట, ప్రజావాణి ప్రతినిధి నరేశ్ నాయక్:**పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామాయంపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు పది రోజులపాటు పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయాలు, ఇతర వైద్య అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల ఒకరి ప్రాణాలను కాపాడే గొప్ప అవకాశం లభిస్తుందని అన్నారు.

పోలీసు అమరవీరులు ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని, వారి త్యాగాలు సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని ఎస్పీ పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని కేవలం నివాళులకే పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసు శాఖ సామాజిక బాధ్యతలో భాగంగా రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలను చేపట్టడం సంతోషకరమని తెలిపారు.

పోలీసు శాఖతో పాటు రామాయంపేట లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహబంధు, మెడిసిటీ ఆసుపత్రి వైద్యుల బృందం సంయుక్త సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యుల బృందం రక్తదాతలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి రక్తసేకరణ ప్రక్రియను చేపట్టింది. ఈ సందర్భంగా పలువురు యువకులు, పోలీసు సిబ్బంది, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదాతలను అధికారులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్ గౌడ్, సీఐ సైదా నాయక్, రామాయంపేట ఎస్సై బాలరాజు, నిజాంపేట ఎస్సై రాజేష్, నార్సింగి ఎస్సై, పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, లయన్స్ క్లబ్ సభ్యులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. దంతేపల్లి సర్పంచ్, మెదక్ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మస్కూరి బాలరాజు, లక్ష్మాపూర్ సర్పంచ్, బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, శివాయిపల్లి సర్పంచ్ రవి, రైలాపూర్ ఉపసర్పంచ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దామోదర్ రావు, సభ్యులు జీకే కృష్ణమూర్తి, జనతా మెస్ శ్రీనివాసరావు, లయన్ బాలరాజు, లయన్ సతీష్, తమ్మల రమేష్‌తో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ముద్రణ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమానికి సహకరించారు.

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం ద్వారా సమాజానికి సేవ చేయాలనే సందేశాన్ని అందించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో నిరంతరం ముందుండే పోలీసు శాఖ సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులు, లయన్స్ క్లబ్ సభ్యులు, వైద్య బృందం, రక్తదాతలు, ప్రజాప్రతినిధులను నిర్వాహకులు అభినందించారు

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- **వ్యవసాయానికి నిరంతర విద్యుత్, సాగునీటి వసతుల కల్పన**
- **ఒడితలలో రూ.2.20 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం**

**జయశంకర్ జిల్లా బ్యూరో అక్టోబర్ 30 (మన ప్రజావాణి) :** రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీటి వసతుల కల్పనతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. శుక్రవారం చిట్యాల మండలం ఒడితల గ్రామంలో ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.2.20 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత రెండున్నరేళ్లలో ఉప ముఖ్యమంత్రి చొరవతో జిల్లాలో 12 నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూగర

# ఎల్‌నినో సవాలును ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ

- **మిర్యాలగూడ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి: ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం అక్టోబర్ 30**

మిర్యాలగూడ: రాబోయే ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (దీూ=) పిలుపునిచ్చారు. సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తమై చర్యలు తీసుకోవడమే బాధ్యతాయుతమైన పాలన అని అన్నారు.

మిర్యాలగూడ కళావేదికలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఎల్‌నినో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో రాబోయే యాసంగిలో సాగునీరు అందే అవకాశం లేదని తెలిపారు. రైతులు బోర్లపై ఆధారపడి వరి సాగు చేసి నష్టపోవద్దని, జొన్నలు, పెసర్లు, మినుములు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

నియోజకవర్గంలోని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కరువు పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచేందుకు తన 12 నెలల జీతాన్ని దీూ= బ్రదర్స్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. వచ్చే జనవరి నుంచి తాగునీటితో పాటు పెరుగన్నం పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నీటి వనరుల ఆడిట్ నిర్వహించి, నీటి లీకేజీలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణ పనులు వేగవంతం చేయాలని, రైతులు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ చిలుకూరి సుధ, వైస్ చైర్పర్సన్ గుడిపాటి శిరీష, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# వైద్య వృత్తి మానవ సేవకు అంకితమైన పవిత్ర బాధ్యత

- **వైద్య విద్యార్థులు అంకితభావంతో రాణించాలి: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
- **భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఘనంగా వైట్‌కోట్ వేడుక**

**జయశంకర్ జిల్లా బ్యూరో అక్టోబర్ 30 (మన ప్రజావాణి ):** వైద్య విద్యార్థులు కష్టపడి చదువుతూ అంకితభావం, సేవా దృక్పథంతో గొప్ప వైద్య నిపుణులుగా ఎదిగి దేశానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. వైద్య వృత్తి కేవలం ఉపాధి మార్గం కాదని, మానవ సేవకు అంకితమైన పవిత్రమైన బాధ్యత అని పేర్కొన్నారు.

శుక్రవారం భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం వైద్య విద్యార్థుల కోసం నిర్వహించిన వైట్‌కోట్ వేడుకకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైట్‌కోట్లు అందజేసి వారి వైద్య విద్యా ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు.వైద్య విద్యలోకి అడుగుపెడుతున్న విద్యార్థుల జీవితంలో వైట్‌కోట్ ధరించడం ఒక ముఖ్యమైన మైలురాయి అని మంత్రి అన్నారు. వైట్‌కోట్ కేవలం దుస్తువు కాదని, వైద్య వృత్తిలోని పవిత్రత, నిబద్ధత, సేవాభావానికి ప్రతీక అని వివరించారు. నీట్‌లో అర్హత సాధించి వైద్య విద్యలో ప్రవేశించిన విద్యార్థుల వెనుక తల్లిదండ్రుల కృషి, త్యాగం ఎంతో ఉందని, వారి ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

పుస్తక పరిజ్ఞానంతో పాటు మానవత్వం, రోగుల పట్ల ప్రేమ, సానుభూతి, సహనం అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ వైద్య వృత్తి గౌరవాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు.

**ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలి**

ప్రపంచవ్యాప్తంగా వైద్య రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని మంత్రి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు వైద్య సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎదగాలని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, ఇతర పాఠ్యేతర కార్యక్రమాల్లో పాల్గొంటూ సమగ్ర వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు.

**రూ.130 కోట్లతో వైద్య కళాశాల అభివృద్ధి**

భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి వెల్లడించారు. కళాశాల భవనంతో పాటు బాలురు, బాలికల వసతి గృహాల నిర్మాణానికి సుమారు రూ.130 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే బాలికల వసతి గృహాన్ని ప్రారంభించామని, మరో 15 రోజుల్లో బాలుర వసతి గృహాన్ని కూడా అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు.

విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం సింగరేణి సంస్థ ద్వారా రెండు బస్సుల కొనుగోలుకు రూ.80 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, డీఎంఎఫ్‌టీ నిధుల సహకారంతో త్వరలోనే బస్సులను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

కళాశాల ప్రధాన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు అవసరమైన వైద్యులు, అధ్యాపకుల నియామకాలు, ఇతర విద్యా సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సెమినార్ హాళ్లకు ఏసీలు, వాటర్ ప్లాంట్, హాస్టళ్లలో లిఫ్ట్, జనరేటర్, కిచెన్ షెడ్ తదితర సౌకర్యాలను కల్పిస్తామని, మిగిలిన పనులను సీఎస్ఆర్ నిధుల సహకారంతో త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

**వైద్య కళాశాల అభివృద్ధికి పూర్తి సహకారం: ఎమ్మెల్యే గండ్ర**

స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ వైద్య కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి ఉన్న మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సహకారంతో కళాశాల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

ప్లేగ్రౌండ్, లైబ్రరీ, తరగతి గదులు, వాష్‌రూమ్‌లు, హాస్టల్ వసతులు తదితర సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు భూపాలపల్లిని తమ సొంత ప్రాంతంగా భావిస్తూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు.

**91 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయం: కలెక్టర్ రాహుల్ శర్మ**

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల అధ్యాపకుల కృషితో 91 శాతం ఫలితాలు సాధించడం అభినందనీయమని అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు భవిష్యత్తులో ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

గోదావరి పరివాహక ప్రాంతం, బొగ్గు గనులు, గిరిజన ప్రాంతాలతో కూడిన భూపాలపల్లి జిల్లాలో వైద్య సేవలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. గతంలో మెరుగైన వైద్య సేవల కోసం వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రభుత్వ వైద్య కళాశాల, ఆసుపత్రి అందుబాటులోకి రావడంతో పాటు సీటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని వివరించారు.

వైట్‌కోట్ ధరించడం విద్యార్థులపై గొప్ప బాధ్యతను ఉంచుతుందని, నిరంతరం విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని సూచించారు.

**రూ.15 కోట్లతో నిర్మించిన బాలికల వసతి గృహం ప్రారంభం**

వైట్‌కోట్ వేడుకకు ముందు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రూ.15 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల బాలికల వసతి గృహాన్ని ప్రారంభించారు. విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నిర్మించిన ఈ వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకురావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ సంకీర్త్, జెన్‌కో చీఫ్ ఇంజినీర్ శ్రీప్రకాష్, సర్పంచ్ రజిత, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా. వెంకటరత్నం, సర్పంచులు, కౌన్సిలర్లు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కోటంచ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు

- **ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన**

**రేగొండ అక్టోబర్ 30 (మన ప్రజావాణి):** రేగొండ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.
అనంతరం మంత్రి శ్రీధర్ బాబు ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, చేపడుతున్న నిర్మాణాలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆధ్యాత్మికంగా ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, ఆలయ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు.

# మియాపూర్ సర్వే నంబర్ 100 భూముల వివాదం.. అమాయక కుటుంబాలకు అండగా ఉంటాం

- ప్రశాంత్ నగర్ కాలనీ వాసులకు భరోసా ఇచ్చిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**కూకట్‌పల్లి, అక్టోబర్ 30 (ప్రజావాణి)** మియాపూర్ సర్వే నంబర్ 100 భూములపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రశాంత్ నగర్ కాలనీలో నివసిస్తున్న ప్రజలు తమ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కాలనీ వాసులు శుక్రవారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ప్రశాంత్ నగర్ కాలనీలో నివసిస్తున్నామని, ప్రభుత్వ రికార్డులు, సంబంధిత శాఖలు ఇచ్చిన అనుమతులను విశ్వసించి తమ జీవితకాల కష్టార్జితంతో ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో తమ ఆస్తుల భవిష్యత్తుపై తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

1954 నుంచి 1979 మధ్య రెవెన్యూ రికార్డుల్లో జరిగిన మార్పులు, అవకతవకలకు సామాన్య ప్రజలు బాధ్యులా? ప్రభుత్వ శాఖలు రిజిస్ట్రేషన్లకు అనుమతించి, అప్పటి హుడా సంస్థ లేఅవుట్లకు అనుమతులు మంజూరు చేసినప్పుడు వాటిని నమ్మి కొనుగోలు చేసిన ప్రజలు ఇప్పుడు నష్టపోవాలా? అని ప్రశ్నించారు. 1993 ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులను విశ్వసించి ప్లాట్లు కొనుగోలు చేసిన వారిలో సింగరేణి, హెచ్ఎంటీ, ఆల్విన్, హెచ్ఏఎల్, ఐడీపీఎల్, బీడీఎల్ తదితర సంస్థల్లో పనిచేసిన కార్మికులు, చిన్న ఉద్యోగులు, దిగువ మధ్యతరగతి కుటుంబాలవారే అధికంగా ఉన్నారని వివరించారు. తమ జీతాల్లో రూపాయి రూపాయి కూడబెట్టి, అప్పులు చేసి, పదవీ విరమణ ప్రయోజనాలను వెచ్చించి సొంతింటి కల నెరవేర్చుకోవాలనే ఆశతో భూములు కొనుగోలు చేశారని తెలిపారు. ప్రభుత్వ రికార్డులను నమ్మి ఆస్తులు కొనుగోలు చేయడం ప్రజలు చేసిన తప్పా? అధికారుల స్థాయిలో జరిగిన తప్పిదాలు, రికార్డుల అవకతవకలకు సామాన్య కుటుంబాలు మూల్యం చెల్లించాలా? అని ప్రశ్నించారు. న్యాయస్థానం తీర్పును గౌరవిస్తూనే, నిజమైన కొనుగోలుదారుల పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి సమగ్ర విచారణ జరపాలని కోరారు. బాధిత కుటుంబాలకు చట్టపరంగా సాధ్యమైన పరిహారం, ప్రత్యామ్నాయ స్థలాలు లేదా న్యాయమైన పునరావాస మార్గాలను ప్రభుత్వం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

గాంధీ భరోసా.. సీఎం, రెవెన్యూ మంత్రి దృష్టికి సమస్య

కాలనీ వాసుల వినతిపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ స్పందిస్తూ.. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వ వ్యవస్థను నమ్మి తమ కష్టార్జితంతో ఆస్తులు కొనుగోలు చేసిన అమాయక కుటుంబాలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశాంత్ నగర్ కాలనీ వాసుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, కాలనీ వాసులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించడంతోపాటు, ప్రభుత్వ అనుమతులను విశ్వసించి తమ జీవితకాల సంపాదనను పెట్టుబడిగా పెట్టిన సామాన్య కుటుంబాల సమస్యలను కూడా ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి న్యాయం చేయాలని ఈ సందర్భంగా కాలనీ వాసులు కోరారు.

# ఆత్మకూర్ మండలంలోని ప్రతి గ్రామంలో MSF కమిటీల ఏర్పాటు

- యువతను సంఘటితం చేస్తూ విద్యార్థుల హక్కుల సాధనకు కృషి : MRPS మండల అధ్యక్షులు కోడెపాక రాజు

**ప్రజావాణి ఆత్మకూర్ అక్టోబరు30** :మహాజన నేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు ఆత్మకూర్ మండల పరిధిలోని ప్రతి గ్రామంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (MSF) గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు MRPS మండల అధ్యక్షులు కోడెపాక రాజు మాదిగ తెలిపారు. విద్యార్థులు, యువతను సంఘటితం చేసి వారి హక్కుల సాధనకు, సామాజిక చైతన్యానికి మీఖీ వేదికగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో గురువారం ఆత్మకూర్ గ్రామంలో MRPS గ్రామశాఖ అధ్యక్షులు సంగే రాజు మాదిగ ఆధ్వర్యంలో మీఖీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీౠూ మండల ఇంచార్జి నద్దునూరి రఘు మాదిగ, MRPS మండల అధ్యక్షులు కోడెపాక రాజు మాదిగ, కో-ఇంచార్జి అర్షం సుధాకర్ మాదిగ, మీౠూ మండల అధ్యక్షులు మంద రవి మాదిగ, జన్నారపు యాకుబ్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని, మహాజన నేత మందకృష్ణ మాదిగ ఆశయ సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో మీఖీ కమిటీలను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహన పెంపొందించవచ్చని తెలిపారు. ఆత్మకూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీల ఏర్పాటు చేపట్టి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. MSF ఆత్మకూర్ గ్రామ నూతన కమిటీ వివరాలు:అధ్యక్షులు: నాగేల్లి పూర్ణచందర్ (ఇంటర్) అధికార ప్రతినిధి: మంద సాక్షిత్ (డిప్లొమా) ఉపాధ్యక్షులు: సంగే నిహన్స్ (ఇంటర్) ప్రధాన కార్యదర్శి: మైదాం ప్రభు కిరణ్ కార్యదర్శి: తిక్క సాయి చరణ్ సహాయ కార్యదర్శి: పెరుమాండ్ల ఈశ్వర్ కోశాధికారి: నత్తి వినయ్ కార్యవర్గ సభ్యులు: శతరాశి హేమంత్ నత్తి గణేష్ నత్తి హర్షిత్ తగరపు నర్సింహామంద బాలు ప్రసాద్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, సామాజిక అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీౠూ, మీఖీ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు

# ఢిల్లీ ప్రజాస్వామ్య పరిరక్షణ మహా ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణుల తరలింపు

- కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు సతీష్ పటేల్ ఆధ్వర్యంలో
- ఓటు హక్కుల పరిరక్షణే లక్ష్యం.. రాజ్యాంగాన్ని కాపాడటమే మా సంకల్పం: జుక్కల్ మండల యూత్ అధ్యక్షులు సతీష్ పటేల్

**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 3** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాటానికి మద్దతుగా ఢిల్లీలో నవంబర్ 1న నిర్వహించనున్న మహా నిరసన ర్యాలీకి జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మహా ర్యాలీలో పాల్గొనేందుకు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన నాయకులు, కార్యకర్తలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ తెలంగాణ ప్రభుత్వం జుక్కల్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు సతీష్ పటేల్ జెండా ఊపి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని ప్రజల ఓటు హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలకు బీజేపీ ప్రభుత్వం పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో అగ్రనేత రాహుల్ గాంధీ చేపడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి సంఘీభావంగా ఢిల్లీలో ఈ భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు సతీష్ పటేల్ మాట్లాడుతూ.... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని, ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. జుక్కల్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు ఢిల్లీ ర్యాలీకి తరలివెళ్లడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షులు సతీష్ పటేల్ తో పాటు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు లాల, బొమ్మల శ్రీరామ్, కృష్ణ పటేల్, అద్నాన్ తదితరులు కలిసి వెళ్లారు..

జై కాంగ్రెస్.. జై హింద్!

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- ఐకేపీ సెంటర్ లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్.. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు భరోసా
- పెద్దవంగర సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్

**పెద్దవంగర, అక్టోబర్ 30 ప్రజావాణి** రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని పేర్కొంటూ పెద్దవంగర మండల కేంద్రంలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ముద్దసాని పారిజాత సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరతో పాటు అర్హత కలిగిన సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ పొందాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులకు మెరుగైన కొనుగోలు సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, బోనస్ అందించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మహబూబ్ పాషా, విఓ, సిఏ, ముద్దసాని రవి,చిలుక సంపత్, ధనుంజయ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతా స్ఫూర్తితో అఖండ భారత నిర్మాణం

**అక్టోబర్ 30.ప్రజావాణి న్యూస్/ సంగెం** విభిన్న సంస్కృతులు, భిన్న భాషలు,అనేక మతాలు, వేలకొద్దీ ఆచారాల సుగంధాలు కలగలిసిన అద్భుత పూలతోట మన భారతదేశం. ఈ నానాత్వంలో ఏకత్వాన్ని సాధించి, కోట్లాది హృదయాలను ఒకే దారంలో గ్రథిస్తూ దేశాన్ని అఖండంగా నిలబెట్టిన మహోజ్వల సంకల్పానికి ప్రతీక "జాతీయ ఐక్యతా దినోత్సవం" (రాష్ట్రీయ ఏక్తా దివస్).అనేక రాజ్యాలుగా,విడిపోయిన ప్రాంతాలుగా ఉన్న ఉపఖండాన్ని తన ఉక్కు సంకల్పంతో ఒకే తాటిపైకి తెచ్చి, నేడు మనం చూస్తున్న సమున్నత "భారత రిపబ్లిక్" అనే మహా సౌధానికి బలమైన పునాదులు వేసిన అపర శిల్పి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31వ తేదీ కేవలం ఒక దినోత్సవం మాత్రమే కాదు అది జాతి పౌరుషానికి,సమైక్యతా భావానికి నిలువెత్తు నివాళి.చిన్నచిన్న ప్రాంతీయ, కుల,మత భేదాల సరిహద్దులను చెరిపివేసి, "మనం మొదట, కడపటి భారతీయులమే" అనే భావనను ప్రతీ పౌరుడి గుండెల్లో మళ్లీ మళ్లీ రగిలించే చైతన్య దీపమే ఈ ఏక్తా దివస్.భిన్నత్వంలో ఏకత్వమే మన బలం, మన బలమే దేశ భవిష్యత్తు అని చాటిచెప్పే ఈ పవిత్ర దినం,మనమందరం జాతి సమైక్యతను పరిరక్షించడానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చే ఒక అమర స్ఫూర్తి కేతనం.నేపథ్యం-చరిత్ర 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వతంత్ర భానుడు ఉదయించిన వేళ దేశం ఆనందోత్సాహాలతో పాటు ఒక అభేద్యమైన చారిత్రక సవాళ్లను ఎదుర్కొంది.ఆంగ్లేయుల కుట్రల ఫలితంగా,శతాబ్దాల పరిపాలనా వైవిధ్యాల కారణముగా భారతదేశం 560కి పైగా చిన్న చిన్న సంస్థానాలుగా ముక్కలైపోయింది. భిన్నత్వానికి నిలయమైన ఈ పుణ్యభూమిని, మళ్లీ విచ్ఛిన్నం చేసేందుకు సరిహద్దుల వెలుపల అనేక శక్తులు ఎదురుచూస్తున్న చీకటి ఘడియలు అవి.అటువంటి క్లిష్ట సమయంలో, హిమాలయమంత దృఢసంకల్పంతో, సముద్రమంత గంభీరతతో అవతరించిన మహాశక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్. రాజనీతిజ్ఞతను, ఉక్కు క్రమశిక్షణను నరనరాన నింపుకున్న పటేల్ రాచరిక సంస్థానాలను సామ, దాన, భేద, దండోపాయాల నడుమ ఒకే తాటిపైకి తెచ్చారు. రక్తం చిందించకుండా, హృదయాలను ముడివేస్తూ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, గుజరాత్ సరిహద్దుల నుండి ఈశాన్య కొండల వరకు వ్యాపించి ఉన్న విభిన్న సంస్కృతులను, భాషలను,సంప్రదాయాలను ఒకే జాతీయ పతాకం కిందకు చేర్చారు. ఆరోజు ఆయన చూపిన చతురత మాత్రమే నేటి అఖండ భారతావనికి ఊపిరిపోసింది.ఈ మహోన్నత త్యాగానికి, జాతి నిర్మాణ కృషికి నివాళిగా సర్దార్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31న "రాష్ట్రీయ ఏక్తాదివస్" (జాతీయ ఐక్యతా దినోత్సవం) గా జరుపుకోవడం ప్రారంభమైంది.జాతీయ ఐక్యత అనేది కేవలం ప్రతి ఏటా అక్టోబర్ 31న నిర్వహించుకునే ఒక వేడుక మాత్రమే కాదు అది ప్రతి భారతీయుడి గుండెల్లో నిరంతరం రగిలే దేశభక్తి జ్వాల.విభిన్న భాషలు,సంస్కృతులు, ఆచార వ్యవహారాల సమాహారమైన ఈ పుణ్యభూమిపై "భిన్నత్వంలో ఏకత్వమే" మన సహజ సిద్ధమైన శ్వాస. సర్దార్ వల్లభాయ్ పటేల్ తన ఉక్కు సంకల్పంతో వందలాది సంస్థానాలను ఏకం చేసి,స్వప్నంగా మారిన 'అఖండ భారత్'ను సాకారం చేశారు. ఆ మహనీయుడు మనకందించిన ఈ సార్వభౌమాధికారాన్ని,సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి పవిత్రమైన బాధ్యత.జాతి పురోగతికి ఐక్యతే పునాది.కుల,మత, ప్రాంతీయ విభేదాలను మాని, విశాల హృదయంతో చేయి చేయి కలిపి నడిచినప్పుడే రక్షణ రంగమైనా, ఆర్థిక రంగమైనా ప్రపంచ వేదికపై భారత్ సగర్వంగా నిలబడగలుగుతుంది. "మన విభేదాలు మన బలహీనతలు కావు, మన వైవిధ్యమే మన మహా బలం" అనే సత్యాన్ని గుండెల్లో నింపుకుందాం.సర్దార్ పటేల్ ఆశయాలకు ప్రతీకగా, శాంతి, సమరసత మరియు ప్రగతి పథంలో విశ్వగురువుగా భారతావనిని నిలిపేందుకు పునరంకితం అవుదాం. జై హింద్!

# గిరిజన పాఠశాల విద్యార్థులకు క్రీడా కిట్ల పంపిణీ....

- విద్యార్థులు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలి....
- జిల్లా కలెక్టర్ కె. హరిత....

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కె. హరిత ఐఏఎస్ శుక్రవారం క్రీడా కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సి ఎస్ ఆర్) నిధుల ద్వారా ఈ క్రీడా సామగ్రిని సమకూర్చారు. రవి ఫుడ్స్, చీఫ్ టు గ్రిడ్ మరియు 3ఎఫ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థల సహకారంతో విద్యార్థులకు అవసరమైన ట్రాక్ సూట్లు, స్పోర్ట్స్ షూస్, టీ-షర్టులు, షార్ట్స్‌తో కూడిన క్రీడా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు క్రీడా కిట్లను పంపిణీ చేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. గిరిజన క్రీడా పాఠశాలలోని విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో ప్రతిభను చాటాలని, జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని అందించేందుకు సి ఎస్ ఆర్ నిధుల ద్వారా సహకరించిన సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా అభినందించారు. గిరిజన ప్రాంత విద్యార్థుల్లో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, వాళ్లకు సరైన శిక్షణ, ప్రోత్సాహం, అవసరమైన వసతులు కల్పిస్తే ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జె. అంబాజీ, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు కోట్నాక విజయ్ కుమార్, డీఎస్ఓ షేకు,పి డి మీనా రెడ్డి, గిరిజన క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింబారావు,( ఎస్ జి ఎఫ్) కార్యదర్శి రామ్మోహన్, (హెచ్ డబ్లు ఓ) విజయలక్ష్మి, (పి ఇ టి ఎ) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మధుసూదన్, సత్యనారాయణ, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, గుండం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# నరకప్రాయంగా మారిన శ్వాస.. కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీ కాలుష్య కోరల్లో 100 పడకల ఆసుపత్రి!

- ముక్కు మూసుకుని ఆసుపత్రికి రావాల్సిన దుస్థితి
- రోగ నివారణకు వస్తే కొత్త రోగాలు చుట్టు ముడుతున్నాయంటూ రోగులు, స్థానికుల తీవ్ర ఆగ్రహం

**ప్రజావాణి భద్రాద్రి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ప్రాంతీయ (100 పడకల) ప్రభుత్వ వైద్యశాల పరిసరాలు తీవ్ర దుర్గంధం, రసాయన కాలుష్య పొగలతో అట్టుడుకుతున్నాయి. వైద్యం కోసం వచ్చే నిరుపేద రోగులకు, చికిత్స పొందుతున్న బాధితులకు సమీపంలోని కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న కాలుష్యం శాపంగా మారింది. ఆరోగ్యం బాగుపడటానికి ఆసుపత్రికి వస్తే, అక్కడ వెలువడే విషపూరిత వాయువులు, దట్టమైన పొగ వల్ల మరింత అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు, బాధితుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రి ముందే రసాయనాల ఘాటు!

100 పడకల ఆసుపత్రికి కూతవేటు దూరంలో ఉన్న కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీ నుండి ప్రతినిత్యం భారీగా రసాయన వ్యర్థాలు, పొగ విడుదలవుతున్నాయి. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో గాలిలో ఘాటైన రసాయన వాసనలు వ్యాపించడంతో ఆసుపత్రిలోని వార్డుల్లో ఉన్న రోగులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలతో చేరిన బాధితులు ఈ కాలుష్యం ధాటికి తీవ్ర అవస్థలు పడుతున్నారు.

కాలుష్య నియంత్రణ మండలి నిర్లక్ష్యం ఎంతవరకు సమంజసం?

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన ఆసుపత్రి ముందే ఇంతటి ప్రమాదకర కాలుష్యం విస్తరిస్తున్నా కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ ) అధికారులు, స్థానిక యంత్రాంగం నిద్రమత్తు వదలకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను గాలిలోకి, నీటిలోకి వదులుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

బోర్డు నిరసన -- తక్షణమే చర్యలు తీసుకోవాలి!

ఆసుపత్రి పరిసరాల్లో ఉన్న ప్రజలు, రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫ్యాక్టరీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే ఈ కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రాంతీయ వాసులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో అశ్వారావుపేట వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించిన అధికారులు

- కన్నెపల్లి పంచాయతీ కార్యాలయంలో కార్యక్రమం
- బ్యాంకు సేవలు, పథకాలపై ప్రజలకు వివరణ
- ఆర్థిక లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని సూచన

**కన్నెపల్లి, ( ప్రజావాణి):** గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం కన్నెపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు ఖాతాల నిర్వహణ, బ్యాంకు నిబంధనలు, వివిధ పాలసీలు, ఖాతాదారులకు అందుబాటులో ఉన్న సేవలను వివరించారు. నగదు లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు ప్రతినిధులు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

**మేడిపల్లి అక్టోబర్ 30( మన ప్రజావాణి)** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చేంగిచెర్ల డివిజన్ సూరజ్ నగర్ కాలనీలో రూ.50 లక్షల నిధులతో చేపట్టనున్న రోడ్డు అభివృద్ధి పనులకు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి,మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. బోడుప్పల్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల అమలుకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ డివిజన్ అధ్యక్షుడు పొగుల నర్సింహ్మారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కల్యాణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, సీనియర్ నాయకులు పడతం లోకేష్,కాలనీ అధ్యక్షుడు రవిచందర్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం...

- పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని ఎదుల్లగూడెం , పొద్ద టూరు మాందాపురం గ్రామాల్లో పిఎసిఎస్ ఆధ్వర్యంలో , వలిగొండ మండల కేంద్రంలో యఫ్పిఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొను గోలు కేంద్రాలను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నాయకులతో ప్రజా ప్రతినిధులతో కలిసి శుక్రవారం రోజున ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులతో మాట్లాడి , కొను గోలు ప్రక్రియ , ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర, కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాల గురించి వివ రాలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర అందించేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్ర యించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయం తో పనిచేయాలని , కొను గోలు కేంద్రాల్లో అవసర మైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతులకు సకాలంలో ధాన్యం విక్రయించే అవకాశం కల్పిస్తూ కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలని తెలిపారు. రైతుల సంక్షేమం , వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గరిసె రవి , వైస్ చైర్మన్ జక్కా జంగారెడ్డి , మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ , సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వలిగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని సహా దేవ్ , పట్టణ అధ్యక్షులు జానకిరాములు , స్థానిక సర్పంచులు , పిఎసిఎస్ డైరెక్టర్లు , ఇతర నాయ కులు , అధికారులు రైతులు పాల్గొన్నారు.

# కొండాపూర్ అభివృద్ధికి రూ.3.06 కోట్ల నిధులు

- నాలుగు కాలనీల్లో అభివృద్ధి పనులకు రేపు శంకుస్థాపన చేయనున్న PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**కొండాపూర్ అక్టోబర్ 30 (ప్రజావాణి)**కొండాపూర్ డివిజన్ అభివృద్ధికి మరో ముందడుగు పడనుంది. డివిజన్ పరిధిలోని నాలుగు కాలనీల్లో మొత్తం రూ.3 కోట్ల 6 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం (అక్టోబర్ 31) ఉదయం 11 గంటలకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, PAC చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు.తాజా మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.కాలనీల వారీగా చేపట్టనున్న పనులు:

1. ప్రేమ్ నగర్ బి బ్లాక్: రూ.2 కోట్ల అంచనా వ్యయంతో వరద నీటి సమస్యకు పరిష్కారంగా బాక్స్ డ్రైన్ నిర్మాణం.
2. మార్తాండ్ నగర్: రూ.1 కోటి 46 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం.
3. గోల్డెన్ తులిప్ కాలనీ: రూ.35 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం.
4. మాధవ హిల్స్ కాలనీ: రూ.25 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం.

ఈ కార్యక్రమానికి డివిజన్ ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, పాత్రికేయులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆరెకపూడి గాంధీ విజ్ఞప్తి చేశారు.

# 8 ఏళ్ల బాలికపై ఏళ్ల తరబడి అఘాయిత్యం...

- బాలికతో యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు.
- జీరో ఎఫ్ఎఆర్ నమోదు వికారాబాద్ జిల్లా తాండూర్ పోలీస్ స్టేషన్ కు కేసు బదిలీ.
- బాలిక తల్లిపై ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు.
- కన్న తల్లి సహా నలుగురి అరెస్టు రిమాండ్ కు తరలింపు.
- సభ్య సమాజానికి చీడపురుగు నా తల్లి.

**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30** రక్షణగా నిలవాల్సిన కన్న తల్లే కాసులకు కక్కుర్తిపడి మౌనం వహించడంతో , ఎనిమిదేళ్ల ప్రాయం నుంచే ఓ అభాగ్య బాలిక కామాంధుల చేతిలో చిక్కి నరకం అనుభవించిన అమానుష ఘటన ఆ లస్యంగా వెలుగులోకి వచ్చింది. వరుసగా లైంగిక దాడులకు పాల్పడిన ముగ్గురు నిందితులతో పాటు , వీరికి సహక రించిన బాలిక తల్లిని తాండూరు పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచి రిమాండ్కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం..కోసిగి మండలం ఎరుపుమల్ల గ్రామానికి చెందిన ఒక మహిళ భర్త చిన్న వయసులోనే మృతి చెందాడు. దీంతో ఆమె తన కూతురితో కలిసి గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ఈ క్రమంలో అదే గ్రామానికి లక్ష్మీ ప్రసన్నకుమార్ తో ఆమెకు పరిచయం ఏర్పడి ఆ పరిచయం కాస్త వివాహే తర సంబంధానికి దారి తీసింది. కరోనా సమయం లో లక్ష్మీ ప్రసన్నకుమార్, ఆ మహిళను , ఆమె కూతురిని తీసుకొని పూడూరు మండలం ఎన్కే పల్లి గ్రామంలోని ఓ మామిడి తోటలో పనికి చేరారు. అక్కడ ఉంటున్న సమయంలో అప్పటికి కేవలం 8 సంవత్సరాల వయసున్న బాలికపై పిన తండ్రి వరసయ్యే లక్ష్మీ ప్రసన్నకుమార్ తరచూ లైంగిక దాడికి పాల్పడే వాడు. అదే సమయంలో పక్కనే ఉన్న వ్యవసాయ పొలంలో పనిచేసే ఎన్కే పల్లి కృష్ణ అనే వ్యక్తి కూడా బాలికపై అఘాయిత్యానికి తెగబడ్డాడు. అక్కడి నుంచి వీరు 2022లో తాండూరు పట్టణంలోని గొల్ల చెరువు సమీపంలో అద్దె ఇంటికి మారారు. ఆ ఇంట్లోనే మరో గదిలో అద్దెకు ఉంటున్న మిట్ట బాస్పల్లి గ్రామానికి చెందిన అమృతప్ప అనే వ్యక్తి కన్ను కూడా ఆ బాలికపై పడింది. అతడు కూడా ఆ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తాండూరు నుంచి వీరు 2025లో జీవనోపాధి కోసం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సమీపం లోని యాదగిరిపల్లికి వలస వెళ్లారు. అక్కడ స్థానిక ప్రభుత్వ పాఠశాల లో బాలికను చేర్పించారు. ఇటీవల పాఠశాలలో ఆ బాలిక తీవ్ర అస్వస్థతకు గురికావడంతో , గమ నించిన ఉపాధ్యాయులు ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

అక్కడ బాలిక తాను ఎనిమిదేళ్ల వయస్సు నుంచి అనుభ విస్తున్న నరకాన్ని , పలు వురు సాగించిన లైంగిక దాడిని ఉపాధ్యాయులకు వివరించింది. విషయం తీవ్రతను గుర్తించిన ఉపాధ్యాయులు వెంటనే బాలల పరిరక్షణ కమిటీ (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) సభ్యులను అప్రమత్తం చేశారు. వారి సహకారం తో బాలిక ద్వారా యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయించారు. ఫిర్యాదు స్వీకరించిన యాదగిరి గుట్ట పోలీసులు ప్రాథమికంగా 'జీరో ఎఫ్ఎఆర్' నమోదు చేసి, నేరాలు జరిగిన వికారా బాద్ జిల్లా తాండూరు పోలీస్ స్టేషన్ కు కేసును బదిలీ చేశారు. కేసును సీరియస్ గా తీసుకున్న తాండూరు పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. బాలికపై పలు మార్లు లైంగిక దాడికి పాల్పడిన లక్ష్మీ ప్రసన్న కుమార్ , ఎన్కేపల్లి కృష్ణ, అమృతప్పలతో పాటు,నేరం జరుగుతున్నట్లు తెలిసినా అడ్డుకోకుండా వారికి సహకరించిన బాలిక తల్లి పై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. నలు గురు నిందితులను అరెస్టు చేసి న్యాయాధికారి ఎదుట ప్రవేశపెట్టి రిమాండ్ కు పంపించడం జరిగింది.

# సందీప్ కుటుంబానికి 'రాణి రుద్రమ దేవి యూనియన్' అండ!

- రూ. 10 వేల తక్షణ ఆర్థిక సహాయం అందజేత.
- చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి తెలిపారు .
- భవిష్యత్తులోనూ ఆదుకుంటామని నాయకుల భరోసా.

**కేసముద్రం, అక్టోబరు 30, ప్రజావాణి.** కేసముద్రం మండలంలోని అర్పణ పల్లి గ్రామంలో అమరవీరుడు, రాణి రుద్రమ దేవి యూనియన్ సభ్యుడు తగురు సందీప్ కుటుంబానికి యూనియన్ అండగా నిలిచింది. సందీప్ అకాల మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన యూనియన్ నాయకులు, సభ్యులు శుక్రవారం అర్పణపల్లిలో ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తొలుత సందీప్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.అనంతరం, తీవ్ర శోకసంద్రంలో ఉన్న సందీప్ కుటుంబానికి తక్షణ ఉపశమనంగా యూనియన్ తరఫున సేకరించిన రూ. 10,000 (పది వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. క్రమశిక్షణ గల తోటి సభ్యుడిని కోల్పోవడం యూనియన్‌కు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. సందీప్ అకాల మరణం ఆ కుటుంబానికి కోలుకోలేని దెబ్బని, ఈ క్లిష్ట సమయంలో వారిని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పుడు అందించిన తక్షణ సహాయమే కాకుండా, భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు కంచ వెంకన్న, ప్రతినిధులు సాగర్, సంతోష్, గంధం శ్రీను, అశోక్, రాములు, కంకల శ్రీను, ఇతర యూనియన్ సభ్యులు మరియు మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

# యాదాద్రి ఆలయ నూతన స్వాగత కమాన్ నిర్మాణానికి భూమి పూజా...

- పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్

**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30** యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు , సందర్శకు లకు ఆహ్వానం పలికేలా రాయగిరి పాత కమాన్ వద్ద నూతనంగా నిర్మించ నున్న యాదాద్రి స్వాగత తోరణం నిర్మాణ పనులకు సంబంధించి నిర్వహించిన పూజా కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య , భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , యాదాద్రి దేవస్థానం బోర్డు చైర్మన్ ఎం.ఎస్.ఎన్ రెడ్డి మరియు పాలక మండలి సభ్యులు , యాదాద్రి దేవస్థాన ఈవో భవాని శంకర్ లతో కలిసి శుక్ర వారం రోజు స్వాగతం తోరణ నూతన కమాన్ నిర్మాణ భూమి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వాగత తోరణ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లే కుండా సజావుగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. యాదాద్రి ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకు వచ్చేలా , చైర్మన్ ఎంఎస్ఎన్ రెడ్డి వారి సొంత నిధులతో స్వాగత తోరణం నిర్మాణం చే పట్టడం సంతోషకరమని పేర్కొన్నారు. యాదాద్రి క్షేత్ర ప్రాముఖ్యతకు , ఆధ్యాత్మిక వైభవానికి అను గుణంగా ఈ స్వాగత తోరణం నిర్మాణం ఉండాలని , నిర్మాణ పను లను నాణ్యతా ప్రమాణా లతో చేపట్టాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి , వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల , యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్ల వాణి భరత్ , భువనగిరి యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కమిషనర్లు , సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి కుమార్ , వెంకటేశ్వర్లు , చీర శ్రీశైలం , కానుగు బాలరాజు , హేమెంధర్ గౌడ్ , నాయకులు , కౌన్సిలర్లు , భువనగిరి నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు , నాయ కులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన వర్కింగ్ జర్నలిస్ట్ రామన్న నాయక్‌పై హత్యాయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం :టీటీడబ్ల్యూజేఏ

- గిరిజన వర్కింగ్ జర్నలిస్ట్‌పై దాడికి పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి
- ఈ ఘటన వెనుక ఉన్న హస్తాలను వెలికితీసి, రౌడీషీట్ నమోదు చేయాలి.
- తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకుల డిమాండ్.

**గూడూరు మండల ప్రతినిధి:- అక్టోబర్ 30. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం పరిధిలోని ఏపూరు గ్రామానికి చెందిన, జనంసాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్, గిరిజన వర్కింగ్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమకారుడు బానోతు రామన్న నాయక్‌పై జరిగిన దాడిని తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీటీడబ్ల్యూజేఏ) తీవ్రంగా ఖండిస్తోందని, గిరిజన వర్కింగ్ జర్నలిస్ట్‌గా రామన్న నాయక్ సమాజంలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి, ప్రజా సమస్యల వెలికితీతకు నిరంతరం శ్రమిస్తున్నారని, ఆయన ఎదుగుదలను ఓర్వలేక కొందరు కక్ష గట్టి ఈ దాడి చేయించారని స్పష్టమవుతోందని, గత ఆదివారం నంబర్ ప్లేట్ లేని కారులో ఏపూరు గ్రామంలో సంచరిస్తూ... బెల్ట్ షాపుల వద్ద రిక్కీ నిర్వహించిన గుర్తుతెలియని ఐదుగురు దుండగులు రామన్న నాయక్ బైక్‌పై వెళ్తుండగా అర్ధరాత్రి వేళ మామిడి తోట వద్ద కాపుగాచి కారు అడ్డుపెట్టారని, బీరు సీసాలు, ఇనుప రాళ్లు, కత్తులతో ఆయనపై దాడి చేస్తూ... తీవ్రమైన హత్యాయత్నానికి పాల్పడ్డారని వారు అన్నారు. సుమారు గంటసేపు సాగిన ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రామన్న నాయక్‌ను, అటుగా వెళ్తున్న బాటసారి గమనించడంతో దుండగులు పరారయ్యారని, ఇంతటి తీవ్రమైన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటి వరకు నిందితుల ఆచూకీ కనిపెట్టకపోవడం, అరెస్టు చేయకపోవడం విచారకరమని వారు వాపోయారు. సమాజ హితం కోసం పనిచేసే ఒక గిరిజన వర్కింగ్ జర్నలిస్టుపై ఇలాంటి ఘాతుకానికి పాల్పడటం ప్రజాస్వామ్యాన్ని, గిరిజనుల గొంతుకను నొక్కే ప్రయత్నమేనని పేర్కొన్నారు.

గిరిజన వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్ లు :-

గిరిజన వర్కింగ్ జర్నలిస్ట్ రామన్న నాయక్‌పై దాడి చేసిన ఐదుగురు దుండగులను వెంటనే గుర్తించి అరెస్టు చేయాలి. ఈ దాడి వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారుల పై సమగ్ర విచారణ జరిపి వారిని చట్టం ముందు నిలబెట్టాలి. నిందితులపై నిబంధనల ప్రకారం వెంటనే రౌడీషీట్ తెరవాలి. బాధిత గిరిజన వర్కింగ్ జర్నలిస్టు రామన్న నాయక్‌కు తగిన రక్షణ కల్పించి, పూర్తి న్యాయం చేయాలి. పోలీస్ యంత్రాంగం అలాగే ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే, జర్నలిస్టు వర్గాలు, అదేవిధంగా గిరిజన సంఘాల ఆధ్వర్యం లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీటీడబ్ల్యూజేఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ చందు నాయక్, సీనియర్ జర్నలిస్ట్ తేజావత్ రవి నాయక్, టీటీడబ్ల్యూజేఏ జిల్లా అధ్యక్షుడు లావుడియా మనోహర్, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బానోత్ సురేష్ నాయక్, నాయకులు నరేందర్, ఆంగోత్ చందులాల్, సీతానగరం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య మంగీలాల్, అలాగే గూడూరు జర్నలిస్ట్ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి నిర్ణయం.. ఏకగ్రీవ వరణం.. కేసముద్రం ప్రెస్ క్లబ్ నూతన సారథి కొత్తపల్లి రాములు!

**కేసముద్రం, అక్టోబర్ 30, ప్రజావాణి.** సమాజంలో జర్నలిస్ట్ పాత్ర అత్యంత కీలకమైనది. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి వారధిగా నిలిచేవాడే నిజమైన జర్నలిస్ట్. నిష్పక్షపాతంగా, నిజాయితీగా పని చేసే జర్నలిస్టుల కలయికే ప్రెస్ క్లబ్. జర్నలిస్టులందరినీ ఒకే తాటిపైకి తెచ్చి, వారి హక్కుల పరిరక్షణకు, వృత్తిపరమైన భద్రతకు అండగా నిలిచే ఒక పవిత్రమైన వేదిక ప్రెస్ క్లబ్. అటువంటి ప్రెస్ క్లబ్ బలంగా ఉన్నప్పుడే.. సమాజంలో జర్నలిజం విలువ మరింత పెరుగుతుంది. తాజాగా కేసముద్రం ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొత్తపల్లి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలాంటి విభేదాలు లేకుండా, సభ్యులందరూ ఏకాభిప్రాయంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ప్రెస్ క్లబ్ యొక్క ఐక్యతకు మరియు క్రమశిక్షణకు అద్దం పడుతోంది. ఈ ఏకగ్రీవ ఎన్నికను అటు ప్రజలు, ఇటు ప్రభుత్వ అధికారులు సైతం అభినందిస్తున్నారు.

నూతన కార్యవర్గ వివరాలు:

ప్రెస్ క్లబ్ బలోపేతానికి, జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి పనిచేసేలా అనుభవజ్ఞులు, ఉత్సాహవంతులతో కూడిన బలమైన కమిటీ ఏర్పాటయింది:

అధ్యక్షుడు: కొత్తపల్లి రాములు.

ఉపాధ్యక్షులు: సోమారపు శ్రీరాములు, మందా విక్రమ్.

ప్రధాన కార్యదర్శి: కందుకూరి రాజుచారి.

కోశాధికారి: మిట్టగడుపుల మహేందర్.

సహాయ కార్యదర్శి: చెల్లమల్ల బాలకృష్ణ.

అధికార ప్రతినిధి: వేల్పుల రేవంత్.

జాయింట్ సెక్రటరీ: మరేపాక జగన్.

ముఖ్య సలహాదారు: బబ్బురు సతీష్.

ప్రచార కార్యదర్శి: బోడ ప్రశాంత్.

కార్యవర్గ సభ్యులు: గంధం సతీష్, చంద్రగిరి వంశీ, సతీష్, తాండూరి ఉమేష్, కాశీనాథ్, సోమారపు దినేష్.

ఎన్నిక అనంతరం నూతన అధ్యక్షుడు కొత్తపల్లి రాములును సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. స్వీట్లు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. "ప్రెస్ క్లబ్ అనేది కేవలం ఒక సంఘం కాదు, జర్నలిస్టుల కుటుంబం. సమాజ శ్రేయస్సు కోసం రాత్రింబవళ్లు శ్రమించే జర్నలిస్టుల సంక్షేమం, వారి ఐక్యత, మరియు హక్కుల పరిరక్షణ కోసం ఈ నూతన కార్యవర్గం నిరంతరం కృషి చేస్తుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై అధికారులు స్పందించేలా బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని ముందుకు తీసుకెళ్తామని నూతన కమిటీ ప్రతిజ్ఞ చేసింది.

# ఎంపీ,మంత్రులపై తప్పుడు ప్రచారం చేస్తే ఖబర్ధార్...

- పార్టీ మారుతున్నారంటూ అసత్య ప్రచారాలు సరికాదు.
- సోషల్ మీడియాలో నిరాధార పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు.
- కాంగ్రెస్ నాయకుడు పిట్టల రవి హెచ్చరిక.

**పెద్దపల్లి,మన సమగ్ర ప్రజావాణి అక్టోబర్ 30** పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ,రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలపై సోషల్ మీడియాలో నిరాధార ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారానికి పాల్పడితే సహించేది లేదని కాంగ్రెస్ నాయకుడు పిట్టల రవి హెచ్చరించారు. వారు పార్టీ మారుతున్నారంటూ కొందరు అసత్య కథనాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా పిట్టల రవి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం,నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజాప్రతినిధులపై బురదజల్లడం తగదన్నారు. ప్రజల్లో వారికి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కొందరు ఇలాంటి ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కోలేక సోషల్ మీడియా వేదికగా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు,నిరాధార పోస్టులు ప్రచారం చేసే వారు తమ వైఖరిని మార్చుకోవాలని పిట్టల రవి సూచించారు. ఇలాంటి ప్రచారం కొనసాగితే సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు సైబర్ క్రైమ్ విభాగం ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హెచ్చరించారు.

# గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏల రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం

- హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థుల సంక్షేమం, వైద్య సేవలు, పెండింగ్ బిల్లులు, అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

**ఏటూరునాగారం అక్టోబరు 30 ప్రజావాణి:** తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు, అదనపు ప్రాజెక్టు అధికారులు, డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు తదితరులతో రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి/సంచాలకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చోంగ్తు, ఐఏఎస్ పాల్గొని పలు అంశాలపై సమీక్షించారు.

హాస్టళ్ల నిర్వహణ, డైట్, కాస్మోటిక్స్, అద్దె చెల్లింపులపై సమీక్ష

గిరిజన సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న డైట్, కాస్మోటిక్స్ ఛార్జీలు, అద్దె చెల్లింపులు, పెండింగ్ బిల్లుల అంశాలపై సమీక్షించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు హాస్టళ్ల నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు.

వైద్య సేవలు, వైద్య సిబ్బంది ఖాళీలపై చర్చ:

గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఖాళీలు, అవసరమైన సిబ్బంది నియామక ప్రతిపాదనలపై చర్చించారు. సంబంధిత ఐటీడీఏల పరిధిలోని ఆసుపత్రులకు అవసరమైన సిబ్బంది వివరాలను సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఏటూరునాగారం పరిధిలోని వెంకటాపురం కేంద్రానికి సంబంధించిన మార్పు ప్రతిపాదనను కూడా ప్రాజెక్టు అధికారి ప్రస్తావించారు. దీనికి అవసరమైన అనుమతులు లభించిన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

క్షేత్రస్థాయి తనిఖీలు -- డీడబ్ల్యూ ఇన్‌స్పెక్షన్ యాప్ వినియోగం

హాస్టళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు తదితర సంస్థలను అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. తనిఖీల ఫొటోలు తీసి పంపడం మాత్రమే కాకుండా, డీడబ్ల్యూ ఇన్‌స్పెక్షన్ యాప్‌లో తనిఖీ వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మూడు ఐటీడీఏల పరిధిలోని అన్ని సంస్థల తనిఖీ లక్ష్యాలను పూర్తి చేసి, గుర్తించిన సమస్యలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు, జీతాల చెల్లింపులపై సమీక్ష

జీసీసీకి సంబంధించిన పెండింగ్ బిల్లులను పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఐటీడీఏ ఏటూరునాగారం పరిధిలో జీతాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించబడినట్లు ప్రాజెక్టు అధికారి వివరించారు.

విద్యార్థుల యూనిఫాంల కుట్టింపు, పంపిణీ

విద్యార్థులకు యూనిఫాంల కుట్టింపు, సరఫరా పురోగతిని సమీక్షించారు. నేవీ బ్లూ రంగు యూనిఫాంలలో రెండు జతల కుట్టింపు పనులు సుమారు 80 శాతం పూర్తయినట్లు వివరించారు. మిగిలిన పనులతో పాటు తెలుపు రంగు యూనిఫాంల కుట్టింపు, సరఫరాను కూడా నిర్దేశిత గడువులోగా, ముఖ్యంగా 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని సూచించారు.

ప్రీ-మెట్రిక్, పోస్ట్-మెట్రిక్ ఉపకార వేతనాలు

విద్యార్థులకు అందించాల్సిన ఉపకార వేతనాల చెల్లింపులపై సమీక్షిస్తూ, ఆర్‌బీడీ కింద 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.4,500, 6 నుంచి 8వ తరగతి బాలికలకు రూ.1,500, బాలురకు రూ.1,000 చొప్పున అందించే మొత్తాలకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ చెల్లింపులను 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

హాస్టల్ బిల్లులు, పీహెచ్‌సీ నమోదు

హాస్టళ్లకు సంబంధించిన బిల్లుల సమర్పణ, క్లెయిమ్‌ల ప్రక్రియను సమీక్షించారు. ఇంకా నమోదు కాని పీహెచ్‌సీల వివరాలను పరిశీలించి, అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు పెండింగ్ బిల్లులను 10వ తేదీ నాటికి క్లెయిమ్ చేయాలని సూచించారు.

జీసీసీ భూముల నమోదు

జీసీసీకి సంబంధించిన భూముల వివరాలపై సమీక్షిస్తూ, రాష్ట్రస్థాయి బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి భూములను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఆ బృందం అభిప్రాయాలు, పరిశీలన అనంతరం సంబంధిత భూములన్నింటినీ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు

గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించే కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఇప్పటివరకు సుమారు 80 శాతం శిక్షణ పూర్తయినట్లు అధికారులు వివరించారు. మిగిలిన శిక్షణను కూడా ఈ నెల 10వ తేదీ నాటికి పూర్తి చేసి, వంద శాతం లక్ష్యాన్ని సాధిస్తామని హామీ ఇచ్చారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి: ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి అక్టోబర్ 30** పెద్దపల్లి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. వాహనదారుల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పెద్దపల్లి పట్టణంలోని కమాన్, అయ్యప్ప గుడి చౌరస్తాల వద్ద ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్న వాహనాలను తనిఖీ చేసి, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనానికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. వాహనాలకు నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాహనదారులు రహదారి భద్రతపై బాధ్యతగా వ్యవహరించాలని ఏసీపీ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించడంతో పాటు, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా పోలీసులు ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని పోలీసులు కోరారు.

# సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**చందానగర్: శేరిలింగంపల్లి, ప్రజావాణి: అక్టోబరు 30:** చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పీజేఆర్ స్టేడియంలో సీనియర్ సిటిజన్లకు సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం. ముఖ్య అతిథిగా పాల్గొన్న శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ ఐఏఎస్ సూచించారు. పీజేఆర్ స్టేడియంలో సాయంత్రం వాకర్స్ కోసం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 60 మంది హాజరుకాగా, వారిలో సీనియర్ సిటిజన్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమిత్ నారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం రోజురోజుకూ పెరుగుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఓటీపీ మోసాలు, గుర్తుతెలియని మొబైల్ యాప్‌లు, నకిలీ వీడియో కాల్స్ తదితర సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాల పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా వృద్ధులు అపరిచితుల ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని వివరించారు. ఎవరికీ ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించవద్దని, అనుమానాస్పద కాల్స్‌ను నమ్మి డబ్బులు బదిలీ చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సర్కిల్ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఏ. శ్రీధర్ కుమార్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, చందానగర్ పోలీస్ స్టేషన్

# నేరాలపై నిఘా.. ప్రజలకు భరోసా!

- చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ ఆకస్మిక తనిఖీ
- స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు
- రికార్డులు, కేసుల ఫైళ్లు, వాహనాల నిర్వహణపై పరిశీలన
- పరిశుభ్రత, క్రమశిక్షణపై పోలీసు సిబ్బందికి అభినందనలు

**చెన్నారావుపేట అక్టోబర్ 30 ప్రజావాణి** నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే.. నేరం జరగకుండా ముందాసు చర్యలు చేపట్టడమే పోలీసుల ప్రధాన బాధ్యత కావాలని వరంగల్ ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ ను వార్షికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనానికి ప్రాధాన్యత చాటారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిరంతరం పోలీసుల కదలికలు కనిపించే లా విజిబుల్ పోలీసింగ్ ను అమలు చేస్తూ ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించాలని ఆదేశించారు. ఫిర్యాదులతో బాధితులు పోలీస్ స్టేషన్ కి వస్తే వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని తెలిపారు. విచారణ అలసత్వం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్టేషన్ లోని వివిధ రికార్డులు,కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, వాహనాల నిర్వహణ, క్రైమ్ కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులను పరిశీలించారు. విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తత,క్రమశిక్షణ, ప్రజలతో వ్యవహరించే తీరుపై పలు సూచనలు చేశారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు గంజాయి గుట్కా అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డీసీపీ సూచించారు. చెడు నడవడిక కలిగిన వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆస్తి నేరాలకు తావులేకుండా పగలు రాత్రి వేళలో పెట్రోలింగ్ ను పటిష్టం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు. తనిఖీలో భాగంగా పోలీస్ సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి వారి విధి నిర్వహణ వ్యక్తిగత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు స్టేషన్ భవనాన్ని చక్కగా నిర్వహిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేసి సీఐని, ఎస్సైని సిబ్బందిని అభినందించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో నాణ్యత, వీధుల్లో పారదర్శకత, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ తనిఖీలు నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, నెక్కొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఫణిందర్, చెన్నారావుపేట ఎస్సై పొన్నాల గోవర్ధన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీ పాయింట్లపై పోలీసుల డ్రగ్స్ దాడులు..యువతకు కౌన్సిలింగ్

**మంచిర్యాల,ప్రజావాణి రిపోర్టర్, అక్టోబర్ 30:** మంచిర్యాల పట్టణంలో మత్తు పదార్థాల విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు పట్టణంలోని టీ పాయింట్ల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు పట్టణంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పట్టణ ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు టీ పాయింట్ల వద్ద మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారనే అనుమానంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రతి టీ పాయింట్ లోని స్మోకింగ్ జోన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిగరెట్ తాగుతున్న యువతకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. టీ పాయింట్ల నిర్వాహకులకు కూడా కఠిన హెచ్చరికలు జారీ చేశారు. మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పట్టణ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. యువతను మత్తు పదార్థాల బారి నుండి కాపాడేందుకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఏసీపీ ప్రకాష్ తెలిపారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. రోడ్డెక్కిన మురుగునీరు

- డ్రైనేజీ పనులు అసంపూర్తి.. వాహనదారులకు తప్పని ఇబ్బందులు

**మంథని నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 30, ప్రజావాణి:** పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల నుంచి వెలువడుతున్న మురుగునీరు రోడ్డుపైకి చేరి కాలువలా ప్రవహిస్తోంది. డ్రైనేజీ పనులు పూర్తికాకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# వల్లభి కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా...?

- ఆంధ్ర నుండి నేలకొండపల్లి చేరుతున్న ఇసుక
- పర్యవేక్షణ కరువు.. చర్యలు శూన్యం..?

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** ఖమ్మం జిల్లా ముదిగొండ నేలకొండపల్లి మండలాలకు ఆంధ్ర ప్రదేశ్ లోని మల్కాపురం నుండి నిత్యం ఇసుక రవాణా కొనసాగుతున్నట్లు ముదిగొండ నేలకొండపల్లి మండలాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా వల్లభి కేంద్రంగా ఇసుక దందా ఎటువంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో అక్రమార్కులు యధావిధిగా పట్టపగలు, మిట్ట మధ్యాహ్నం అర్ధరాత్రి అనే తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా పాల్పడుతూ దండిగా దండుకుంటున్నారని పలువురు ప్రజలు స్థానికులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం మిట్ట మధ్యాహ్నం నేలకొండపల్లి మండల పరిధిలోని చెరువు మాదారం గ్రామంలోని ఓ బజారులో ఇసుక ట్రాక్టర్ ఓ మంచినీటి పైపులైను వద్ద దిగబడటంతో సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి ఆ ప్రదేశాన్ని పరిశీలించి సంబంధిత వ్యక్తుల నుండి వివరాలు సేకరించారు. అనంతరం గుట్టు చప్పుడు కాకుండా ట్రాక్టర్ను ఆగ మేఘాల మీద బయటికి తీసి ట్రాక్టర్ తో పరారైనట్లు పంచాయతీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రోడ్లను ధ్వంసం చేస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయని పలువురు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పైగా మితిమీరిన వేగంతో రాకపోకలు సాగించటంతో ప్రజలు వాహనదారులు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న ముఠాలపై నిఘా పెంచి కఠిన చర్యలు తీసుకోవాలని ముదిగొండ నేలకొండపల్లి మండల ప్రజలు ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

# అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడి భార్య

- ఆర్థిక సహాయం అందించిన డిగ్రీ మిత్రులు

**పెద్దవంగర అక్టోబర్ 30 (ప్రజావాణి):** డిగ్రీలో కలిసి చదువుకున్న స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి డిగ్రీ మిత్రులు మానవత్వాన్ని చాటుకున్నారు. చిట్యాల గ్రామానికి చెందిన తమ సహచరుడు పోతుకునూరి ప్రవీణ్ భార్య సుమలత అనారోగ్యంతో మృతి చెందడంతో, వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేందుకు డిగ్రీ స్నేహితులు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అనుమాండ్ల ప్రవీణ్ రెడ్డి, గౌరీ సోమన్న, గద్దల సురేష్, పెండ్యాల దయాకర్, బానోతు రవి, అన్నం నవీన్ రెడ్డి, లేతాకుల మహేందర్ రెడ్డి, మచ్చ సతీష్, గార కుమార్ స్వామి, గంజి శ్యామ్ రెడ్డి తదితర డిగ్రీ మిత్రులు పాల్గొన్నారు. ఆపద సమయంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన వారి ఔదార్యాన్ని పలువురు అభినందించారు. స్నేహబంధానికి నిజమైన అర్థం చాటారని పేర్కొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే లక్ష్యం.. ఉచిత ఎక్స్‌రే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి!

- సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత ఎక్స్‌రే శిబిరం

**గరిడేపల్లి, అక్టోబర్ 30 (ప్రజావాణి):** ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా, పేద ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో గరిడేపల్లి మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత ఎక్స్‌రే శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే గ్రామ అభివృద్ధికి పునాది అని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద ప్రజలు వైద్య పరీక్షలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా దగ్గు, శ్వాస సంబంధిత సమస్యలు, ఛాతీ సంబంధిత ఇబ్బందులు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి తీవ్రత పెరగకముందే గుర్తించి తగిన చికిత్స పొందడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఇలాంటి ఉచిత శిబిరాలు ఎంతో దోహదపడతాయని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్, వైద్యాధికారి డాక్టర్ నరేష్, నాగరాజు, సాయి, అశోక్, సంతోష్, సీహెచ్ఓ భాస్కర్ రాజు, నాగరాజు, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్లు ఉమా, ఉపేంద్ర, అంజమ్మ, కోటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ మాతంగి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**నంగునూరు, అక్టోబర్ 30 :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థినులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శివకోటి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యాబోధన కొనసాగుతోందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరి అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు ఏకరూప దుస్తుల పంపిణీ చేయడం ద్వారా వారిలో సమానత్వ భావన, క్రమశిక్షణ పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పట్టుదలతో ముందుకు సాగాలని, ఉన్నత విద్యను అభ్యసించి తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ కళాశాలల్లో లభిస్తున్న అవకాశాలను వినియోగించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రిన్సిపాల్ శివకోటి పిలుపునిచ్చారు.

# జోగిపేటలో బాలల భద్రతపై అవగాహన సదస్సు

- పోక్సో చట్టం, బాలల హక్కులు, సురక్షిత స్పర్శపై విద్యార్థులకు అవగాహన

**మన ప్రజావాణి । జోగిపేట । అక్టోబర్ 30 । జిల్లా ప్రతినిధి** జోగిపేట పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో ఆందోల్--జోగిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బాలల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆందోల్--జోగిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ హాజరై విద్యార్థులకు బాలల భద్రత, హక్కుల పరిరక్షణ, చట్టాలపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం, బాలల హక్కులు, సురక్షిత స్పర్శ--అసురక్షిత స్పర్శ, సైబర్ నేరాల గురించి వివరించారు. ప్రతి విద్యార్థి తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. శ్రీకాంత్, ఎస్ఐ జి. శ్రీకాంత్ హాజరై ప్రసంగించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా, వేధింపులు ఎదురైనా భయపడకుండా ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాలల భద్రతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతకు పాఠశాలలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు తమ హక్కులపై స్పష్టతను కల్పిస్తాయని అన్నారు. ఆందోల్--జోగిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సమన్వయంతో ఈ అవగాహన సదస్సును నిర్వహించారు.

# మంథనిలో ఎంపీ కార్యక్రమం నిర్వహించకూడదా....?

- విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడం నేరమా....?
- ఎంపీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులను సస్పెండ్ చేయడం సరికాదు.
- ఐఎన్టియూసి జిల్లా నాయకుడు రాచకొండ కోటేశ్వర్లు.

**గోదావరిఖని,మన సమగ్ర ప్రజావాణి అక్టోబర్ 30** మంథని నియోజకవర్గంలో ఎంపీ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులను సస్పెండ్ చేయడంపై పెద్దపల్లి జిల్లా ఐ ఎన్ టి యూ సి జనరల్ సెక్రటరీ రాచకొండ కోటేశ్వర్లు తీవ్రంగా స్పందించారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాదా? ఆయన మంథనిలో కార్యక్రమం నిర్వహించకూడదా? విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడం నేరమా? అంటూ ప్రశ్నించారు. ఎంపీ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నంత మాత్రాన నాయకులపై చర్యలు తీసుకోవడం సమంజసం కాదని రాచకొండ కోటేశ్వర్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కాక కుటుంబం చేసిన సేవలను మరిచిపోయారా అని ప్రశ్నించారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న నాయకుల పట్ల వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలని హితవు పలికారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఆంక్షలు విధించడం, నాయకులపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు ప్రజాప్రతినిధులు విద్యార్థులకు సహాయం చేయడం, ప్రజలతో మమేకమవడం రాజకీయాల్లో భాగమని రాచకొండ కోటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులపై చర్యలు తీసుకోవడం పార్టీ శ్రేణుల్లో అసంతృప్తికి దారితీస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నాయకులపై జరిగిన సస్పెన్షన్లై ఉద్దేశించి ఆయన తీవ్ర హెచ్చరికలు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన నాయకులకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎడిన పంట పొలాల పరిశీలన

- కరెంట్ కోతలను నివారించాలి మంచాల మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి బిఆర్ ఎస్ పార్టీ మంచాల మండల అధ్యక్షుడు చీరాల రమేష్

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 30 (ప్రజావాణి):** మంచాల మండలం బిఆర్ఎస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ఆధ్వర్యంలో మంచాల జపాల ఆరుట్ల గ్రామాలలో నీళ్లు లేక ఎండిపోయిన పంటలను పరిశీలించిన బిఆర్ఎస్ పార్టీ బృందం రైతులు మాట్లాడుతూ వర్షాలులేక ఆందోళన చెందుతున్న క్రమంలోకనీసం బోరు బావులతో తినడానికి సరిపడ పంటపండించుకుందా మంటే లో ఓల్టేజ్ కరెంట్ సమస్యతో బోర్ మోటార్లు కాలిపోవడం మాకు పెద్ద ఇబ్బంది కలుగుతుందని రైతులు తమ బాధను బి అర్ఎస్ పార్టీ బృందానికి తమ సమస్యల గోడును ఆవేదనతో చెప్పుకున్నారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండలం అధ్యక్షుడు చీరాల రమేష్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య మంచాల వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సమయాన్ని తగ్గించడమే కాకుండా వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ రాక అప్పుడప్పుడు విద్యుత్ కు అంతరాయం కలగడం వల్ల రైతులు నాన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైతులకు వ్యవసాయానికి విద్యుత్ నిరంతరం ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేసాం రైతులకు సరైన సమయానికి రైతు బంధు డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలో వేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం అని అన్నారు ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరాచేయాలి మరియు మంచాల మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించి ప్రకటన చేయాలనీ ఎండిన పంటలకు వెంటనే నష్ట పరిహారం అందించాలని లేదంటే బిఆర్ఎస్ పార్టీ ముందుండి రైతులపక్షాన రైతులతో కలిసి ప్రభుత్వంపైన పెద్దఎత్తున ఉద్యమిస్తాం అని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మంచాల మండలం మాజీ ఎంపీపీ మంకు ఇందిర మాజీ వైస్ మం చాల సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ దండేటికార్ రవి మాజీ డైరెక్టర్ జంబుల కిషన్ రెడ్డి పటేల్ చెరువుతండా మాజీ సర్పంచ్ రాజునాయక్ ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభకుమార్ జాపాల గ్రామసర్పంచ్ మంచాల రవి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిందం రఘుపతి మొర్రి ఐలయ్య ఆరుట్ల గ్రామపంచాయతీ వార్డుసభ్యులు మాదుగుల బాలమణి పున్నం రాము నాయకులు జీఎంపీస్ చెర్మన్ చిందం జంగయ్య బకున చందు ఆకారం కృష్ణ లచ్చిరాం ఆవుల శ్రీను గుంతండ్ల మల్లేష్ బర్మల వెంకటేష్ కాటి కృష్ణ అశ్వాల బాలరాజ్ మెగావత్ గణేష్ నోముల మధు తదితరులు పాల్గొన్నారు

# తూనికలు.. కొలతల్లో అక్రమాలకు చెక్!

- నిర్మల్‌లో లీగల్ మెట్రాలజీ అధికారుల ఆకస్మిక తనిఖీలు.. నిబంధనలు ఉల్లంఘించిన రెండు వ్యాపార సంస్థలపై కేసులు

**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, అక్టోబర్ 30:--** వినియోగదారులకు ఎలాంటి మోసం జరగకుండా వ్యాపార లావాదేవీల్లో పారదర్శకత పాటించాలని జిల్లా తూనికలు, కొలతల అధికారి పి. శంకర్ వ్యాపారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తూనికలు, కొలతలకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించిన రెండు వ్యాపార సంస్థలను గుర్తించి, వాటిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అధికారి పి. శంకర్ మాట్లాడుతూ.. వ్యాపార సంస్థల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లు, కాండా బాట్లు తదితర తూనిక పరికరాలకు నిర్దేశిత గడువులోగా తప్పనిసరిగా ధ్రువీకరణ (స్టాంపింగ్) చేయించుకోవాలని సూచించారు. ప్యాకింగ్ చేసి వస్తువులను విక్రయించే వ్యాపారులు సంబంధిత శాఖ నుంచి ప్యాకింగ్ లైసెన్స్ పొందిన తర్వాతే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. వినియోగదారులకు సరైన తూనికతో వస్తువులు అందించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని పేర్కొన్నారు. నిబంధనల పట్ల నిర్లక్ష్యం వహించినా, ఉల్లంఘనలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా వ్యాపారులందరూ లీగల్ మెట్రాలజీ నిబంధనలను పాటిస్తూ తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని పి. శంకర్ కోరారు.

# గీత కార్మికుల పెన్షన్ దరఖాస్తులపై ఎక్సైజ్ అధికారుల తనిఖీలు!

- ఐడీ కార్డులు, వయస్సు ధ్రువీకరణ పత్రాల పరిశీలన

**గరిడేపల్లి, అక్టోబర్ 30 (ప్రజావాణి):** గ్రామ సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్య గౌడ్ ఆధ్వర్యంలో గరిడేపల్లి మండల కేంద్రంలో గీత కార్మికుల పెన్షన్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న గీత కార్మికుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దరఖాస్తుదారుల ఐడీ కార్డులు, వయస్సు ధ్రువీకరణ పత్రాలు, ఇతర సంబంధిత రికార్డులను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. అర్హులైన గీత కార్మికులను గుర్తించి ప్రభుత్వ పెన్షన్ పథకం ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులకు పెన్షన్ ఎంతో ఆర్థిక భరోసాగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ సమరానికి సై.. ఓటరు నమోదుపైనే బీఆర్ఎస్ గురి!

- కేసముద్రం వేదికగా గులాబీ శ్రేణుల సమీక్షా సమావేశం.
- కాంగ్రెస్ వైఫల్యాలే అస్త్రాలుగా ప్రచారం.. నిరుద్యోగ ఓటర్లపైనే దృష్టి.
- గడువు తక్కువగా ఉండటంతో పట్టభద్రుల నమోదుకు నేతల పిలుపు.

రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన నల్గొండ--ఖమ్మం--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల వేడి మొదలైంది. ప్రధాన పార్టీలన్నీ పట్టభద్రుల ఓట్లను కొల్లగొట్టడమే లక్ష్యంగా వ్యూహప్రతివ్యూహాలకు పదను పెడుతున్నాయి. ఇందులో భాగంగా, కేసముద్రం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తించింది. రాబోయే ఎన్నికల్లో పట్టభద్రుల ఓట్లే గెలుపోటములను నిర్ణయించనున్న నేపథ్యంలో, ఓటరు నమోదు ప్రక్రియను ఒక ఉద్యమంలా చేపట్టాలని గులాబీ శ్రేణులు నిర్ణయించాయి.

**యువతే లక్ష్యంగా ఓటరు నమోదు వేగవంతం:**

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్, మాజీ మంత్రి శ్రీమతి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు చాలా తక్కువగా ఉన్నందున, ప్రతి గ్రాడ్యుయేట్ యువకుడిని ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ శ్రేణులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. చదువుకున్న యువత సమాజంలో మార్పుకు నాంది పలకాలని, అందుకోసం తమ మిత్రులు, కుటుంబ సభ్యుల్లో అవగాహన కల్పించాలని కోరారు.

**ప్రజా సమస్యలే అజెండాగా విమర్శల అస్త్రాలు:**

పత్రికా సమావేశంలో జర్నలిస్టిక్ విలువలను ప్రతిబింబిస్తూ, ప్రజా కోణంలో అధికార పక్షాన్ని నిలదీశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాల భర్తీ హామీలను, రైతులకు ఇచ్చిన రుణమాఫీ, ఇతర భరోసా వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైందని సత్యవతి రాథోడ్ విమర్శించారు. ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను, ముఖ్యంగా యువతలో ఉన్న అసంతృప్తిని పట్టభద్రుల ఎన్నికల్లో అనుకూలంగా మార్చుకోవాలనే వ్యూహాన్ని ఆమె స్పష్టం చేశారు. చదువుకున్న మేధావులు సమాజాన్ని ప్రభావితం చేయగలరని, అందుకే బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు వారు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

**ఐక్యత చాటిన క్షేత్రస్థాయి శ్రేణులు:**

ఈ సమావేశంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శ్రీ బాణోత్ శంకర్ నాయక్, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు శ్రీ ఏనుగుల రాకేష్ రెడ్డిలు పాల్గొని క్షేత్రస్థాయిలో ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలో క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. స్థానిక మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచ్‌లు ఈ సమావేశంలో పాల్గొని, ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి గ్రామానికి తీసుకెళ్తామని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బాణోత్ శంకర్ నాయక్ ,రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి,బి ఆర్ఎస్ నాయకులు నజీర్, కమటం శ్రీను, రావుల శ్రీనాథ్ రెడ్డి, కొండ్రేటి రవీందర్ రెడ్డి, మోడం రవీందర్ గౌడ్, కూన భద్రాద్రి, కౌన్సిలర్లు రావుల వినయ్ రెడ్డి, పాయిరాల శరత్ కుమార్, మేకల సురేష్, ఆగే రాము, సర్పంచులు ఏర్పుల కుమాం స్వామి, బిఆర్ఎస్ నాయకులు దేవేందర్,మాజీ ఎంపిటిసిలు,మాజీ ఎంపీలు, బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల, దండపల్లి ఘటనపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు

**మంచిర్యాల, ప్రజావాణి రిపోర్టర్, అక్టోబర్ 30** :మంచిర్యాల జోన్లోని మంచిర్యాల, దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం సంఘటన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆధారాలను సేకరించి విశ్లేషించనుంది.మంచిర్యాల జోన్లోని మంచిర్యాల, దండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనలపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.ఈ బృందం సంఘటన స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వ్యక్తులు, సాక్షులను విచారించడంతో పాటు సాంకేతిక ఆధారాలను సేకరించి విశ్లేషించనుంది. అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగా సంఘటనల వాస్తవాలను, సంబంధిత వ్యక్తుల పాత్రను నిష్పక్షపాతంగా నిర్ధారించనుంది.దండేపల్లి, మంచిర్యాల పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు 24 గంటలూ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని సీపీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఊహాజనిత, నిర్ధారణ కాని మరియు అసత్య సమాచారాన్ని నమ్మవద్దని, వాటి ఆధారంగా ప్రజలు ఆందోళనకు గురికావద్దని సీపీ సూచించారు. అధికారికంగా పోలీస్ శాఖ విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ ప్రాధాన్యత. శాంతిభద్రతల పరిరక్షణకు రామగుండం పోలీస్ కమిషనరేట్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు.

# ఎల్‌నినో సవాలును ఎదుర్కొనేందుకు సమష్టి కార్యాచరణ

- రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి - మెదక్ కలెక్టర్

**కొడిపల్లి, అక్టోబర్ 30 (మన ప్రజావాణి - నియోజకవర్గ ప్రతినిధి)**రాబోయే ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తమై చర్యలు తీసుకోవడమే బాధ్యతాయుతమైన పాలన అని అన్నారు. కొడిపల్లి మండలం ధర్మసాగర్ గ్రామంలో నిర్వహించిన ఎల్‌నినో అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలో తాగునీటి సరఫరా అవసరాలకు బోరు మోటార్, బోరుబావి అవసరం ఉందని పాలకమండలి, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు తెలియజేశారు. వీ బీ జీ రామ్ జీ పథకం కింద ఇందిరా జల సిరి వారంలో పనులు ప్రారంభిస్తామని తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులను ఎంపిక చేసి ఎంపీడీఓ లాగిన్ లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వానికి సంబంధించిన వివిధ పథకాల గురించి కూడా పాలకమండలితో చర్చించడం జరిగింది. పాలకమండలి ఇదే విధంగా సహకారం చేస్తే అభివృద్ధి మరింత ముందుకు వెళ్తుందని కలెక్టర్ కొనియాడారు.యాసంగి సీజన్ లో వరి నాట్లకు సరిపడా నీటి నిల్వలు బోరు బావుల్లో తగ్గిన నేపథ్యంలో రాబోయే యాసంగిలో సాగునీరు అందే అవకాశం లేదని తెలిపారు. రైతులు బోర్లపై ఆధారపడి వరి సాగు చేసి నష్టపోవద్దని, జొన్నలు, పెసర్లు, మినుములు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు.నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచ్, ఉప సర్పంచ్, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# చెట్లపొదలతో కుచించుకుపోయిన రహదారి.. ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

- నంగునూరు--కొమురవెల్లి--హైదరాబాద్ మార్గంలో ప్రమాదాల భయం
- అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి

**నంగునూరు, అక్టోబర్ 30** :సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రం నుంచి నల్ల పోచమ్మ దేవస్థానం - చేర్యాల- కొమురవెల్లి మీదుగా హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి సమస్యలతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. రహదారికి ఇరువైపులా చెట్లపొదలు విపరీతంగా పెరిగి రోడ్డుపైకి విస్తరించడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై సరైన సూచిక బోర్డులు లేకపోవడం, రోడ్డు పరిస్థితి సరిగా లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టకపోవడం, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్లపొదలను తొలగించడంతో పాటు రోడ్డు మరమ్మతులు చేపట్టి, అవసరమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలు!

- దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటించాలి.. కుక్కల నియంత్రణకు ఏబీసీ కేంద్రం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రజావాణి బ్యూరో, అక్టోబర్ 30:--**ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అర్హులకు న్యాయం జరిగేలా పింఛన్ల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో కుక్కకాటు ఘటనలను నివారించేందుకు అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రం నిర్వహణకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. మండలాల వారీగా అందిన పింఛన్ దరఖాస్తుల వివరాలను పరిశీలిస్తూ, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు సంబంధించిన దరఖాస్తులను ప్రత్యేక శ్రద్ధతో తనిఖీ చేయాలని సూచించారు. అర్హత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరిశీలన పూర్తి చేయాలన్నారు.

అనంతరం జంతు నియంత్రణ చర్యలపై సమీక్షిస్తూ, ఏబీసీ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది, ఇతర ఏర్పాట్లతో పటిష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వీధి కుక్కల నియంత్రణకు సమన్వయంతో చర్యలు చేపట్టి ప్రజలకు కుక్కకాటు ప్రమాదాలు ఎదురుకాకుండా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో చేపడుతున్న మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీ) నిర్మాణాల పురోగతి, అనుమతులు, సంబంధిత అంశాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో ప్రభుత్వ అనుమతి పొందిన ఇసుకనే వినియోగించేలా మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నిబంధనల అమలులో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీపీఏహెచ్ఓ సురేష్, మైనింగ్ అధికారి తిరుపతిరావు, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, సుందర్ సింగ్, సంతోష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మంజూరు చేయాలని కేంద్ర రైల్వే మంత్రికి ఎంపీ చామల విజ్ఞప్తి...

**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం రోజున కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ కి లేఖ ద్వారా ఒక ముఖ్య మైన విజ్ఞప్తిని చేరవేశారు. నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ నుండి మునుగోడు మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు మార్గంలో (బీబీనగర్ - నాదికుడ/నల్గొండ రైల్వే లైన్) చిట్యాల మున్సి పాలిటీ వద్ద ఉన్న గేట్ నెం. 26 (లోకల్-49/15-16) వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్య నెలకొంది.నకేరికల్ నియోజక వర్గంలోని చిట్యాల మున్సి పాలిటీ ట్రాఫిక్ మునుగోడు నియోజకవర్గ గ్రామాలకు వెళ్లాలంటే ఈ లెవెల్ క్రాసింగ్ గేటును దాట వలసి ఉంటుంది. ప్రతి రైలు రాకపోకల సమయం లో ఈ రైల్వే గేట్ సుమారు 15 నిమిషాల పాటు మూసివేయబడుతోంది. అంతే కాకుండా , హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ట్రాఫిక్ కూడా ఈ గేట్ వద్దే కలుస్తుండటం గమనార్హం.రైల్వే మార్గం విద్యుద్దీకరణ పూర్తి కావడం వల్ల రైళ్ల రాకపోకల ఫ్రీక్వెన్సీ మరింత పెరిగింది. దీనివల్ల వాహనదారులు మరియు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. తెలంగాణ శాసనమండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి తేదీ 25.10.2026 నాటి డి.ఓ లేఖను రిఫరెన్స్‌గా తీసు కుంటూ , ప్రయాణికుల మరియు ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని చిట్యాల-మునుగోడు రోడ్డులోని ఎల్.సి. గేట్ నెం. 26 వద్ద వెంటనే ఒక రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ సమస్య తీవ్రతను దృష్టి లో ఉంచుకుని , కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అత్యున్నత ప్రాధాన్యత ప్రాతిపదికన రైల్వే ఓవర్ బ్రిడ్జిని మంజూరు చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రిని అభ్యర్థించారు.

# నాగర్‌గూడ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

- సొంత ఖర్చులతో క్రీడా దుస్తులు అందించిన తాళ్ల నవీన్ గౌడ్

**రంగారెడ్డి జిల్లా బ్యూరో ప్రజావాణి అక్టోబర్ 30**షాబాద్ మండలంలోని నాగర్‌గూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ తాళ్ల నవీన్ గౌడ్ తన సొంత ఖర్చులతో క్రీడా దుస్తులను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాబాద్ మండల విద్యాధికారి డి. లక్ష్మణ్ హాజరై విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విద్యాధికారి డి. లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, పట్టుదలతో పాటు జట్టుగా పనిచేసే నైపుణ్యం పెంపొందుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ తన సొంత ఖర్చులతో క్రీడా దుస్తులు అందించిన తాళ్ల నవీన్ గౌడ్‌ను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ షాబాద్ మండల అధ్యక్షుడు టి. డేవిడ్ రెడ్డి,ఉపాధ్యాయులు సంగమేశ్వర్ రెడ్డి,నాగిరెడ్డి జెడ్పీహెచ ఎస్ తాళ్లపల్లి రమేష్ జెడ్పీహెచ్ఎస్ పోతుగల్ యువజన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ క్రీడా దుస్తులు విరాళంగా అందించిన తాళ్ల నవీన్ గౌడ్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. కృష్ణ, ఉపాధ్యాయురాలు మంజుల, విద్యార్థులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చింతలపాలెం విద్యార్థి ఎంపిక

- షాట్‌పుట్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన నందిరెడ్డి అనీష్ రెడ్డి

**?చింతలపాలెం అక్టోబర్ 30 ( ప్రజావాణి )** :సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌అండర్-14 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చింతలపాలెం మండలానికి చెందిన నందిరెడ్డి అనీష్ రెడ్డి ప్రతిభ కనబరిచాడు. కోదాడలోని ఎస్సార్ఎం సంకల్ప్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అనీష్ రెడ్డి తండ్రి: ఇంద్రారెడ్డి, షాట్‌పుట్ విభాగంలో 10.05 మీటర్ల దూరం విసిరి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.ఈ ప్రదర్శనతో నవంబర్‌లో హైదరాబాద్ వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అనీష్ రెడ్డి అర్హత సాధించాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అలాగే చింతలపాలెం మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించి జిల్లాకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ అతనికి అభినందనలు తెలిపారు.

# ప్రజా ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల సాకారం

- ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో పాల్గొన్న గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా బ్యూరో ప్రజావాణి అక్టోబర్ 30** ప్రజా ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతోందని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. షాబాద్ మండలం గోపీగడ్డ గ్రామానికి చెందిన ప్రసన్న దయాకర్‌కు ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, స్వరూప, మహేందర్ గౌడ్, నాయకులు రవీందర్, యాదయ్య, సుభాష్ రెడ్డి, రఫీక్, కిషోర్, సూర్య, గౌరీ, దయాకర్, మాణిక్యం, రాఘవరెడ్డి తదితరులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ జెండా కర్ర తొలగించి కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్

**టేకుమట్ల/అక్టోబర్29:** టేకుమట్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా తొలగించి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై శుక్రవారం టేకుమట్ల స్టేషన్ ఇంచార్జ్ రాజమౌళి కి మరియు ఎంపీడీవో ఆఫీస్ సీనియర్ ఆపరేటర్ సంపత్ పిటిషన్ ఇవ్వడం జరిగింది.అనంతరం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవానికి సంబంధించినటువంటి జెండా తీసివేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫ్లెక్సీ పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు దళితుల ఆత్మగౌరవమైనటువంటి జెండా తీసివేయడం ఎంఆర్పిఎస్ నాయకుల మనోభావాలకును కించపరుస్తూ చేస్తున్న చర్యలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ దళితుల ఆత్మగౌరవానికి భంగం కలవకుండా మండల అధికారులు చొరవ తీసుకోవాలని వారు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిత్యం దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఈ దాడులను అరికట్టే విషయంలో చట్టపరమైన చర్యలు అధికారులు తీసుకొని ఎడల ఈ మండలంలో ఉన్నటువంటి దళిత సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నాలు రాస్తారోకోలు చేస్తామని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాం రాంచందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు రేణికుంట్ల శంకర్ మాదిగ,ఎం ఎస్ పి మండల అధ్యక్షులు మాడుగుల వీరయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## చింతలపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- క్వింటాలుకు రూ.500 బోనస్
- రైతులు సద్వినియోగం చేసుకోవాలి: సహకార సంఘం సీఈఓ యలమందరావు

**చింతలపాలెం అక్టోబర్ 30 ( ప్రజావాణి ) :**స్థానిక సహకార సంఘం ఆధ్వర్యంలో 2026--27 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సొసైటీ సీఈఓ యలమందరావు తెలిపారు. మండల పరిధిలోని రైతులు దళారులను ఆశ్రయించకుండా ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తోందని స్పష్టం చేశారు. రైతులు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు పాటించి, తేమ శాతం నిబంధనల మేరకు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు పూర్తి పారదర్శకతతో కొనుగోళ్లు చేపడతామని, రైతులు సొసైటీ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## జయముఖిలో ముగిసిన కిల్ క్యాన్సర్ ఎలోక్యూషన్ పోటీలు

**చెన్నారావుపేట అక్టోబర్ 30 ప్రజావాణి** స్థానిక జయముఖి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ విభాగం, కూకట్‌పల్లి ఇస్కాన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు కిల్ క్యాన్సర్' అనే అంశంపై నిర్వహించిన ఎలోక్యూషన్ (ఉపన్యాస) పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి.ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్యాన్సర్‌కు గల కారణాలు, ముందస్తు గుర్తింపు, నివారణ చర్యలతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రాముఖ్యతపై తమ విశ్లేషణాత్మక ప్రసంగాలతో తోటి విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని నింపారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. వి. జానకి మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండటం అత్యంత ఆవశ్యకమని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, ముందస్తు పరీక్షల ద్వారానే ఈ మహమ్మారి ముప్పును తిప్పికొట్టవచ్చని పిలుపునిచ్చారు.యువత చదువుతో పాటు సమాజంలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేలా ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని తమ బాధ్యతను చాటుకోవాలని ఆమె ఆకాంక్షించారు.అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారితో పాటు క్రియాశీలకంగా పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రిన్సిపాల్ డా. వి. జానకి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బి. సందీప్‌తో కలిసి ప్రశంసా పత్రాలను అందజేశారు.ఎన్ఎస్ఎస్ విభాగం నేతృత్వంలో జరిగిన ఈ అవగాహన సదస్సు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపగా, కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ చింతకింది అశోక్ మృతి..అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించిన పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి

**చెన్నారావుపేట అక్టోబర్ 30 ప్రజావాణి** మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ సొసైటీ చైర్మన్ చింతకింది వంశీ తండ్రి అయిన చింతకింది అశోక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన ఆకస్మిక మరణం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కల్గించింది.విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డి ఉప్పరపల్లి గ్రామానికి చేరుకున్నారు. అశోక్ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొన్న స్వప్న సుదర్శన్ రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.చింతకింది అశోక్ అంతిమయాత్రలో రాజకీయ ప్రముఖులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బాల్నే వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్, నెక్కొండ మండల పార్టీ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అనుముల కుమారస్వామి, కొండవీటి ప్రదీప్ కుమార్,మాజీ కోఆప్షన్ మెంబర్ రఫీ, మండల ఉపాధ్యక్షులు కుసుమ నరేందర్, మాజీ సర్పంచులు పెరుమాళ్ళ శ్రీధర్ రెడ్డి, కుండే మల్లయ్య, మాజీ డైరెక్టర్ జున్నుతుల శ్రీధర్ రెడ్డి, ఎంపిటిసి చెరుకుపల్లి విజేందర్ రెడ్డి, నాయకులు ఎడారి సాయిలు, గుండాల మహేందర్, పసునూటి రమేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు అందే వెంకట రాములు, కందగట్ల సాంబయ్య, ఉప సర్పంచ్ మంతుర్తి అన్వేష్, సీనియర్ నాయకులు ఉడుగుల సాంబయ్య, మండల నాయకులు ములుక సాంబయ్య కవి, మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్, మూడు రమేష్, పవన్, అలాగే ఉప్పరపల్లి స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు, పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని అశోక్‌కు కన్నీటి నివాళులు అర్పించారు.

# ఏజెన్సీ ఏరియాలోని వైద్యశాఖలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

- ఏజెన్సీ ఏరియాలో వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలి
- వైద్యుల కొరత ఉన్నచోట, స్పెషలిస్ట్ వైద్యులను కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు చర్యలు..
- గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినిలకు నాప్కిన్స్ పంపిణీకి చర్యలు చేపట్టాలి.
- వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్ట్ న జెడ్ చోంగ్తూ..

**భద్రాచలం, అక్టోబర్ 30 (మన ప్రజావాణి):** ఏజెన్సీ ఏరియాలోని గ్రామాలలో గిరిజనులకు అనేక మౌలిక వసతులతో వైద్య సేవలు అందించడానికి డాక్టర్ల భర్తీ చేయడమే కాకుండా, స్పెషలిస్ట్ వైద్యులను నియమించి, గిరిజనులకు వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్ట్ న జెడ్ చెంగుతూ అన్నారు. శుక్రవారం రోజు హైదరాబాదు నుండి గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఐటీడీఏ పీవోలు, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, డిటిడివోలు, ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియాలోని ఏరియా ఆసుపత్రులు పీహెచ్సీల అభివృద్ధి కొరకు, కోటి రూపాయల కంటింజెన్సీ నిధులను ఏజెన్సీ ఏరియా పరిధిలోని ఆరోగ్యశాఖ అవసరాలను తీర్చేందుకు, ఐటీడీఏ పీవో వద్ద రూ. 1 కోటి కంటింజెన్సీ నిధులు అందుబాటులో ఉంచాలని నిర్ణయించడం జరిగిందని, ఈ నిధులను అత్యవసర వైద్య అవసరాలు, మౌలిక సదుపాయాలు, ఇతర ఆరోగ్యశాఖ అవసరాల కోసం వినియోగించుకోవచ్చునని అన్నారు.

సంబంధిత ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో టివివిపి ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జిజిహెచ్) సూపరింటెండెంట్, ప్రభుత్వ వైద్య కళాశాల, కొత్తగూడెం ప్రిన్సిపాల్‌తో సమీక్ష సమావేశం నిర్వహించి, స్పెషలిస్ట్ వైద్యుల కొరతను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్పెషలిస్ట్ వైద్యుల నియామకానికి బడ్జెట్, అదనపు ప్రోత్సాహకాలు అందించి, ఏజెన్సీ ప్రాంతంలోని ఆసుపత్రులు, జిజిహెచ్ లో ముఖ్యంగా అధిక డిమాండ్ ఉన్న క్లినికల్ స్పెషాలిటీలలో వైద్యుల కొరతను గుర్తించి, అవసరమైన స్పెషలిస్ట్ వైద్యులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని సూచించారు. అదనంగా, స్పెషలిస్ట్ వైద్యులను ఆకర్షించేందుకు తగిన ప్రోత్సాహక (అడిషనల్ ఇన్సెంటివ్) మొత్తాన్ని కూడా అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో ట్రైబల్ టి-హబ్ భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న ట్రైబల్ టి-హబ్ పనుల పూర్తిస్థాయిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు, రాష్ట్రస్థాయి అధికారుల బృందాన్ని పంపించాలని, బృందం సమర్పించే పరిశీలన నివేదిక ఆధారంగా, ఇప్పటికే కేటాయించిన నిధులకు అనుగుణంగా అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.

గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల గురుకులాలు వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థినిలకు సకాలంలో న్యాప్కిన్స్ పంపిణీ జరిగేలా సంబంధిత అధికారులు చొరవ చూపాలని అన్నారు. తమరి సూచనలు ప్రకారము ఏజెన్సీ ఏరియా పరిధిలోని పీహెచ్సీలలో డాక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ తప్పనిసరిగా జారీ చేస్తామని, అలాగే పిహెచ్సిల అభివృద్ధికి అవసరం ఉన్న చోట నిధులు వెచ్చించి వైద్యులకు, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పిస్తామని ఐటీడీఏ పీవో రాహుల్ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ రవిబాబు, ఏడిఎంహెచ్వో సైదులు, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## పీరంపల్లిలో కలెక్టర్ దీపక్ తివారీ ఆకస్మిక తనిఖీలు: పనుల నాణ్యత, సంక్షేమ పథకాల అమలుపై ఆరా..

**పరిగి/కుల్కచర్ల,అక్టోబర్ 30(ప్రజావాణి )**మండల పరిధిలోని పీరంపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సుడిగాలి పర్యటన చేపట్టారు. గ్రామంలోని పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో కొనసాగుతున్న పంట పొలాల స్థితిగతులను, భూ సర్వే ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి పంటల పరిస్థితి, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ సర్వేను పారదర్శకంగా, ఎటువంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వంటశాల, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజన నాణ్యతపై ఆరా తీశారు. మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని నాణ్యతా ప్రమాణాలతో అందించాలని, పరిశుభ్రత విషయంలో ఏమాత్రం రాజీ పడొద్దని నిర్వాహకులకు స్పష్టం

చేశారు.అలాగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీల హాజరు పట్టికను, జరుగుతున్న పనుల నాణ్యతను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి రోజువారీ వేతనం, తాగునీరు, నీడ వంటి మౌలిక వసతుల కల్పనపై విచారించారు.

అర్హులైన ప్రతి కూలీకీ పని కల్పించడంతో పాటు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో సంబంధిత మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## "ఆదిసేవా" కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి..

- ఐటీడీఏ పీవో బి.రాహుల్

**భద్రాచలం, అక్టోబర్ 30 (మన ప్రజావాణి):** ఆదివాసీ సమాజ అభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'ఆదిసేవా" కార్యక్రమాలను నవంబర్ 1వ తేదీ నుండి 15 నవంబర్ 2026 వరకు, సంబంధిత శాఖల అధికారులు,మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), విద్యాసంస్థల అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఐటీడీఏ భద్రాచలం ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ సంబంధిత ఎంపీడీవోలకు సూచించారు. శుక్రవారం రోజు తన చాంబర్ నుండి టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆదివాసి సమాజ అభివృద్ధి సంక్షేమం, ప్రభుత్వ పథకాలపై చేయవలసిన కార్యాచరణపై సంబంధిత ఎంపీడీవోలతో మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవోలు తమ పరిధిలోని అన్ని ఆదిసేవా కేంద్రాలలో కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి నిర్ణయించిన షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

ప్రతి ఆదిసేవా కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన ఫ్లెక్సీలను బ్యాక్‌డ్రాప్‌గా మరియు సెల్ఫీ పాయింట్ల వద్ద ఏర్పాటు చేయాలని, డప్పు చాటింపు ద్వారా ప్రజలకు కార్యక్రమాల గురించి విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. అలాగే, ప్రతి రోజు

నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన సమావేశాలు, కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించడంతో పాటు, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా ఆదిసేవా కేంద్రాల స్థానాల మ్యాపింగ్‌ను నవీకరించాలని, ప్రతి ఆదిసేవా కేంద్రానికి ఇద్దరు వాలంటీర్లను నియమించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యదర్శుల మార్పులు, కొత్తగా నియమితులైన కార్యదర్శుల వివరాలను ఐటీడీఏ భద్రాచలం కార్యాలయానికి అందజేయాలని ఆయన అన్నారు. ప్రతి ఎంపీడీవో కార్యాలయంలో ఒక ప్రత్యేక అధికారిని నియమించి, అవసరమైన సమాచారాన్ని సేకరించి ఐటీడీఏ భద్రాచలం కార్యాలయానికి పంపించాలని తెలిపారు.

విద్యాసంస్థల్లో కూడా ఆదిసేవా కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని, విద్యార్థులకు క్విజ్, కవితా రచన, వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లో కూడా ఫ్లెక్సీలు, సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులకు కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు.

అన్ని శాఖల అధికారులు, ఎంపిడిఓలు, విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాళ్లు ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, పత్రికా కథనాలను ప్రత్యేక ఫోల్డర్‌లో భద్రపరిచి apog.bcm@gmail.com కు పంపించాలని, అదేవిధంగా రోజువారీ వివరాలను "అధిప్రసరన్" పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు నవంబర్ 1 నుండి 15 వరకు నిర్వహించిన కార్యక్రమాలపై రోజువారీ నివేదికలు, ఫోటోలు, వీడియోలు, పత్రికా కథనాలతో కూడిన సమగ్ర డాక్యుమెంటేషన్ సిద్ధం చేసి 17 నవంబర్ 2026న డిడి (టిడబ్ల్యూ) లేదా, ఆర్సిఓ-గురుకులం వారికి సమర్పించాలని సూచించారు. ఆదిసేవా కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం కావడానికి సంబంధిత అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## మోడీ గారి సహకారంతో ఈ సమస్యకు పరిష్కారం అందిస్తామని హామీ ఇస్తున్నాం..

- ఈటల రాజేందర్..

**జవహర్ నగర్ :అక్టోబర్ 30 ( ప్రజావాణి ప్రతినిధి )**- మూడు రోజులుగా రాంకీ వాసన వచ్చే పనులు ఆపిందట. సువాసన వచ్చే స్ప్రేలు కొడుతున్నారు అని నాకు వాట్స్ అప్ లో పంపించారు. - మేము వస్తె స్ప్రే లు కొట్టుడు కాదు.. నీకు ఇచ్చిన పని సక్కంగా చెయ్యి.

- ఇది పార్టీలకు, జెండాలకు సంబంధం లేని అంశం.
- ఈటల రాజేందర్ పని లేక తిరుగుతున్నాడు అని మాట్లాడుతున్న మిమ్ముల్ని చూసి జాలిపడుతున్న. వీళ్లేనా మా నాయకులు వీరికేనా మాకు ఓటు వేసేది అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ భవిష్యత్తు ప్రజలు ఇస్తారు. ప్రజలకు వ్యతిరేకంగా ఉంటే అసహ్యించుకుంటారు.
- అఖిలపక్షంగా వెళితే నా అధ్యక్షతనే మీటింగ్ పెట్టిన రేవంత్ రెడ్డి మూన్నాళ్ళముచ్చట చేశారు.
- మున్నేళ్లలో చెత్త రాకుండా చేస్తా అన్నారు.
- చూసి మీరు చేయడంలేదని నేను రోడ్డెక్కాను.
- కన్నతల్లిలాంటి చెరువు కాలకూట విషంగా మారింది.
- రాంకీ తప్పుడు రిపోర్ట్స్ ఇచ్చి మభ్యపెట్టవద్దు.
- ఈ డంప్ ఎత్తివేసే వరకు మా పోరాటం ఆగదు.
- ఈ బాధితులు ఒంటరి కాదు మేము మీకు అండగా ఉంటాం.
- మోడీ గారి సహకారంతో ఈ సమస్యకు పరిష్కారం అందిస్తామని హామీ ఇస్తున్నాం..

# సమాజ సేవలో రెడ్ క్రాస్ సొసైటీ...!

**భద్రాచలం, అక్టోబర్ 30 (మన ప్రజావాణి):** మానవత్వం, వైద్య సేవలు, పేద, గిరిజన ప్రజల సంక్షేమమే లక్ష్యంగా భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ భద్రాద్రి కొత్తగూడెం గత ఏడు సంవత్సరాలుగా పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, గిరిజన ప్రజల సంక్షేమం కోసం అనేక విశేషమైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. సమిష్టి కృషి, అంకితభావంతో వైద్య, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తోంది.

రక్తనిధి (బ్లడ్ బ్యాంక్) స్థాపన, సేవలు

భద్రాచలంలో ఆధునిక రక్తనిధిని ఏర్పాటు చేయడం జిల్లా శాఖ సాధించిన ముఖ్యమైన విజయాలలో ఒకటి. ప్రతి సంవత్సరం సుమారు 3,000 మంది రోగులకు సురక్షితమైన రక్తాన్ని అందించడం జరుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అనేక మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడటం జరిగింది. రక్తంలోని వివిధ భాగాలను వేరుచేసే యంత్రాలు, ప్లేట్‌లెట్ల తయారీకి అవసరమైన పరికరాలు, సురక్షిత రక్త పరీక్షలకు ఆధునిక యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పరికరాలు, సౌకర్యాల విలువ సుమారు రూ. 1.5 కోట్లు తెలంగాణ రాష్ట్రంలోని 33 రెడ్‌క్రాస్ జిల్లా శాఖల్లో కేవలం 8 శాఖలకు మాత్రమే బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి.

తలసేమియా, సికిల్ సెల్, అనీమియా రోగులకు సేవలు

తలసేమియా, సికిల్ సెల్, అనీమియా అనేవి వంశపారంపర్యంగా వచ్చే రక్త సంబంధిత వ్యాధులు. ఈ వ్యాధులతో బాధపడుతున్న వారికి క్రమం తప్పకుండా రక్త మార్పిడి, నిరంతర వైద్య సేవలు అవసరం. గవర్నర్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ ద్వారా అందిన ఆర్థిక సహకారంతో సుమారు 200 మంది రోగులకు ప్రస్తుతం చికిత్స అందించబడుతోంది. ఈ రోగులకు ప్రతినెలా రక్త మార్పిడి అవసరం ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలోని రెడ్‌క్రాస్ జిల్లా శాఖల్లో కేవలం ఐదు జిల్లాల్లో మాత్రమే ఇటువంటి ప్రత్యేక సేవలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో భద్రాచలం శాఖ ఒకటి.

తలసేమియా, సికిల్ సెల్, అనీమియా ఉచిత పరీక్షలు.

తలసేమియా, సికిల్ సెల్, అనీమియా వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ఐఆర్‌సీఎస్ భద్రాచలం ఉచిత పరీక్షా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఒక్కో పరీక్షకు సుమారు రూ. 2,500 ఖర్చు అవుతుంది. ప్రతి సంవత్సరం సుమారు 2,000 మందికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత ఐదు సంవత్సరాలలో సుమారు 10,000 మందికి పరీక్షలు నిర్వహించగా, అందులో 1,200 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు అందుబాటులో ఉన్న రికార్డులు తెలియజేస్తున్నాయి. బాధితులకు, వారి కుటుంబాలకు అవగాహన, కౌన్సెలింగ్, నివారణ చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమానికి ఐటీసీ పీఎస్‌పీడీ సంస్థ ద్వారా వస్తు రూపంలో సహాయం, మందులు అందించబడ్డాయి. గత ఐదు సంవత్సరాలలో మొత్తం సుమారు రూ. 25 లక్షల విలువైన సహాయం అందింది. ప్రతి సంవత్సరం సుమారు రూ. 5 లక్షల మేర సహకారం లభిస్తోంది.

మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధి

గోగులపూడి, పుసుకుంత గ్రామాలతోపాటు, మారుమూల కోయ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రెడ్‌క్రాస్ సొసైటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఈ గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. సుమారు రూ. 2.5 కోట్ల వ్యయంతో కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలల నిర్మాణం చేపట్టడం జరిగింది. గ్రామాల్లో ఆరోగ్య అవగాహన, పోషకాహారం, రక్తహీనత నివారణకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గిరిజన ప్రజల ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

కంటి శస్త్రచికిత్సలు – అంధత్వ నివారణ

పేద ప్రజలకు కంటి చూపును తిరిగి అందించాలనే లక్ష్యంతో, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సుమారు 2,500 మందికి కాటరాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్రచికిత్సలు నిర్వహించబడ్డాయి. పేద, నిరుపేద రోగులకు శస్త్రచికిత్సలు చేయించడం జరిగింది. ఈ సేవల ద్వారా 129 గ్రామాలకు చెందిన ప్రజలు లబ్ధి పొందారు. అనేక మంది తమ కంటి చూపును తిరిగి పొంది మెరుగైన జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

క్యాన్సర్ గుర్తింపు శిబిరాలు..

క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చనే ఉద్దేశంతో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. సుమారు 400 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స పొందడంపై అవగాహన కల్పిస్తున్నారు.

గిరిజన ఆరోగ్య శిబిరాలు..

మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు అందుబాటులో లేని ప్రజలకు, ఆరోగ్య సేవలు అందించేందుకు రెడ్‌క్రాస్ అనేక వైద్య శిబిరాలు నిర్వహించింది. సుమారు 8,000 మంది గిరిజన ప్రజలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సేవలు అందించబడ్డాయి. మారుమూల ప్రాంతాల్లో నివసించే పేద ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు.

ప్రతిపాదిత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి

క్యాన్సర్, ఇతర తీవ్రమైన వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో భద్రాచలంలో ఒక సమగ్ర మల్టీ స్పెషాలిటీ వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతిపాదించింది. ఈ ఆసుపత్రిలో కింది సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం జరిగింది

క్యాన్సర్ గుర్తింపు.. నిర్ధారణ కేంద్రం...

కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రం, రక్తనిధి, రక్త మార్పిడి సేవలు, ఇతర ముఖ్యమైన ప్రత్యేక వైద్య సేవలు, ఈ ముఖ్యమైన ప్రాజెక్టు కోసం ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సహకారంతో సుమారు రూ. 1.5 కోట్ల విలువైన భూమిని కేటాయించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి ఆధునిక వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయడం ఒక విశేషమైన కార్యక్రమం. దీని ద్వారా పేద, గిరిజన ప్రజలకు వారి ప్రాంతంలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

ఏడు సంవత్సరాల సేవల సమగ్ర ఫలితం..

గత ఏడు సంవత్సరాలుగా భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ, భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ద్వారా వైద్య, ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సుమారు ఒక లక్ష మంది ప్రజలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సేవలు అందించడం జరిగింది. ప్రభుత్వం అందించిన భూమి, వైద్య పరికరాల విలువ సుమారు రూ. 8 కోట్లుగా అంచనా వేయబడింది. జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి జిల్లా కలెక్టర్ సొసైటీ ఫర్ ఎక్సలెంట్ సర్వీసెస్ అవార్డు ప్రదానం చేశారు.

గిరిజన విద్యార్థులకు కంటి పరీక్షల కార్యక్రమం..

రాబోయే రోజుల్లో 95 గిరిజన పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న సుమారు 25,000 మంది విద్యార్థులకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించాలని రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతిపాదించింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కంటి సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన చికిత్స, కంటి అద్దాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

సమిష్టి బాధ్యత – రెడ్‌క్రాస్ సేవల పరిరక్షణ

పైన పేర్కొన్న అన్ని సేవా కార్యక్రమాలు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు, వాలంటీర్లు, దాతలు, ప్రభుత్వ అధికారులు, సహకార సంస్థల సమిష్టి కృషి ఫలితంగా సాధ్యమయ్యాయి. కార్యవర్గ సభ్యులు తమ విలువైన సమయాన్ని, సేవలను, అంకితభావాన్ని సమాజ సంక్షేమం కోసం వినియోగిస్తూ, రెడ్‌క్రాస్ అభివృద్ధికి విశేష కృషి చేశారు. సొసైటీపై ఎవరైనా చేస్తున్న ఆరోపణలు వాస్తవాలు, ఆధారాలు లేనివి అయితే అవి నిరాధారమైనవిగా పరిగణించాలి. ఏవైనా అంశాలు ఉంటే వాటిని వాస్తవాలు, ఆధారాలు, నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరిశీలించాలి. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ అనేది వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఏర్పడిన సంస్థ కాదు. మానవత్వమే ప్రధాన ధ్యేయంగా, కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రజలకు సేవలు అందించే పవిత్రమైన సేవా సంస్థ కావున రెడ్‌క్రాస్ సొసైటీ తన రాజ్యాంగం, నియమనిబంధనలకు అనుగుణంగా యథావిధిగా సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు సంబంధిత అధికారులు సహకరించాలని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాము. మా సంకల్పం"మానవ సేవే మాధవ సేవ", రెడ్‌క్రాస్ సేవా స్ఫూర్తిని కాపాడుతూ, సంస్థను మరింత బలోపేతం చేస్తూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పేదలు, నిరుపేదలు, గిరిజన ప్రజలకు నిరంతరం సేవలు అందించేందుకు మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దాం.

# నిరూపిస్తే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తా.. ఎంపీతో రాజీనామా చేయిస్తారా?

- బీజేపీ నాయకులకు తాట్లవాయి సర్పంచ్ ఆకుల మల్లేశం బహిరంగ సవాల్

**రాయికల్, అక్టోబర్ 30 (ప్రజావాణి):** తనపై బీజేపీ నాయకులు చేసిన రూ. 50 వేల లంచం ఆరోపణలను నిరూపిస్తే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని, నిరూపించలేకపోతే ఎంపీతో రాజీనామా చేయిస్తారా? అని తాట్లవాయి సర్పంచ్ ఆకుల మల్లేశం బహిరంగ సవాల్ విసిరారు.రాయికల్ పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ అంశంపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, బీజేపీ నాయకులు శనివారం ఉదయం 10 గంటలకు తాట్లవాయి గ్రామంలోని వెలుగుబాట మహిళా సంఘం భవనం వద్దకు రావాలని ఆహ్వానించారు.ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సహకారంతో మహిళా సంఘం భవన నిర్మాణం పూర్తయిందని, వెలుగుబాట మహిళా సంఘం సభ్యులు తన సహకారంతో భవన ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారని తెలిపారు. రాజకీయ విమర్శలు చేయడం వేరని, వ్యక్తిగతంగా లంచం ఆరోపణలు చేయడం వేరని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధిలో భాగంగా చారిత్రక తాట్లవాయి రామాలయం, హనుమాన్ ఆలయాల అభివృద్ధికి ఎంపీ ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. ఎంపీగా ఎన్నికై ఏడేళ్లు గడిచినా గ్రామ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సభా వేదికపైనే కోరినట్లు వివరించారు. అయితే తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి బీజేపీ నాయకులు లంచం ఆరోపణలు చేయడం సరికాదన్నారు.ప్రజాప్రతినిధిగా గ్రామాభివృద్ధి కోసం నిధులు అడిగితే లంచం తీసుకున్నట్లు ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు ప్రకటించిన పథకాలకు సంబంధించిన నిధులు రాష్ట్ర వాటాగా, ప్రజలు చెల్లించే పన్నుల ద్వారా రావాల్సినవేనని పేర్కొన్నారు. ప్రజలు తనను రెండుసార్లు గెలిపించారని, వారి నమ్మకానికి అనుగుణంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నానని, ఇతరులకు సహాయం చేయడమే తప్ప లంచాలు తీసుకునే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు.బీజేపీ నాయకులు తనపై చేసిన రూ. 50 వేల లంచం ఆరోపణలకు ఆధారాలు ఉంటే బహిరంగంగా నిరూపించాలని, నిరూపించలేని పక్షంలో జగిత్యాల నియోజకవర్గ బీజేపీ నాయకురాలైన ఎంపీ రాజీనామాకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. శనివారం జరిగే బహిరంగ చర్చకు హాజరై ఆరోపణలకు ఆధారాలు చూపడంతో పాటు గ్రామాభివృద్ధిపై చర్చించాలని కోరారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, వైస్ చైర్మన్ గుజ్జల మోహన్ రెడ్డి, సర్పంచ్ బెజ్జంకి మోహన్, నాయకులు కోల శ్రీనివాస్, తలారి రాజేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హన్మాండ్లు, సాయిరాజ్, లావుడ్య సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం..!

**రాయికల్; అక్టోబర్ 30 (ప్రజావాణి)** ప్రజలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ అన్నారు.శుక్రవారం రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామపంచాయతీలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కరీంనగర్ రేకుర్తి కంటి హాస్పిటల్ వైద్యులచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఉచిత కంటి వైద్య శిబిరంలో 138 మందికి కంటి పరీక్షలు చేయగా 56మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి హాస్పిటల్ కు వైద్యతో సహా తరలి వెళ్లారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.లయన్స్ క్లబ్ సుమారు 3649 మందికి కంటి ఆపరేషన్లతో పాటుగా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.ఉచిత వైద్య సేవలు అందించేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీరటి శ్రీనివాస్,లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్,కోశాధికారి సుధవేణి మురళి,మాజీ జడ్ సి లు మోర హన్మాండ్లు, మ్యాకల రమేష్,టెక్నీషియన్ ప్రభాకర్,క్లబ్ సభ్యులు కొమ్ముల ఆదిరెడ్డి,మచ్చ శేఖర్,దాసరి గంగాధర్, కొత్తపెల్లి రంజిత్,బొడగం అంజిరెడ్డి,సత్యనారాయణ,ఆడెపు రాంప్రసాద్, అశోక్,గ్రామీణ వైద్యులు శ్రీనివాస్,రొట్టె శ్రీధర్, మహేష్,విడిసి చైర్మన్ వెల్మల ప్రతాప్ రెడ్డి,సాయిరెడ్డి,సామల్ల వేణు,కార్యదర్శి రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

- పేదల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు -- సర్పంచ్ బోద సైదిరెడ్డి

**గరిడేపల్లి అక్టోబర్30 (ప్రజావాణి):** గరిడేపల్లి మండలం ఎల్‌బీ నగర్ గ్రామంలో కందుల కోటమ్మ, బల్రెడ్డి గార్లకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీ బోద సైదిరెడ్డి హాజరై కొబ్బరికాయ కొట్టి ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఏఈ యోగి, గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేతిరెడ్డి వీరరెడ్డి, అనిల్, ఇళ్ల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పిల్లి అంజయ్య, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

# యూత్ అధ్యక్షుడిగా పొలాస అశోక్ కుమార్

- నియామక పత్రం అందజేసిన చామకూర మల్లారెడ్డి
- జవహర్ నగర్, ఫైల్ నెంబర్ 01. ఫోటో రైట్ అప్ : నూతన అధ్యక్షుణ్ణి అభినందించిన మల్లారెడ్డి

**కాప్రా అక్టోబర్ 30 ( ప్రజావాణి ప్రతినిధి):**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ జవహర్ నగర్ డివిజన్–3 BRS యూత్ అధ్యక్షుడిగా పొలాస అశోక్ కుమార్ నియమితులయ్యారు.మాజీ మంత్రి. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ నియామకం జరిగింది. ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.కార్యక్రమంలో మాజీ మేయర్ మేకల కావ్య, పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ పల్లపు రవి, నాయకులు సింగన్న బాలరాజ్, సిద్దులు, పొలాస సాయి కుమార్, బండి నవీన్, కృష్ణ యాదవ్, పల్లపు ప్రశాంత్, రాజు, అజీం, రవి పాల్గొన్నారు.మహిళా విభాగం నుంచి మల్లమ్మ, యాకమ్మ, యదాలక్ష్మి, కళావతి, లక్ష్మి, విమల, మహేశ్వరి, ధనలక్ష్మి హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా. యువజన సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవమైన పొలాస అశోక్ కుమార్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి, యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా భూక్య రవీందర్

**రాయికల్, అక్టోబర్ 30 (ప్రజావాణి):** తెలంగాణ రక్షణ సేన పార్టీ జగిత్యాల జిల్లా గిరిజన అధ్యక్షుడిగా రాయికల్ మండలంలోని దావన్ పల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు భూక్య రవీందర్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు.జిల్లాలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు గిరిజన సమస్యలపై నిరంతరం పోరాడుతున్న రవీందర్ సేవలను గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా భూక్య రవీందర్ మాట్లాడుతూ, తనకు అప్పగించిన ఈ విలువైన బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తున్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన గిరిజన బిడ్డల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో, ప్రతి గిరిజన గూడెంలో పార్టీ జెండాను ఎగురవేసి, గిరిజన సమాజ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నియామకంపై జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రవీందర్ నియామకంతో జిల్లాలో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి పునుగంటి పవన్ రావు, నాయకులు రాజేందర్, నాగరాజు, ఇంతియాజ్, వంశీ, వేణు తదితరులు పాల్గొని రవీందర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం..

- రక్తదానం ప్రాణదానంతో సమానం.. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి జిల్లా బ్యూరో అక్టోబర్ 30 (మన ప్రజావాణి):**

పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో, జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సైకిల్ ర్యాలీ, బైక్ ర్యాలీ, వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలతో పాటు అన్ని సబ్ డివిజన్ల పరిధిలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, అత్యవసర సమయాల్లో రక్తం ఎంతమందికి ప్రాణదానం చేయగలదనే విషయాలను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం సమాజానికి అందించే గొప్ప సేవ అని పేర్కొన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో విద్యార్థులు, యువకులు, మహిళలు, రాజకీయ ప్రముఖులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు తదితరులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వారికి పండ్లు, పండ్ల రసాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎంహెచ్ఓ తుకారం నాయక్, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, జితేందర్, యాసిన్, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, నరేష్, ఆర్ఐలు రవి, లాల్‌బాబు, కృష్ణారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని సందర్శించిన ఆల్ఫోర్స్ విద్యార్థులు

- క్షేత్ర పర్యటనతో వ్యవసాయం, పట్టు పరిశ్రమపై అవగాహన

**హుజురాబాద్ప్రజావాణి అక్టోబర్ :30** విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష అనుభవాన్ని అందించడంతో పాటు, సామాజిక, ప్రకృతి, వ్యవసాయ రంగాలపై అవగాహన కల్పించేందుకు విజ్ఞాన పర్యటనలు ఎంతగానో దోహదపడతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు.హుజురాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ పాఠశాల విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా తుమ్మనపల్లి గ్రామంలోని పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా వాటిపై మరింత అవగాహన పెంపొందించుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో పరిశీలనా శక్తి, జిజ్ఞాస, ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇలాంటి విజ్ఞాన పర్యటనలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ పర్యటనలో విద్యార్థులు పట్టుపురుగుల పెంపకం విధానం, మల్బరీ సాగు, పట్టుపురుగుల జీవన చక్రం, గుడ్ల నుంచి పురుగులుగా ఎదిగే దశలు, పట్టుపురుగులు గూళ్లు అల్లే విధానం, వాటి నుంచి పట్టుదారాన్ని సేకరించే ప్రక్రియ తదితర అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. పట్టు ఉత్పత్తి కోసం రైతులు అనుసరించే పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పట్టు పరిశ్రమలో రైతుల పాత్ర గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వ్యవసాయ రైతు బొక్కల వేణుగోపాల్ విద్యార్థులకు పట్టుపురుగుల పెంపకంలోని వివిధ దశలను క్షేత్రస్థాయిలో వివరించారు. పట్టుపురుగుల పెంపకానికి అనుకూలమైన వాతావరణం, వాటికి అందించే ఆహారం, పురుగుల సంరక్షణ, గూళ్ల తయారీ నుంచి పట్టుదారం ఉత్పత్తి వరకు జరిగే ప్రక్రియలను తెలియజేశారు. పట్టు సాగు ద్వారా రైతులకు లభించే ఉపాధి అవకాశాలు, వ్యవసాయ అనుబంధ రంగంగా సెరికల్చర్‌కు ఉన్న ప్రాధాన్యతను వివరించారు.విద్యార్థులు పట్టుపురుగుల పెంపకం కేంద్రంలోని వివిధ దశలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. పుస్తకాల్లో చదివిన అంశాలను స్వయంగా చూసి తెలుసుకోవడం ద్వారా వ్యవసాయం, పట్టు పరిశ్రమపై ఆచరణాత్మక అవగాహన పొందారు. అంతేకాకుండా రైతులు పడే శ్రమ, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రాముఖ్యతను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలల భద్రతకు చట్టాలపై అవగాహనే రక్షణ కవచం

**హుజురాబాద్ ప్రజావాణి అక్టోబర్ :30** బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టడంతో పాటు, వారి హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుల్లో సీనియర్ సివిల్ జడ్జ్ పి.బి కిరణ్ కుమార్ హుజురాబాద్ చట్టం పైన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరిస్తూ, మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాలను, అసభ్య ప్రవర్తనను గుర్తించే విధానాలను విద్యార్థులకు వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడటం చట్టరీత్యా శిక్షార్హమని, ఇలాంటి ఘటనలను దాచిపెట్టకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి తన హక్కులను తెలుసుకోవడంతో పాటు వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని తెలిపారు. బాలలపై లైంగిక నేరాలను నిరోధించేందుకు, బాధిత బాలబాలికలకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం అమలులో ఉందని వివరించారు.పిల్లల భద్రత కేవలం తల్లిదండ్రుల బాధ్యత మాత్రమే కాదని, పాఠశాలలు, ఉపాధ్యాయులు, సమాజం కూడా సమష్టిగా బాధ్యత తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, చట్టాలపై అవగాహన పెంపొందించడం ద్వారా బాలల హక్కులను సమర్థవంతంగా పరిరక్షించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన ఎంపీడీవోకు ఘన సన్మానం

- దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు గ్రామ సర్పంచ్ దార సురేష్

**జమ్మికుంట అక్టోబర్ 30 (ప్రజావాణి)** కరీంనగర్ జిల్లాఇల్లంతకుంట మండల ఎంపీడీవో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ మల్హోత్ర నిఈ శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు ఇల్లంతకుంట గ్రామపంచాయతీలో మర్యాదపూర్వకంగా కలిసి ఎంపీడీవో ని శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగిందిఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఇల్లంతకుంట మండల అభివృద్ధి గ్రామాల పురోగతి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారుప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ తన పదవీ కాలాన్ని విజయవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలియజేశారుఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దార సురేష్ ధర్మకర్త గొడిశాల పరమేష్, గ్రామ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చౌడాపూర్‌లో ఘనంగా టీడబ్ల్యూజే హెచ్ -143 యూనియన్ కార్యాలయ ప్రారంభోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు కండ్లపల్లి రవీంద్ర

**ప్రజా వాణి, వికారాబాద్ జిల్లా, అక్టోబర్ 30:**జర్నలిస్టుల ఐక్యత,సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ టీడబ్ల్యూజే హెచ్ -143) ఆధ్వర్యంలో చౌడాపూర్‌లో ఏర్పాటు చేసిన యూనియన్ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కండ్లపల్లి రవీంద్ర హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూనియన్ వేదికగా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల హక్కుల సాధన, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భద్రత,సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు యూనియన్ కార్యాలయం అందుబాటులో ఉండటం వల్ల వారి సమస్యలను చర్చించుకోవడానికి, సంఘటితంగా ముందుకు సాగడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.జర్నలిస్టుల ఐక్యతే యూనియన్ బలమని, ప్రతి జర్నలిస్టుకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,జర్నలిస్టులు పాల్గొన్నారు.

# చౌడాపూర్‌లో ఘనంగా టియు డబ్ల్యూజే హెచ్-143 యూనియన్ కార్యాలయ ప్రారంభోత్సవం..

- ముఖ్య అతిథిగా పాల్గొన్న వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కండ్లపల్లి రవీంద్ర..

**పరిగి/చౌడాపూర్, అక్టోబర్ 30( ప్రజావాణి )**వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టీయూడబ్ల్యూజే హెచ్-143) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల ప్రెస్ క్లబ్, యూనియన్ కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కండ్లపల్లి రవీంద్ర రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా చౌడాపూర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామస్వామి, జనరల్ సెక్రటరీ యశ్వంత్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, తదితరులు జిల్లా అధ్యక్షులు కండ్లపల్లి రవీంద్ర,తో పాటు జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్, నర్సింహులును శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులను సైతం శాలువాలతో సత్కరించారు.అనంతరం కండ్లపల్లి రవీంద్ర మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణే యూనియన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న

సమస్యల పరిష్కారానికి యూనియన్ నాయకులు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాల అమలు, ఇతర హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు యూనియన్ కార్యాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, తమ సమస్యలను చర్చించుకోవడానికి, పరస్పర సహకారంతో ముందుకు సాగడానికి ఇది మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఐక్యతే యూనియన్‌కు బలమని, ప్రతి జర్నలిస్టుకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి, చెడులను

ప్రజలకు తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టుల సేవలు అభినందనీయమని అన్నారు. జర్నలిస్టులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుధాకర్ రెడ్డి, నాగరాజు, అశోక్, రాజు, రాందాస్, చౌడాపూర్ సర్పంచ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీడీవో, ఎంఈఓ, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.అదేవిధంగా పరిగి నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ సీమ ఆనంద్, కుల్కచర్ల మండల అధ్యక్షులు నర్సింహులు, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర చారి, కార్యదర్శి చంద్రశేఖర్, దోమ మండల అధ్యక్షులు రాము, జర్నలిస్టులు సురేష్, రఘు, చారి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గుండాల ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ పై గరం గరం...

- పాఠశాలలో లోపాలపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి..
- ప్రిన్సిపాల్‌కు మెమో, వంట మనిషిని తొలగించాలని ఆదేశం..
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలి..
- విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం సహించేది లేదు.. కలెక్టర్ అంకిత్
- మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..
- మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలి.
- భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలి..
- రైతులకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా సర్వే నిర్వహించాలి..

**భద్రాద్రి జిల్లా బ్యూరో, అక్టోబర్ 30 (మన ప్రజావాణి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం రోజు విస్తృతంగా పర్యటించి, భూ రీ సర్వే పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. గుండాల రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ సర్వే పురోగతిని, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 10,390 ఎకరాల విస్తీర్ణంలో 6,694 ఎకరాలు అటవీ భూములుగా ఉన్నాయని, అటవీ శాఖ గెజిట్ ప్రకారం నిర్దేశించిన హద్దులు, ఎన్‌క్లోజర్ లేయర్ల ఆధారంగా మిగిలిన భూముల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 950 ఎకరాల్లో సర్వే పూర్తికాగా, అందులో 561 ఎకరాల ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించినట్లు సిబ్బంది వివరించారు.

రైతుల సమక్షంలోనే భూముల హద్దులను నిర్ధారించాలని, వారి పేర్లు, సంతకాలు, ఆధార్, మొబైల్ వివరాలను ఫీల్డ్ రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పహాణీ, పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలతో పాటు, ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. అటవీ, అసైన్డ్, రెవెన్యూ భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రైతుల అభ్యంతరాలను సంబంధిత శాఖల

సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని, భూ రీ సర్వే ప్రక్రియను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీఎస్ పరికరాల పనితీరును కూడా పరిశీలించారు.

అనంతరం గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ అందిస్తున్న వైద్య సేవలు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, వైద్య పరికరాల లభ్యతపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించగా అత్యవసర వైద్య అవసరాలకు ఉపయోగించే సిరంజీలు అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించి కారణాలను ప్రశ్నించారు. ఇంటర్నెట్ సమస్యల కారణంగా మందులు, వైద్య సామగ్రి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పటికే ఇండెంట్ పెట్టామని వైద్యాధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సిరంజీలు, అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, మందులు, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మారుమూల ప్రాంత ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.

అనంతరం గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, భోజన సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులు లేకపోవడాన్ని గమనించి, తరగతుల సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, సాంస్కృతిక కార్యక్రమాలను సెలవు రోజుల్లో నిర్వహించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు

హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. పాఠశాల మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంటశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించగా, బంగాళాదుంపలు కుళ్లిపోయి ఉండటం, పంచదారలో చీమలు పట్టి ఉండటాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వంట మనిషిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ సాంబార్, రసం పలుచగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోజు ప్రభుత్వ మెనూ ప్రకారం బిర్యానీ వడ్డించాల్సి ఉండగా, అందుకు అనుగుణంగా భోజనం సిద్ధం చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన, పారిశుద్ధ్యం, భోజన నాణ్యత, ఆహార పదార్థాల నిల్వలో గుర్తించిన లోపాలపై ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సర్పంచ్ రాధా, తహసీల్దార్ సంగీత, ఎంపీడీవో బాలరాజు, ఎంఈఓ పార్వతి, ఎంపీవో త్రిలోక్, సర్వేయర్ శివకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 23న ప్రతిజ్ఞ దివస్‌ను విజయవంతం చేయాలి

- కాకతీయ యూనివర్సిటీలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- స్వేరో యూనివర్సిటీ అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్

**కాకతీయ యూనివర్సిటీ, అక్టోబర్ 30 (ప్రజావాణి):** నవంబర్ 23న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించనున్న స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమాన్ని విద్యార్థులు, స్వేరోస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, కార్యక్రమ కన్వీనర్ ఎల్తూరి సాయికుమార్ పిలుపునిచ్చారు.

శుక్రవారం (అక్టోబర్ 30) కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ (SDLCE) ప్రాంగణంలో నవంబర్ 23న నిర్వహించనున్న ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎల్తూరి సాయికుమార్ మాట్లాడుతూ, 2026 నవంబర్ 23న కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియం ముందు

స్వేరో స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, విద్య పట్ల అవగాహన, సమానత్వ భావన, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని అన్నారు. సమాజంలోని అసమానతలను తొలగిస్తూ, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా యువత చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, స్వేరోస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని విద్యార్థులకు చేరవేసి, పెద్ద సంఖ్యలో పాల్గొనేలా కృషి చేయాలని సూచించారు. సామాజిక మార్పు, విద్యా ప్రాధాన్యత, సమానత్వం వంటి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీనియర్ స్వేరోస్ నాయకులు, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ నాయకులు, పీపీఎల్ నాయకులు, కార్యక్రమ కో-కన్వీనర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కంబాలదిన్నెలో వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం

- ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లకు విజ్ఞప్తి

**పెద్దకడబూరు అక్టోబర్: 31 ప్రజావాణి** మండల పరిధిలోని కంబాలదిన్నె గ్రామంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ విధానాలు, గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వై. సీతారామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌రెడ్డి, యువనేత ధరణిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామని నాయకులు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజలకు రేషన్ షాప్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

- పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక స్మార్ట్ రేషన్ కార్డులు
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్య, యూత్

**జమ్మికుంట అక్టోబర్ 30 (ప్రజావాణి)**జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 8,9,10,11 వార్డులకు సంబంధించిన ప్రజలకు మోత్కులగూడెం లోని రేషన్ షాప్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందిఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి సదయ్య, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్ మాట్లాడుతూ; ఈ స్మార్ట్ రేషన్ కార్డులు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీకలని అన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 8, 9, 10, 11 వార్డులకు చెందిన లబ్ధిదారులకు మోత్కులగూడెంలోని రేషన్ షాపు వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ప్రజలను ఉద్దేశించి, శాసనసభ ఎన్నికల సమయంలో హస్తం గుర్తుకు ఓటు వేస్తే పేదల బతుకుల్లో మార్పు తీసుకొస్తామని రాహుల్ గాంధీ నేతృత్వంలో, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ప్రజా ప్రభుత్వం పేదల ఆకలి హక్కును గౌరవిస్తోందని కొనియాడారు. గత పదేళ్ల పాలనలో రేషన్ కార్డుల విషయంలో పేద ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. వివాహమైన కొత్త జంటలు, పుట్టిన చిన్నారుల పేర్లను రేషన్ కార్డుల్లో చేర్చుకోవడానికి కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేసిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్నారు. పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించడంలో గత పాలకులు నిర్లక్ష్యం ప్రదర్శించారని ఆరోపించారుప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా చేతల్లో పాలనను చూపిస్తోందని తెలిపారు. నేడు పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు కేవలం రేషన్ సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా, పేదల ఆత్మగౌరవానికి గుర్తింపుగా నిలుస్తాయని అన్నారు. తొమ్మిది రకాల భద్రతా లక్షణాలతో అవినీతికి, దళారుల దోపిడీకి తావులేకుండా ఆధునిక డిజిటల్ సాంకేతికతతో ఈ కార్డులను ప్రభుత్వం అందిస్తోందని వివరించారుగత ప్రభుత్వ హయాంలో దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో వాటిని వినియోగించుకోలేక కొందరు ఇతర అవసరాలకు మళ్లించిన పరిస్థితులు ఉండేవని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ నాణ్యమైన సన్నబియ్యం తినాలనే లక్ష్యంతో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ సన్నబియ్యం సరఫరానే నిదర్శనమని పేర్కొన్నారుప్రజల పక్షాన నిలుస్తున్న ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు, మద్దతు ఎల్లప్పుడూ ఉండాలని కోరారుఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 8, 9, 10, 11 వార్డులకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ 11 వ వార్డు కౌన్సిలర్ పొనగంటి విష్ణు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొనగంటి రవీందర్, జమ్మికుంట మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం అశోక్, రాజ కొమురయ్య, యేబుషి ఓదెలు, ఉడుగుల మల్లయ్య, కట్ట దేవేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి - ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

**రాయికల్, అక్టోబర్ 30 (ప్రజావాణి):**ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వైద్యులకు సూచించారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.శుక్రవారం రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ శశికాంత్ రెడ్డి ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, ఇప్పటివరకు అందించిన సేవల వివరాలు, ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతుల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుతో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. వృత్తిపరంగా తాను కూడా డాక్టర్ నే కావడంతో జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.ఆసుపత్రిలో ఓపీ, ఐపీ సేవలు బాగున్నాయని, సాధారణ ప్రసవాల కోసం వైద్యులు మరింత కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సమస్యలను తన దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, వసతుల గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలో వసతులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, నిధులు మంజూరుకు కృషి చేస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ మనోహర్ గౌడ్, తహసీల్దార్ నాగార్జున, కౌన్సిలర్ తోపారపు స్రవంతి సురేష్, వైద్యులు డాక్టర్ రామకృష్ణ, సుదక్షిణ, శ్రీకాంత్, రజిత, సుధ, రాజ్ కుమార్, అఖిల, సిందూజ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్, హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, నాయకులు కోల శ్రీనివాస్, తలారి రాజేష్, స్పందన సాగర్ రావు, మచ్చ శేఖర్, మున్ను, గుర్రం మహేందర్ గౌడ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ప్రజావాణి ఆత్మకూరు: అక్టోబర్ 30** ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆత్మకూరు పీఏసీఎస్ నూతన చైర్‌పర్సన్‌గా శ్రీమతి నాగెల్లి స్వప్న ఆంధ్రయ్యతో పాటు నూతన పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నూతన చైర్‌పర్సన్‌తో పాటు పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి, వ్యవసాయ రంగ పురోగతికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంత రైతులకు పీఏసీఎస్ సంఘాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, రైతులకు అవసరమైన సేవలు, సహకారం అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.
నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్, పాలకమండలి సభ్యులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సహకార సంఘం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సంబంధిత సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.
రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఆత్మకూరు పీఏసీఎస్ అభివృద్ధికి నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సహకార సంఘం సభ్యులు, రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కార్వేటినగరంలో ఏపీ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ప్రారంభం

**కార్వేటినగరం, అక్టోబర్ 30:** మండలంలోని కత్తెరపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీ ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను డీసీఓ, అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ వి. జయప్రకాష్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలపై సమీక్షించారు. మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించి, అర్హులైన వారిని ఓపెన్ స్కూల్‌లో చేర్పించి అడ్మిషన్ల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. స్టడీ సెంటర్‌లో ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఈవెనింగ్ వాక్‌లో ప్రజలతో మమేకమైన మంత్రి సవితమ్మ

- పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సైకిల్ తొక్కుతూ సందడి

**అనంత పురం బ్యూరో అక్టోబర్ 30 ప్రజా వాణి** పెనుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈవెనింగ్ వాక్ సందర్భంగా బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ ప్రత్యేకంగా సందడి చేశారు. మైదానంలో సైకిల్ తొక్కుతూ వ్యాయామం చేశారు. ఈ సందర్భంగా అక్కడ వాకింగ్ చేస్తున్న ప్రజలు, యువతతో కలిసిపోయి ఆప్యాయంగా పలకరించారు.ప్రజలతో సరదాగా మాట్లాడుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతిరోజూ నడక, సైక్లింగ్ వంటి వ్యాయామాలకు సమయం కేటాయించాలని సూచించారు..

# పెంచికలపేట పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**ప్రజావాణి ఆత్మకూరు: అక్టోబర్ 30** మండలంలోని పెంచికలపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
పెంచికలపేట పీఏసీఎస్ చైర్మన్ శ్రీ ఎగితే లింగన్నతో పాటు నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన చైర్మన్, పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి, రైతుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకార సంఘాలు కీలక వేదికలని, వాటిని మరింత బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారి సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించే బాధ్యత నూతన పాలకవర్గంపై ఉందన్నారు. రైతు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసేలా పాలకవర్గ సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.
వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా క్లస్టర్ వారీగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు (ఎఫ్‌పీఓలు) ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.
కాలానుగుణంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను రైతులు అందిపుచ్చుకోవాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నూతన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను సకాలంలో అందించడంలో పీఏసీఎస్ సంఘాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు.నూతన పాలకవర్గం రైతులకు అందుబాటులో ఉంటూ, వారి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సహకార స్ఫూర్తితో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు

# బాధిత కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం

**టేకుమట్ల/అక్టోబర్30:** టేకుమట్ల మండలంలోని వెంకట్రావుపల్లి(బి) గ్రామంలో ఇటీవల కరెంట్ షాక్ తో మరణించిన కసరవేణి కుమార్ దశదినకర్మకు పదవ తరగతి స్నేహితులు హాజరై నివాళులర్పించి ఆ కుటుంబానికి 15 వేయిల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.కుమార్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని మనో ధైర్యాన్ని కల్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.కార్యక్రమంలో స్నేహితులు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం,ఆరెపల్లి శ్రీనివాస్,డాక్టర్ సదానందం,ఆకుల చేరాలు,నేరెళ్ల కుమార్, సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ దారా కవిత

- పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ దారా కవిత
- పోలీసుల పనితీరుపై సమీక్ష.. గంజాయి కేసును ఛేదించిన కానిస్టేబుళ్లకు అభినందనలు

**హసన్‌పర్తి, అక్టోబర్ 30 (మన ప్రజావాణి):**వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి పోలీసు సిబ్బంది ఘనంగా గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో డీసీపీ మొక్కను నాటారు.
ఈ తనిఖీల్లో కాజీపేట డివిజన్ ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్ పాల్గొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను, రికార్డులను డీసీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. సన్నిహిత వర్టికల్ కానిస్టేబుళ్లు గీత, కోమల, రైటర్ వర్టికల్ సిబ్బంది సుమన్, పూర్ణాచారి, సైబర్ క్రైమ్ వర్టికల్ రాజ్‌కుమార్, టెక్ టీమ్ వర్టికల్ సోమన్న, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వి. రవీందర్, కోర్టు కానిస్టేబుల్ ఈ. రాజేందర్ పనితీరును ప్రత్యక్షంగా సమీక్షించారు.

**గంజాయి కేసును ఛేదించిన కానిస్టేబుళ్లకు ప్రశంసలు**

ఇటీవల హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసును సమర్థవంతంగా ఛేదించి, నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన క్రైమ్ పార్టీ కానిస్టేబుళ్లు తిరుపతి, వెంకటస్వామి, బావు సింగ్‌లను డీసీపీ దారా కవిత ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో చూపిన అంకితభావాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు.

**పెండింగ్ కేసులపై ప్రత్యేక సమీక్ష**

పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతిని డీసీపీ సమీక్షించారు. నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని, టెక్ టీమ్, సైబర్ క్రైమ్ విభాగాలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు.
శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. వర్టికల్స్ వారీగా కేటాయించిన బాధ్యతలను పకడ్బందీగా నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి ఏఎస్ఐ ఆర్. మల్లికార్జున్, హెడ్ కానిస్టేబుళ్లు డి. యాదగిరి, బి.లక్ష్మణ్, ఆర్. శంకర్, బి. మంజుల,క్రైమ్ పార్టీ సిబ్బంది,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.8 కోట్లతో నూతన మున్సిపల్ భవన నిర్మాణ పనుల పరిశీలించిన

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**ప్రజా వాణి, వికారాబాద్ జిల్లా,అక్టోబర్ 30:** పరిగి పట్టణంలో రూ.8 కోట్ల వ్యయంతో అధునాతన సౌకర్యాలతో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులను పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్(సర్ )డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి,స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి,మాట్లాడుతూ.పరిగి పట్టణంలో రూ.8 కోట్లతో నిర్మిస్తున్న నూతన మున్సిపల్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ పరిపాలన సజావుగా సాగాలంటే అన్ని శాఖలకు అవసరమైన సౌకర్యాలు, వసతులతో కూడిన ఆధునిక పరిపాలనా భవనం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నామని, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

# ఫిలిప్స్ విధ్వంసం.. అరుదైన ప్రపంచ రికార్డు సొంతం!

**• భారత్‌పై పరుగుల వరద.. ఒకే ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన న్యూజిలాండ్ బ్యాటర్‌గా ఘనత**

న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన రికార్డును సృష్టించాడు. భారత్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి రికార్డుల పుస్తకాల్లో తన పేరును లిఖించుకున్నాడు. ముఖ్యంగా నాలుగో టీ20 మ్యాచ్‌లో భారత బౌలర్లపై విరుచుకుపడిన ఫిలిప్స్ భారీ సిక్సర్లు, బౌండరీలతో అభిమానులను అలరించాడు. కేవలం 46 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసి తన బ్యాటింగ్ సత్తాను చాటుకున్నాడు. నాలుగో టీ20లో ఫిలిప్స్ 49 బంతుల్లో 107 పరుగులు సాధించాడు. ఇందులో 10 సిక్సర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. అతడి దూకుడుతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ క్రమంలో భారత్‌పై టీ20ల్లో అత్యధిక స్కోరు నమోదు చేసిన జట్టుగా న్యూజిలాండ్ నిలిచింది. ఫిలిప్స్‌కు మరోవైపు మైఖేల్ బ్రేస్‌వెల్ అద్భుత సహకారం అందించాడు. బ్రేస్‌వెల్ కేవలం 25 బంతుల్లోనే 65 పరుగులు చేసి భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు కేవలం 41 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో న్యూజిలాండ్ భారీ స్కోరు సాధించగలిగింది. ఈ సెంచరీతో ఫిలిప్స్ భారత్‌పై ఒక ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. నాలుగు మ్యాచ్‌ల్లో 92 సగటుతో 276 పరుగులు సాధించాడు. గతంలో వెస్టిండీస్ ఆటగాడు షాయ్ హోప్ భారత్‌పై సాధించిన 261 పరుగుల రికార్డును అధిగమించాడు. ఈ జాబితాలో ఇంగ్లండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ 229 పరుగులతో మూడో స్థానంలో, వెస్టిండీస్ ఆటగాడు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ 221 పరుగులతో నాలుగో స్థానంలో ఉన్నారు. అంతేకాకుండా ఫిలిప్స్ తన టీ20 అంతర్జాతీయ కెరీర్‌లో మూడో శతకాన్ని నమోదు చేశాడు. 46 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేయడం ద్వారా న్యూజిలాండ్ తరపున అత్యంత వేగంగా టీ20 శతకాలు సాధించిన ఆటగాళ్ల జాబితాలోనూ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. భారత్‌పై ఫిలిప్స్ చూపిన ఈ విధ్వంసకర బ్యాటింగ్ ప్రదర్శన క్రికెట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.

# టీ20 క్రికెట్‌లో రషీద్ ఖాన్ చరిత్ర.. 200 వికెట్ల అరుదైన ఘనత!

**పురుషుల అంతర్జాతీయ టీ20ల్లో ఈ మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా రికార్డు.. రెండో స్థానంలో ఇంగ్లండ్ బౌలర్ ఆదిల్ రషీద్**

అఫ్ఘానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. జింబాబ్వేతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. జింబాబ్వే బ్యాటర్ తడివనాషే మరుమానిని తొమ్మిదో ఓవర్‌లో ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేయడం ద్వారా రషీద్ తన 200వ వికెట్‌ను పూర్తి చేసుకున్నాడు. రషీద్ ఖాన్ తన 120వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లోనే ఈ అరుదైన మైలురాయిని చేరుకోవడం విశేషం. 2015లో అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన ఆయన, తన అద్భుతమైన స్పిన్ బౌలింగ్‌తో ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. తక్కువ పరుగులు ఇస్తూ కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టడంలో రషీద్‌కు మంచి పేరుంది. ఇప్పటివరకు రెండు సార్లు ఐదు వికెట్ల ఘనత సాధించగా, 3 పరుగులకు 5 వికెట్లు పడగొట్టడం అతడి అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది.

**ఆదిల్ రషీద్‌కు అందనంత దూరంలో..** అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో రషీద్ ఖాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్ బౌలర్ ఆదిల్ రషీద్

171 వికెట్లతో రెండో స్థానంలో ఉండగా, హాంకాంగ్‌కు చెందిన ఎహ్సాన్ ఖాన్, న్యూజిలాండ్ బౌలర్ ఇష్ సోధీ చెరో 165 వికెట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో రషీద్ ఖాన్ రెండో స్థానంలో ఉన్న ఆదిల్ రషీద్ కంటే 29 వికెట్ల ఆధిక్యంలో నిలిచాడు.

**బ్యాటింగ్‌లోనూ మెరిసిన రషీద్..** జింబాబ్వేతో జరిగిన ఈ మ్యాచ్‌లో రషీద్ బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ సత్తా చాటాడు. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ ఒక దశలో 38 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 50 బంతుల్లో 116 పరుగులతో అద్భుత శతకం సాధించగా, ఇజాజ్ అహ్మద్ అహ్మద్‌జాయ్ 27 బంతుల్లో 52 పరుగులు చేసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 142 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చివర్లో కెప్టెన్ రషీద్ ఖాన్ కేవలం ఆరు బంతుల్లోనే అజేయంగా 25 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు సిక్సర్లు ఉండటం విశేషం. దీంతో అఫ్ఘానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా అజేయ శతకంతో పోరాడినప్పటికీ, ఆ జట్టు 202 పరుగులకే పరిమితమైంది. దీంతో అఫ్ఘానిస్థాన్ 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే అఫ్ఘానిస్థాన్ కైవసం చేసుకుంది. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ రాణించిన రషీద్ ఖాన్ తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకుని క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు.

# నాలుగో టీ20లో న్యూజిలాండ్ ఘన విజయం

**- భారత్‌పై 87 పరుగుల తేడాతో గెలుపు.. సిరీస్‌లో తొలి విజయాన్ని అందుకున్న కివీస్**

**ఆక్లాండ్:** భారత్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ అద్భుత విజయాన్ని అందుకుంది. గ్లెన్ ఫిలిప్స్ విధ్వంసకర శతకం, మైఖేల్ బ్రేస్‌వెల్ మెరుపు అర్ధశతకం, జాకబ్ డఫీ పదునైన బౌలింగ్‌తో కివీస్ జట్టు 87 పరుగుల భారీ తేడాతో భారత్‌ను ఓడించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో వరుసగా మూడు విజయాలు సాధించి ఆధిక్యంలో ఉన్న భారత్‌కు ఈ మ్యాచ్‌లో ఎదురుదెబ్బ తగిలింది. అయితే ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా 3-1 ఆధిక్యంలో కొనసాగుతోంది.

**ఫిలిప్స్, బ్రేస్‌వెల్ విధ్వంసం.. భారీ స్కోరు** టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలుత న్యూజిలాండ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. ఆరంభంలోనే టిమ్ సీఫెర్ట్ (3), డారిల్ మిచెల్ (24) వికెట్లు కోల్పోయిన కివీస్‌ను ఫిన్ అలెన్ (31) ఆదుకున్నాడు. అనంతరం గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లతో 107 పరుగులు సాధించి అద్భుత శతకాన్ని నమోదు చేశాడు. అతడికి మైఖేల్ బ్రేస్‌వెల్ అద్భుత సహకారం అందించాడు. కేవలం 25 బంతుల్లో 6 సిక్సర్లు, 4 ఫోర్లతో 65 పరుగులు చేసి భారత బౌలర్లను ఉక్కిరిబిక్కిరి చేశాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు కేవలం 41 బంతుల్లోనే 115 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో

న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత్‌పై టీ20ల్లో ఒక జట్టు సాధించిన అత్యధిక స్కోరుగా ఇది నిలిచింది.

**ఆరంభంలోనే కుప్పకూలిన భారత్** 260 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఆరంభంలోనే షాక్ తగిలింది. న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ తొలి ఓవర్‌లోనే సంజూ శాంసన్, ఇషాన్ కిషన్‌లను పెవిలియన్‌కు పంపి భారత్‌ను దెబ్బతీశాడు. అనంతరం వికెట్లు వరుసగా పడిపోవడంతో భారత జట్టు లక్ష్య ఛేదనలో వెనుకబడింది. అభిషేక్ శర్మ 27, శ్రేయస్ అయ్యర్ 22, నితీశ్ కుమార్ రెడ్డి 28, తిలక్ వర్మ 35 పరుగులు చేసినప్పటికీ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 172 పరుగులకే పరిమితమైంది.

**డఫీ పదునైన బౌలింగ్.. కివీస్‌కు ఊరట** న్యూజిలాండ్ పేసర్ జాకబ్ డఫీ అద్భుత బౌలింగ్‌తో భారత బ్యాటర్లను కట్టడి చేశాడు. నాలుగు ఓవర్లలో 23 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. మిచెల్ సాంట్నర్ కూడా కీలక వికెట్లు తీసి భారత పతనాన్ని వేగవంతం చేశాడు. దీంతో న్యూజిలాండ్ 87 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా మూడు ఓటముల తర్వాత కివీస్‌కు ఈ గెలుపు ఊరటనిచ్చింది. మరోవైపు భారత్‌కు న్యూజిలాండ్ గడ్డపై టీ20ల్లో ఉన్న అజేయ విజయాల పరంపరకు తెరపడింది. ఐదో, చివరి టీ20 మ్యాచ్ నవంబర్ 1న హామిల్టన్‌లో జరగనుంది.

# అండర్-19 ఆసియా కప్‌కు భారత జట్టు ప్రకటన

**● జట్టులో సెహ్వాగ్, ద్రవిడ్ తనయులు..**

**కెప్టెన్‌గా లక్ష్య రాయ్‌చందానీ**

**న్యూఢిల్లీ:** అండర్-19 ఆసియా కప్ 2026 టోర్నమెంట్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టులో భారత క్రికెట్ దిగ్గజాలు వీరేంద్ర సెహ్వాగ్, రాహుల్ ద్రవిడ్ తనయులు ఆర్యవీర్ సెహ్వాగ్, అన్వయ్ ద్రవిడ్ చోటు దక్కించుకోవడం విశేషం. నవంబర్ 5 నుంచి 14 వరకు ఒమన్‌లోని మస్కట్ వేదికగా ఈ టోర్నీ జరగనుంది. భారత జట్టుకు లక్ష్య రాయ్‌చందానీ కెప్టెన్‌గా, యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు.

**మెరుగైన ప్రదర్శనతో జట్టులో చోటు** ఇటీవల జరిగిన వినూ మంకడ్ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆర్యవీర్, అన్వయ్‌లకు సెలెక్టర్లు అవకాశం కల్పించారు. ఢిల్లీ తరపున ఆడుతున్న 19 ఏళ్ల ఆర్యవీర్ సెహ్వాగ్ చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో 143 బంతుల్లో 173 పరుగులు సాధించి ఆకట్టుకున్నాడు. మరోవైపు కర్ణాటక తరపున బరిలోకి దిగిన 17 ఏళ్ల అన్వయ్ ద్రవిడ్ గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 100 బంతుల్లోనే 151 పరుగులు సాధించాడు. గతంలో శ్రీలంకతో జరిగిన యువ వన్డే మ్యాచ్‌లోనూ అన్వయ్ 67 బంతుల్లో 87 పరుగులు చేసి తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ ప్రదర్శనలే ఆసియా కప్ జట్టులో వారికి చోటు దక్కడానికి దోహదపడ్డాయి.

**పాకిస్థాన్‌తో కీలక పోరు** ఈ టోర్నీలో భారత్ గ్రూప్-ఎలో చోటు దక్కించుకుంది. ఈ గ్రూపులో పాకిస్థాన్, నేపాల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్లు ఉన్నాయి. గ్రూప్-బిలో బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్, మలేషియా జట్లు పోటీపడనున్నాయి. భారత్ నవంబర్ 6న నేపాల్‌తో తొలి మ్యాచ్ ఆడనుండగా, నవంబర్ 8న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. నవంబర్ 10న యూఏఈతో చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నవంబర్ 12న జరిగే సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. నవంబర్ 14న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. భారత అండర్-19 జట్టు: లక్ష్య రాయ్‌చందానీ (కెప్టెన్), ఆర్యవీర్ సెహ్వాగ్, వి.కె. వినీత్, యశ్వర్ధన్ సింగ్ చౌహాన్ (వైస్ కెప్టెన్), కుషాగ్ర ఓజా, అర్జున్ రాజ్‌పుత్, మణాల్ చౌహాన్, అన్వయ్ ద్రవిడ్, రజత్ బఘేల్, వి. యశ్వీర్, ఆర్యన్ సావసాని, మోహిత్ ఉల్వా, కావ్య పటేల్, షవిన్ వినోద్, ఇషాన్ సూద్.

# టీమిండియాకు ఎదురుదెబ్బ.. వన్డే సిరీస్‌కు స్టార్ పేసర్ దూరం!

**- న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ముందు గాయం కారణంగా ప్రసిద్ధ్ కృష్ణ ఔట్.. ఫిట్‌నెస్ సాధించడంలో విఫలం**

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్‌తో త్వరలో ప్రారంభం కానున్న ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ గాయం కారణంగా ఈ సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న అతడు ఇంకా పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ నిర్ణయం తీసుకుంది. నవంబర్ 4 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో అతడి సేవలు అందుబాటులో ఉండవు.

**వెస్టిండీస్ సిరీస్‌లో గాయం.. కోలుకోవడానికి మరింత సమయం** ఇటీవల వెస్టిండీస్‌తో స్వదేశంలో

జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా ప్రసిద్ధ్ కృష్ణ గాయపడ్డాడు. రెండో వన్డే సమయంలో తొడ కండరాలకు గాయం కావడంతో మైదానానికి దూరమయ్యాడు. అప్పటి నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాస చికిత్స పొందుతున్నాడు. వన్డే సిరీస్‌కు ఎంపికైనప్పటికీ అతడి భాగస్వామ్యం ఫిట్‌నెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంపై ఆధారపడి ఉంది. అయితే మ్యాచ్‌లు ఆడేందుకు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరింత సమయం కావాలని వైద్య బృందం సూచించింది. దీంతో న్యూజిలాండ్ పర్యటనలో వన్డే సిరీస్‌కు అతడిని దూరంగా ఉంచారు.

**సిరాజ్‌కు ఇండియా-ఎ జట్టులో చోటు** మరోవైపు సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను న్యూజిలాండ్-ఎతో జరిగే రెండో నాలుగు రోజుల మ్యాచ్ కోసం ఇండియా-ఎ జట్టులోకి చేర్చారు. అక్టోబర్ 31 నుంచి క్రైస్ట్‌చర్చ్‌లో ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది. టెస్టు సిరీస్‌కు ముందు మ్యాచ్ ప్రాక్టీస్ పొందేందుకు ఈ అవకాశం ఉపయోగపడనుంది. అలాగే ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి తొలి వన్డే వరకు భారత జట్టుతోనే కొనసాగనున్నాడు. న్యూజిలాండ్-ఎతో జరిగే చివరి నాలుగు రోజుల మ్యాచ్ కోసం ఇండియా-ఎ జట్టులో చేరనున్నాడు.

**నవంబర్ 4 నుంచి వన్డే సమరం** భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నవంబర్ 4న ఆక్లాండ్‌లో ప్రారంభం కానుంది.

## 'ఛావా' డైరెక్టర్ నుంచి మరో బయోపిక్..
# ఆకట్టుకుంటున్న 'ఈతా' ట్రైలర్

బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం 'ఈతా'. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ లావణీ కళాకారిణి వితాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ బయోపిక్ తెరకెక్కుతోంది. 'ఛావా' వంటి బ్లాక్‌బస్టర్ చిత్ర దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ దీనికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు.
మహారాష్ట్ర జానపద సంస్కృతిలో భాగమైన లావణీ నృత్యంలో ఆరితేరిన వితాబాయి పాత్రలో శ్రద్ధా కపూర్ ఒదిగిపోయినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఒక సాధారణ మహిళా కళాకారిణి తన ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాలను ఇందులో కళ్లకు కట్టినట్లు చూపించారు. ఇది శ్రద్ధా కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోయే పాత్ర అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై దినేష్ విజాన్ నిర్మిస్తున్నారు. విలక్షణ నటుడు రణ్‌దీప్ హూడా కూడా ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# పాక్‌లోనూ 'రామాయణ' ఫీవర్..
## రణ్‌బీర్ సినిమా కోసం కరాచీ హిందువుల పూజలు..

భారతీయ సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన చిత్రం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్'. దర్శకుడు నితీశ్ తివారీ రూపొందించిన ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ అంచనాలు పెరుగుతున్నాయి. కేవలం మన దేశంలోనే కాకుండా, సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లోనూ ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. తాజాగా పాకిస్థాన్‌లోని కరాచీలో నివసిస్తున్న హిందూ సమాజం ఈ సినిమా విజయం కోసం ప్రత్యేక వేడుకలు నిర్వహించడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.
స్థానిక యూట్యూబర్ షేర్ చేసిన ఒక వీడియోలో.. కరాచీలోని హిందువులు 'రామాయణ' సినిమా పోస్టర్‌ను పట్టుకుని వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. డప్పులు, సంప్రదాయ సంగీతం, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం కరాచీలోని ప్రసిద్ధ లక్ష్మీనారాయణ ఆలయానికి చేరుకుని, అక్కడ సినిమా పోస్టర్‌ను ప్రదర్శించి, చిత్రం ఘన విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాన పాత్రధారులైన రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, దర్శకుడు నితీశ్ తివారీతో పాటు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడమే కాకుండా, ఆస్కార్ అవార్డును కూడా గెలుచుకోవాలని ఆకాంక్షించారు.
ఈ వేడుకల ద్వారా తమ సంతోషాన్ని, సినిమా బృందానికి శుభాకాంక్షలను పంచుకుంటున్నామని వారు తెలిపారు. "పాకిస్థానీ హిందువులమైన మాకు, రామాయణ కేవలం ఒక సినిమా కాదు. దాని కథ, సాంస్కృతిక ప్రాముఖ్యత మా సంప్రదాయాలతో, తరతరాల వారసత్వంతో మమ్మల్ని కలుపుతుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విజయవంతం కావాలని కోరుకుంటున్నాం" అని ఆ వీడియోలో పేర్కొన్నారు.
మరోవైపు, ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ప్రీమియర్ షో తర్వాత 'రామాయణ' సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. సినిమా చూసిన పలువురు లెటర్‌బాక్స్‌డ్‌లో తమ రివ్యూలను పంచుకున్నారు. నటీనటుల ప్రదర్శన, సంగీతం, విజువల్ ఎఫెక్ట్స్, భావోద్వేగ సన్నివేశాలను వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.
ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటన ఎంతో స్వచ్ఛంగా ఉందని, రావణుడిగా యశ్ నటన సినిమాకే హైలైట్‌గా నిలిచిందని కొనియాడారు. చాలా మంది ప్రేక్షకులు ఈ సినిమాకు ఫైవ్ స్టార్ రేటింగ్స్ ఇస్తూ, పౌరాణిక గాథను తెరపై ఆవిష్కరించిన తీరు అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.
నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. మొదటి భాగం 'రామాయణ: ది రైజ్ ఆఫ్ ఎ లెజెండ్', దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటించారు.

# 9వ నెలలోనూ సమంత వర్కౌట్లు..

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం తన ప్రెగ్నెన్సీలో చివరి దశను ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఆమె, గర్భంతో ఉన్నప్పటికీ తన ఫిట్‌నెస్ పట్ల ఏమాత్రం రాజీ పడటం లేదు. తాజాగా తొమ్మిదో నెలలోకి అడుగుపెట్టిన సందర్భంగా తన గర్భధారణ ప్రయాణంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఒక స్ఫూర్తిదాయక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'చ9. ది ఫైనల్ ల్యాప్' (చివరి అంకం) అనే క్యాప్షన్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ వీడియోలో సమంత తన గర్భం దాల్చిన మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు వివిధ దశల్లో చేసిన వర్కౌట్లను చూపించారు. ముఖ్యంగా, లేటెస్ట్ క్లిప్‌లో ఆమె ఛాతీకి దగ్గరగా డంబెల్ పట్టుకుని వెయిటెడ్ స్క్వాట్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం కారణంగా తన శరీరం మార్పులకు అనుగుణంగా వ్యాయామ దినచర్యను ఎలా మార్చుకున్నారో సమంత గతంలోనే వివరించారు.
"ఈ రోజుల్లో ట్రైనింగ్ కాస్త భిన్నంగా ఉంది. ఎక్కువగా శ్రమించడం కంటే, శరీరం చెప్పేది వినడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాను" అని ఆమె గతంలో ఒక వర్కౌట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె షేర్ చేసిన వీడియో కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.
కాగా, సమంత తన భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. కొద్ది వారాల క్రితం, ఈ జంట కోయంబత్తూరులోని సద్గురు ఈశా ఫౌండేషన్‌లో తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను జరుపుకున్నారు. సమంత, రాజ్ 2025 డిసెంబర్‌లో ఇదే ఈశా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సమంత పోస్ట్‌పై నటి కృతి కర్బందా స్పందిస్తూ.. "మీ ముగ్గురికీ నా ప్రేమ" అంటూ కామెంట్ చేశారు. సమంత ఫిట్‌నెస్ స్ఫూర్తిపై అభిమానులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గర్భంతో ఉన్నప్పటికీ చురుకుగా ఉంటూ ఎంతో మందికి ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు

# చక్కనమ్మ చిక్కిందా?

బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు

# గొప్ప సందేశాన్నిచ్చే సినిమా

యువన్‌కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్, మనస్విని భాగ్యరాజ సమర్పణలో కార్తీక్ భాగ్యరాజ రచన, దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డియర్ ఆస్ట్రోనాట్'. ఈ చిత్రంలో సౌమిత్, శ్రేయసి సేన్, కమల్ కామరాజు, గీతా భాస్కర్, చైత్ర ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని నవంబర్ 20న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌కి సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ "ఆస్ట్రోనాట్ అవ్వాలనే కోరిక ఉండటం, ఆ కోరిక చుట్టూ కథను తీయడం బాగుంది. ఇది చాలా మంచి ప్రయోగం. ఎవరైనా సరే ఎంత పెద్ద కలలైనా కనొచ్చు, వాటిని సాకారం చేసుకోవచ్చు అనే గొప్ప సందేశాన్ని ఇచ్చేలా సినిమాని రూపొందించారు"అని అన్నారు. కమల్ కామరాజ్ మాట్లాడుతూ "కథకు ప్రాధాన్యమున్న చిత్రమిది. అందరికీ స్ఫూర్తినిచ్చే చిత్రమిది"అని తెలియజేశారు. సౌమిత్ మాట్లాడుతూ "డియర్ ఆస్ట్రోనాట్' చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రేక్షకులు అందరి పాత్రలతో ప్రయాణం చేస్తారు. మా సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రేయసి సేన్, శరణ్య ప్రదీప్, గీతా భాస్కర్, గడ్డం వీరు, మార్తాండ్ కె వెంకటేష్, కార్తిక్, కృష్ణవేణి, మేఘన పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net